ఒంగోలులో రోడ్లకు మహర్దశ వచ్చింది. నగరాభివృద్ధిలో భాగంగా ఇప్పటికే సెంటర్ డివైడర్ల నిర్మాణం, పచ్చని మొక్కలు నాటడం, లైటింగ్ ఏర్పాటు చేయడంతో కొత్త అందాలు సంతరించుకున్నాయి. అందుకనుగుణంగా రహదారులు విస్తరించకపోవడం పెద్ద సమస్యగా మారింది. మునిసిపాలిటీగా ఏర్పడిన నాటి రోడ్లే ఇప్పటికీ ఉండగా, కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ప్రకారం వాటి విస్తరణ లేకుండా పోయింది. ఈనేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కొన్ని రోడ్లను విస్తరించారు. మిగతా కీలకమైన వాటి దశ మార్చడానికి రంగం సిద్ధం చేశారు. విస్తరణలో నష్టపోయే భవన యజమానులకు పరిహారంగా టీడీఆర్ బాండ్లు అందించనున్నట్లు తెలిసింది.


విస్తరణ పనులు జరుగుతున్న సీవీఎన్ రీడింగ్ రూం రోడ్డు

నగరం.. నవ్యపథం

ఒంగోలులో రోడ్లకు మహర్దశ..!


విస్తరణతో విశాలంగా ఉన్న కొత్తపట్నం బస్టాండ్ సెంటర్

ట్రంక్ రోడ్డు కూడా విస్తరణ..!

మిరియాలపాలెం సెంటర్ నుంచి పాత మార్కెట్ వరకే ట్రంక్ రోడ్డును విస్తరణ చేసే దిశగా కూడా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. గతంలో కర్నూలు రోడ్డు విస్తరణ పనులు జరగ్గా, అదేసమయంలో ట్రంక్ రోడ్డునూ కూడా విస్తరించాలని నిర్ణయించారు. ఆ మార్గం 100 అడుగులు ఉండేలా మార్కింగ్ కూడా చేశారు. అయితే అప్పట్లో వ్యాపారులు సుముఖత వ్యక్తం చేయకపోవడం, ఇతరత్రా కారణాలతో వాయిదా పడింది. అయితే మరోసారి పదిహేనేళ్ల తర్వాత తిరిగి ట్రంక్‌రోడ్డు విస్తరణ అంశం తెరపైకి వచ్చినట్లు సమాచారం. దశల వారీగా చేపడుతున్న పనుల్లో భాగంగా దీన్ని కూడా 100 అడుగులు విస్తరించనున్నట్లు తెలిసింది.

- విస్తరణపై కార్పొరేషన్ అధికారుల దృష్టి
- ఇప్పటికే పలుచోట్ల మొదలైన పనులు
- విశాలంగా మారిన కర్నూలు రోడ్డు
- త్వరలో బీవీఎస్ హాల్ రోడ్డు, ట్రంక్‌రోడ్డు కూడా?
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెట్టేందుకు చర్యలు
- భవన యజమానులకు టీడీఆర్ బాండ్లు


త్వరలో విస్తరించనున్న ట్రంకురోడ్డు

ఒంగోలు, కార్పొరేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో వాహన ప్రయాణం అంటే ఇప్పటివరకు నరకమే. ఆ సమస్యకు చెక్‌పెట్టే దిశగా కార్పొరేషన్ అధికారులు అడుగులు వేస్తున్నారు. కీలకమైన రోడ్ల విస్తరణ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్నింటిని పూర్తిచేయగా, మిగతా వాటిలో ముఖ్యమైన రోడ్ల విషయమై కసరత్తు చేస్తున్నారు. మొత్తం 3లక్షలకుపైగా జనాభా కలిగిన నగరంలో 80శాతం మందికిపైగా వాహన వినియోగదారులు ఉన్నారు. 1876లో మునిసిపాలిటీగా ఏర్పడిన ఒంగోలుకు సుమారు 140 ఏళ్లు. అనాటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ కార్పొరేషన్ హోదాను దక్కించుకుంది. జిల్లాకేంద్రం కావడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ విద్యాసంస్థలు, పెద్ద ఆసుపత్రులు, వివిధ వ్యాపార సముదాయాలకు నిలయంగా మారింది. దీంతో కేవలం నగర జనాభానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రోజూ వచ్చిపోయే వారు వేలసంఖ్యలోనే ఉన్నారు. కాగా అందుకనుగుణంగా రోడ్లు లేక ఉన్నవాటికి ఇరువైపులా ఆక్రమణలు చోటుచేసుకోవడంతో వాహన ప్రయాణం కన్నా, కాలినడకే నయం అన్నచందంగా పరిస్థితి మారింది. ప్రస్తుతం 25 చదరపు కిలోమీటర్లు కలిగిన

మిగతా 6వ పేజీలో

త్వరలో బీవీఎస్ సెంటర్..

త్వరలోనే కొత్తపట్నం బస్టాండ్ నుంచి బీవీఎస్ సినిమా థియేటర్ మీదుగా పాత మార్కెట్ సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఇరువైపులా అటు 25 అడుగులు, ఇటు 25 అడుగులు వెడల్పు చేయనున్నారు. మొత్తం 80 అడుగుల రోడ్డు చేయనున్నారు. అందులో భాగంగా ఇటీవల ఆ ప్రాంత వ్యాపారులు, భవన యజమానులతో కమిషనర్ వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. నగర అభివృద్ధిలో చేపట్టే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు.



రేషన్ డోర్ డెలివరీ ఇక లేనట్లే!

ఆగిపోనున్న మొబైల్ వాహనాలు

ప్రభుత్వంపై భారీగా తగ్గనున్న భారం

- జిల్లాలో నెలకు రూ.80 లక్షల మేర ఆదా
- ఇకపై చౌకధరల దుకాణాల ద్వారానే పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) ద్వారా రేషన్ పంపిణీ ఇక నిలిచినట్లే. ఇటీవల కాలంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టడంతోపాటు ప్రభుత్వంపై అధికభారం పడుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశం చర్చకు దారితీసింది. ఐదు రోజుల క్రితం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఎండీయూ ఆపరేటర్ల సంఘ రాష్ట్ర నేతలతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఎండీయూలను నిలిపివేసి గతంలో మాదిరి చౌకధరల దుకాణాల ద్వారా నేరుగా కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ఈఎంఐలు ఎవరు కట్టాలి!

గత వైసీపీ ప్రభుత్వంలో ముద్ర లోను ద్వారా వాహనాలను కొనుగోలు చేయించారు. అప్పట్లో ప్రభుత్వమే ష్యూరిటీగా ఉండి ఎండీయూ ఆపరేటర్లకు వాహనాలను ఇప్పించింది. 2027 వరకు వాహనాల ద్వారా పంపిణీకి అవకాశం కల్పించింది. ఒక్కో వాహనానికి నెలకు రూ.3వేల ఈఎంఐ చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం వాటిని నిలిపి వేస్తే తాము ఏ విధంగా చెల్లించాలో అర్థం కాక వాహనదారుల్లో ఆందోళన నెలకొంది.

ఎండీయూల ద్వారా పంపిణీలో ఆలస్యం

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తూ వస్తున్నారు. దీనివలన బియ్యం పక్కదారి పట్టడంతోపాటు ప్రభుత్వంపై భారీగా ఆర్థికభారం పడుతోంది. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో 385 మొబైల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో దానికి నెలకు రూ.21వేలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆవిధంగా మొత్తం వాహనాలకు సుమారు రూ.80లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. మొబైల్ వాహనాల ద్వారా పంపిణీ కూడా ఆలస్యమవుతుండటాన్ని గుర్తించారు. పైగా కార్డుదారులు పనులను మానుకొని ఇళ్ల వద్దనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రోజువారీ కూలి పనులు చేసుకొని జీవనం సాగించే వారు ఒక్కోసారి రేషన్ తీసుకోలేకపోతున్నారు. మరోవైపు ఎండీయూ వాహనం వద్ద ఒక్కోసారి సర్వర్ పనిచేయక గంటల తరబడి వేచిఉండాల్సి వస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయం తీసుకుంది.


చిన్నదోర్నాల వద్ద చప్టాపై నుంచి ప్రవహిస్తున్న నీరు

మండు వేసవిలో వాన జోరు

ఈనెలలో 73.50 శాతం అధిక వర్షపాతం

- 11 మండలాల్లో రెట్టింపు కన్నా ఎక్కువ
- గిద్దలూరులో ఏకంగా నాలుగున్నర రెట్లు
- చల్లబడిన వాతావరణంతో ప్రజలకు ఉపశమనం
- 25 నుంచి రోహిణి కార్తె

ఒంగోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండు వేసవిలో వాన జోరు కనిపిస్తోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు, ఉక్కపోత వాతావరణంతో ఉక్కిరిబిక్కిరి కావాల్సిన సమయంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎండ తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఈ నెలలో సాధారణ వర్షపాతం 51.30 మి.మీ కాగా ఇప్పటికే సుమారు 60.20 మి.మీ నమోదైంది. మూడొంతుల మండలాల్లో సాధారణం కన్నా రెట్టింపు అంతకన్నా ఎక్కువ వర్షం కురిసింది. మరికొన్ని మండలాల్లో 50శాతం కన్నా అధికంగా పడింది. సాధారణంగా ఏడాది మొత్తం మీద ఎండల తీవ్రత అధికంగా ఉండేది ఈ నెలలోనే. జిల్లా అంతటా మే రెండో పక్షంలో 42 నుంచి 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అలాంటిది ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. రెండో వారంలో ఒక మోస్తరు ఎండలు ఉన్నప్పటికీ మూడో వారానికి వాతావరణంలో భారీ మార్పులు వచ్చాయి. నాలుగైదు రోజులుగా

మిగతా 6వ పేజీలో

విద్యాశాఖలో బదిలీల కోలాహలం

- ఉపాధ్యాయుల స్థానచలనాలకు షెడ్యూల్ విడుదల
- ఎంఈవోలతో డీఈవో సమావేశం
- ఉద్యోగులకు సంబంధించి ఇప్పటికే మొదలైన ప్రక్రియ

ఒంగోలు విద్య, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. ఇప్పటికే ఉద్యోగుల స్థానచలనాలకు సంబంధించిన ప్రక్రియ నడుస్తోంది. దాన్ని ఈనెల 2లోపు పూర్తి చేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశించారు. తాజాగా ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. దీంతో హడావుడి ప్రారంభమైంది. బదిలీల నిర్వహణ ఒక యజ్ఞమే. దీనికోసం ఖాళీల వివరాలు, ఇతర జాబితాల తయారీలో విద్యాశాఖ అధికారులు తలమునకలై ఉన్నారు.

ఖాళీల వివరాల్లో తేడాలు వస్తే చర్యలు : డీఈవో

జిల్లాలోని ఖాళీల వివరాలను ఖరారు చేసేందుకు బుధవారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూల్‌లో మండల విద్యాధికారుల సమావేశం నిర్వహించారు. డీఈవో కిరణ్‌కుమార్ హాజరై పలు సూచనలు

మిగతా 6వ పేజీలో


ఎంఈవోలతో సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

ఉపాధ్యాయుల ఖాళీలపై మళ్లీ కసరత్తు

ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కుదిరిన ఒప్పందం మేరకు మళ్లీ తాజాగా ఖాళీలపై కసరత్తు ప్రారంభించారు. హైస్కూళ్లలో ఒక సెక్షన్‌లో 49మందికిపైగా విద్యార్థులు ఉంటే రెండో సెక్షన్ చేయనున్నారు. అదేవిధంగా ఫౌండేషన్ స్కూళ్లలో 20మందికిపైగా విద్యార్థులు ఉంటే రెండో ఎస్జీటీ పోస్టు ఇవ్వనున్నారు. ఈ రెండు అంశాలపై తాజాగా కసరత్తు చేశారు. హైస్కూళ్లలో కొత్తగా రెండో సెక్షన్‌కు అనుమతించడంతో సుమారు 20చోట్ల కొత్తగా గణితం పోస్టు కేటాయించాల్సి వచ్చింది. సుమారు 10 ఇంగ్లీషు పోస్టులు కూడా అవసరమయ్యాయి. 30 ఫౌండేషన్ స్కూళ్లకు కొత్తగా రెండో ఎస్జీటీ పోస్టు కేటాయించారు. దీంతో ఖాళీల వివరాల్లో తేడాలు వచ్చాయి.

యోగా సాధన

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నాహకాల్లో భాగంగా బుధవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో సాధన ఏర్పాటు చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



రక్తదారులు

చింతగుంట్ల వద్ద ప్రమాదంలో మృతులు..


గాలిరెడ్డి (ఫైల్)


శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం

ఏడుగురికి గాయాలు

- మూడుచోట్ల కార్ల అతివేగం.. మరోచోట బైక్ రాంగ్‌రూట్ కారణం..

వివరాలు 6వ పేజీలో

గుత్తి నుంచి మహానాడుకు సైకిల్ యాత్ర

టీడీపీ కార్యకర్తకు అభినందనలు

కంభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఈనెల 27 నుంచి జరిగే టీడీపీ మహానాడుకు సైకిల్ యాత్ర చేస్తూ వెళ్తున్న పార్టీ కార్యకర్త షేక్ బాజీని బుధవారం కంభం మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తి గ్రామానికి చెందిన బాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీరాభిమాని. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడం, మహానాడును కడపలో నిర్వహిస్తున్న సందర్భంగా గుత్తి నుంచి కడపకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు బాజీ తెలిపారు. కంభం మీదుగా వెళ్తున్న సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నాయకులు గోన చెన్నకేశవులు, కటికల భాస్కర్, టీడీపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందించారు.


సైకిల్‌యాత్ర చేస్తున్న బాజీతో టీడీపీ నేతలు

రక్తదారులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఐదుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఏడుగురు గాయాలపాలయ్యారు. మూడు చోట్ల కార్లు అతివేగంతోనే ఈ దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోచోట రాంగ్‌రూట్‌లో బైక్ నడపడమే కారణం. వేరొకచోట ఆటోకు గేదె అడ్డు రావడంతో అదుపుతప్పి ప్రమాదం సంభవించింది.

- ఉమ్మడి జిల్లాలో ఐదుచోట్ల రోడ్డు ప్రమాదాలు
- ఐదుగురి దుర్మరణం ● ఏడుగురికి గాయాలు
- మూడుచోట్ల కార్లు అతివేగం.. మరోచోట బైక్ రాంగ్‌రూట్ కారణం


ఘటనా స్థలంలో సహాయక చర్యలు

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు మార్జిన్‌లోని వ్యక్తులను ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు
- వేగంలో కారు అదుపు తప్పడంతో ఘటన

పంగులూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కారు అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. మరో వ్యక్తి కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన 16వ నెంబరు జాతీయ రహదారిపై బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని ముప్పవరం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురు బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకొంది. ఈ ఘటనలో మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన సంపంగుల వెంకట్రావు (47), నెల్లూరు జిల్లా నందిపాడుకు చెందిన రాచమల్లు దిలీప్ (27) మృతి చెందారు. మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన సంపంగుల వెంకటరావు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన తాటిముంజలు అమ్ముకొంటున్నాడు. ఒంగోలు వైపు వెళ్లే రోడ్డు అంచులో చెట్టు నీడన ఆయన దుకాణం ఉంది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా నందిపాడు గ్రామానికి చెందిన రాచమల్లు వెంకటేశ్వర్లు, ఆయిన భార్య, కుమారుడు దిలీప్‌లు విశాఖపట్నం నుంచి కారులో బుధవారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో జాతీయ రహదారి వెంబడి తాటి ముంజలు తిని సేదదీరేందుకు వెంకట్రావు దుకాణం వద్ద ఆగారు. ఇదే రహదారిలో అమరావతి నుంచి చీమకుర్తి వైపు వెళుతున్న మరో కారు అతివేగంతో వచ్చింది. ముంజలు తీస్తున్న వెంకట్రావును, కొనుగోలు చేస్తున్న దిలీప్‌ను ఢీకొట్టింది. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. దిలీప్ తండ్రి వెంకటేశ్వర్లు కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వినోద్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు... క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటేశ్వర్లుకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతి వేగంతో కారు నడిపి ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను ఎస్ఐ వినోద్‌బాబు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటరావు మృతితో కొండమూరులో విషాదం

కొండమూరు గ్రామానికి చెందిన సంపంగుల వెంకటరావు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. కుమార్తె డెలివరీ కావడంతో రూతమ్మ కొద్ది రోజులుగా ఒంగోలులో ఉంటోంది. వెంకటరావు ఏటా వేసవిలో జాతీయ రహదారి పక్కన రోడ్డు అంచుల్లో చెట్ల నీడన తాటి ముంజలు అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. సీపీఎం సభ్యుడిగా పలు ఉద్యమాలలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. అందరితో కలివిడిగా ఉండే వెంకట్రావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు.


ప్రమాదంలో ధ్వంసమైన కారు ముందు భాగం


ప్రమాద స్థలం వద్ద పడి ఉన్న మోపెడ్

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు..

- మోపెడ్‌ను ఢీకొన్న కారు ● ఇద్దరు దుర్మరణం

మార్కాపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు మోపెడ్‌పై వెళ్తున్న ఇద్దరిని కారు ఢీకొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రూరల్ ఏఎస్ఐ రంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దారవీడు మండలం సానికవరంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మార్కాపురం మండలం కొండేపల్లికి చెందిన చాగంటి గాలిరెడ్డి (74) వద్దకు వేములపేటకు చెందిన జంకె శ్రీనివాసరెడ్డి (55) వచ్చాడు. ఇద్దరూ కలిసి మోపెడ్‌పై సానికవరానికి బయల్దేరారు. చింతగుంట్ల వద్ద వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన కారు మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాసరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గాలిరెడ్డికి భార్య మంగమ్మతోపాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. కుమారులు ఇద్దరూ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. రూరల్ ఏఎస్ఐ రంగయ్య, సిబ్బందితో కలిసి ఘటనను పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాలను పంచనామాకు ప్రభుత్వ ఆసుపత్రికి పంపంచారు.


ప్రమాద స్థలంలో గాలిరెడ్డి, శ్రీనివాసరెడ్డి మృతదేహాలు

గేదెను తప్పించబోయి ఆటో బోల్తా

- డ్రైవర్ మృతి


రేవు రాజేష్ (ఫైల్)

సింగరాయకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : గేదె అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి పడిపోవడంతో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పాకల కోనేరు ఎదుట బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాకల పల్లెపాలేనికి చెందిన రేవు రాజేష్ (21) ఆటోలో పాకల నుంచి సింగరాయకొండకు బయల్దేరాడు. గ్రామ ప్రారంభంలో ఉండే కోనేరు వద్దకు వచ్చేసరికి ఆటోకు అకస్మాత్తుగా గేదె అడ్డు వచ్చింది. బ్రేక్ వేయడంతో అదుపుతప్పి పడిపోయింది. ప్రమాదంలో రాజేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. డాక్టర్ పరిశీలించగా అప్పటికే రాజేష్ మరణించినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ సాయి సంతోష్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడు తండ్రి నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాంగ్ రూట్‌లో ప్రయాణం

- టిప్పర్‌ని ఢీకొన్న మోటార్‌సైకిల్
- ఇరువురికి తీవ్రగాయాలు

ఒంగోలు క్రైం, మే21(ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో వేగంగా వెళుతూ ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను మోటార్‌సైకిల్ ఢీకొని ఇరువురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటన ఒంగోలు నగరంలోని పాత బైపాస్ రోడ్డులోని మామిడిపాలెం చెరువు సమీపంలో బుధవారం జరిగింది. సింగరాయకొండకు చెందిన వంశీ, ప్రదీప్‌లు బులెట్‌పై ప్రయాణం చేస్తున్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాన్ని నడుపుతున్నారు. అతివేగంగా బులెట్ నడుపుతూ ఎదురుగా వచ్చిన టిప్పర్‌ని ఢీకొట్టారు. దీంతో ప్రదీప్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

అతివేగంతో లారీని ఢీకొట్టిన కారు

- డ్రైవర్‌తోపాటు నలుగురికి గాయాలు ● బాధితులంతా సూళ్లూరుపేట వాసులు

ఒంగోలు క్రైం, మే21(ఆంధ్రజ్యోతి) : ముందు వెళుతున్న లారీని అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన బుధవారం ఒంగోలులోని కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన ధనుంజయనాయుడు ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్నారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విజయవాడకు కుటుంబసభ్యులతో కలిసి కారులో బయలుదేరారు. అయితే కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ముందు ఉన్న లారీని అధిగమించే క్రమంలో కారు డ్రైవర్ కొరుకొండ నగేష్ అతివేగంతో లారీని ఢీకొట్టాడు. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న ధనుంజయనాయుడు, ఆయన భార్య శారద, అత్త నాగేశ్వరమ్మ, డ్రైవర్ నగేష్‌లకు గాయాలు అయ్యాయి. ఇరువురు పిల్లలు భవిత, హరితలకు ఎలాంటి గాయాలూ కాలేదు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభమైన సాగర్ పైప్‌లైన్ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్కాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : సుమారుగా ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న సాగర్ పైప్‌లైన్ పనులు ఎట్టకేలను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రారంభించారు. పట్టణానికి ప్రధాన తాగునీటి వనరైన సాగర్ నీటిని 28 కిలోమీటర్ల మేర దూపాడు నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా మార్కాపురం చేరాలి. త్రిపురాంతకం దూపాడు నుంచి పెద్దారవీడు మండలం బోడిరెడ్డి పల్లి జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేర అప్పట్లో ప్రయోగాత్మకంగా జీఐ పైప్‌లైన్ వేశారు. గత దశాబ్ద కాలంగా ఈ ప్రాంతంలోనే తరచూ పైప్‌లైన్ పగులుతోంది. దీంతో 2022లో రూ.4.5 కోట్లతో నూతనంగా డీఐ పైప్‌లైన్ వేసేందుకు టెండర్లు పిలిచారు. పనులు 2022లో ప్రారంభమైనా వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. కాంట్రాక్టర్ 2 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసి బిల్లులు కూడా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచింది. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నెల 10వ తేదీన 'నీళ్లన్నా నిర్లక్ష్యమే!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. పట్టణంలోని లక్షమంది జనాభాకు ఎంతో అవసరమైన ఈ పని నిలిచిపోవడం ఏంటని మున్సిపల్ ఉన్నతాధికారులు పనులు పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులపై మండిపడ్డారు. అంతేకాక ఈ నెల 13వ తేదీన మున్సిపల్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ ఓబులేసు పైపల్‌లైన్ పనులను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈ టి.మోహన్‌తో కలిసి పరిశీలించారు. వారి ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ సంస్థ ఏవీఆర్ ఇన్‌ఫ్రా పనులను ప్రారంభించింది. జూన్ మొదటి వారానికల్లా పనులు పూర్తి చేయనున్నట్లు పబ్లిక్ హెల్త్ ఒంగోలు ఈఈ శ్రీనివాససంజయ్ తెలిపారు.


చురుగ్గా సాగుతున్న పైప్‌లైన్ పనులు

సొరకాయ్.. రూపాయ్!

- కోత కూలి కూడా రాని దైన్యం ● 30 రోజుల్లో దారుణంగా తగ్గిన ధర

బల్లికురవ. మే 21 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం అయినప్పటికీ, సొరకాయల ధరలు అమాంతం తగ్గిపోయాయి. బోరుబావుల కింద సాగు సొరకాయలకు గిట్టుబాటు ధర ఉండడం లేదు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం, రామాంజనేయపరం, కొమ్మినేనివారిపాలెం, వల్లాపిు, గుడిపాడు, చెన్నుపల్లి, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొణిదెన, నక్కబొక్కలపాడు తదితర గ్రామాలలో రైతులు బోరు బావుల కింద సొరకాయలు సాగుచేశారు. ఎకరాకు రూ. 15వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మెదట్లో సొరకాయ ఒకటి రూ.7 చొప్పున కొనుగోలు చేయగా నాలుగు రోజుల నుంచి మార్కెట్ ధరలు అమాంతం తగ్గాయి. ప్రస్తుతం ఒక్కో సొరకాయ కేవలం ఒక్క రుపాయికి మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు కోత కూలీ బాడుగ కూడా చేతికి రావడం లేదు. దీంతో కోత కోయకుండానే పంట పోలాల్లోనే కాయలను వదిలేస్తున్నారు. కొంత మంది రైతులు ముదిరిన కాయలను కోయించి రోడ్డుపక్కన పడేస్తున్నారు. వేసవి కాలం కావడం విద్యార్థుల వసతి గృహాలు మూత పడడంతో సొరకాయల ధరలు బాగా తగ్గాయని రైతులు అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా సొర కాయలు పెద్ద ఎత్తున మార్కెట్‌లోనికి వస్తున్నాయని దీంతో కొనుగోళ్లు మందగించాయని రైతులు తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారులు రైతుకు గిట్టుబాటయ్యేలా కాయలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కొందరు రైతులు హైదరాబాద్ మార్కెట్‌కు వాహనాలను పెట్టుకొని సొరకాయలను తరలిస్తున్నారు. అక్కడ కూడా బాడుగ పోను చేతికి ఏమీ రావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.


ముక్తేశ్వరంలో ధరలు లేక తోటలోనే వదిలేసిన సొర కాయలు

నగరం.. నవ్యపథం!

(5వ పేజీ తరువాయి)

నగరంలో 317 కి.మీ రహదారులు ఉన్నాయి. అందులో సీసీ రోడ్లు 197.70 కి.మీ, బీటీరోడ్లు 7.80 కి.మీ, డబ్ల్యూబీఎం రోడ్లు 63.53 కి.మీ, కచ్చారోడ్లు 46 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ వాహన ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగర అభివృద్ధే ధ్యేయంగా, రహదారుల విస్తరణపై కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించారు.

ఇప్పటికే పలు రోడ్లు విస్తరణ

ఈక్రమంలో ఇప్పటికే కర్నూలు రోడ్డు విస్తరణ చేపట్టగా, మరోవైపు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించి వెడల్పు చేయడంతో ఆ ప్రాంతం సరికొత్త శోభ సంతరించుకుంది. అలాగే సీవీఎన్ రీడింగ్ రూమ్ సెంటర్ నుంచి కొణిజేడు బస్టాండ్ సెంటర్ వరకు రెండు వైపులా ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా మరో ముఖ్యమైన రోడ్లను విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. సుజాతనగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పాత తాలూకా పోలీస్ స్టేషన్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి.

నష్టపరిహారంగా టీడీఆర్ బాండ్‌లు

విస్తరణలో కోల్పోయే భవన నిర్మాణం ఏసంవత్సరంలో నిర్మించారు. నిర్మాణానికి ఆనాడు అయిన ఖర్చు, ప్రస్తుత మార్కెట్ విలువ, కాలాన్ని బట్టి నష్ట అంచనాలను వేసి భవన యజమానులకు ప్రభుత్వం తరఫున టీడీఆర్ బాండ్లు అందజేయనున్నారు. అయితే రోడ్డు విస్తరణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందుగా ఆయా ప్రాంతాల భవన యజమానులతో మాట్లాడి, వారి అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నారు. అభివృద్ధికి ఆటంకం లేకుండా ముందుకెళ్లే దిశగా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఏదిఏమైనప్పటికీ ట్రాఫిక్ సమస్య నియంత్రణకు, నగర హోదాకు అనుగుణంగా రహదారుల విస్తరణ పనులు జరుగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీల కోలాహలం

(5వ పేజీ తరువాయి)

చేశారు. తాజా మార్గదర్శకాల మేరకు మండలాల్లో ఖాళీలను ధ్రువీకరించాలని ఆదేశించారు. ఖాళీల ప్రకటనలో తేడా వస్తే సంబంధిత ఎంఈవోలే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. హెచ్ఎం ఖాళీలు, ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీలకు సంబంధించిన అన్ని వివరాలను బుధవారం మధ్యాహ్నమే వెబ్‌సైట్‌లో ఉంచారు. హెచ్ఎంలుగా ఒకేస్థానంలో ఐదేళ్లు పూర్తిచేసి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు, క్లియర్ వేకెన్సీలు, ఐదేళ్లు పూర్తయిన ఖాళీలను కూడా వెబ్‌సైట్‌లో పెట్టారు. హెచ్ఎంల బదిలీ దరఖాస్తు గడువు గురువారంతో ముగుస్తుంది. బదిలీ దరఖాస్తులను పరిశీలించడం, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు డీఈవో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.


మండువేసవిలో జోరువాన

(5వ పేజీ తరువాయి)

జిల్లా అంతటా వర్షాలు పడుతున్నాయి. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఉష్ణోగ్రతలు అధిక ప్రాంతాల్లో సాధారణం కన్నా ఐదారు డిగ్రీల మేర తగ్గిపోయాయి. ఆయా ప్రాంతాల్లో ఈ నెలలో ఇప్పటి వరకు కురిసిన వర్షాలను పరిశీలిస్తే.. 11 మండలాల్లో సాధారణం కన్నా రెట్టింపు అంతకు మించి వర్షపాతమే నమోదైంది. పశ్చిమ ప్రాంతంలోని గిద్దలూరులో ఏకంగా 470 శాతం అధికంగా కురిసింది. మరో 14 మండలాల్లో 50 శాతం నుంచి 96శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఎండల తీవ్రత అత్యధికంగా ఉండే రోహిణికార్తె ఈనెల 25 నుంచి ఆరంభం కానుంది. సాధారణంగా ఆ సమయంలో అత్యధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులు ఉంటాయి. అయితే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వస్తుండటం, బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, ప్రస్తుత వర్షపు వాతావరణం నేపథ్యంలో ఈసారి రోహిణిలో గతంలో వలే తీవ్రత ఉండక పోవచ్చని భావిస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది ఎండల తీవ్రత నుంచి జిల్లా ప్రజలకు ఉపశమనం లభించినట్లే.

ఈ నెలలో ఇప్పటివరకు రెట్టింపు వర్షపాతం నమోదైన మండలాల వివరాలు

మండలం	సాధారణం	నమోదైన	నమోదు శాతం
	వర్షపాతం(మి.మీ)		
గిద్దలూరు	18.20	103.60	470.60
రాచర్ల	19.60	92.40	370.30
దోర్నాల	35.40	101.10	185.90
సీఎస్‌పురం	20.50	57.00	177.70
పెద్దారవీడు	88.60	32.20	174.80
మార్కాపురం	32.40	88.40	172.40
పామూరు	36.80	96.60	162.60
కొండపి	46.50	118.30	154.60
తర్లుబాడు	29.60	64.60	118.20
తాళ్ళూరు	42.50	91.40	114.80
సంతనూతలపాడు	45.40	91.2	100.90



ఉపాధ్యాయులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బదిలీల షెడ్యూల్ విడుదలైంది. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ మొత్తం జూన్ 11తో ముగియనుంది. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు వేర్వేరుగా షెడ్యూల్ ప్రకటించారు.

-ఒంగోలు విద్య, (ఆంధ్రజ్యోతి)

టీచర్లకు స్థానచలనం

బదిలీల షెడ్యూల్ విడుదల
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
జూన్ 11నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి

గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు..

● బదిలీల కోసం గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు ఈనెల 21, 22 తేదీల్లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల పరిశీలన ఈనెల 21, 22 తేదీల్లోనే ముగుస్తుంది.

● 24న సీనియారిటీ జాబితా ప్రకటిస్తారు. 25న ఆ జాబితాలపై అభ్యంతరాలు ఆధారాలతో అప్‌లోడ్ చేయవచ్చు. వీటిని ఆర్జేడీలకు అందజేయాలి. 26న అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరిస్తారు. 27న దరఖాస్తు చేసిన హెచ్‌ఎంల తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసి 28న ఆన్‌లైన్‌లో తాము కోరుకునే స్థానాలకు ప్రాధాన్యతాక్రమంలో వెబ్ ఆప్షన్లు ఇస్తారు. 30న బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తారు.

● 30వ తేదీన స్కూలు అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. అందుకోసం అర్హులైన స్కూలు అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. ఉద్యోగోన్నతి పొందిన వారికి 31న హెచ్‌ఎంలుగా నియామకపు ఉత్తర్వులు విడుదల అవుతాయి.


స్కూలు అసిస్టెంట్లు..

స్కూలు అసిస్టెంట్లు ఈనెల 21 నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవాలి. వాటిని 21 నుంచి 26వ తేదీ వరకు పరిశీలిస్తారు. 26, 27 తేదీల్లో బదిలీ కోసం దరఖాస్తు చేసిన స్కూలు అసిస్టెంట్ల ప్రాథమిక సీనియారిటీ జాబితా సబ్జెక్టుల వారీగా విడుదల చేస్తారు. 28న సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను ఆధారాలతో విద్యాశాఖాధికారికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. 28, 29 తేదీల్లో అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. 31న బదిలీల కోసం దరఖాస్తు చేసిన స్కూలు అసిస్టెంట్ల తుది సీనియారిటీ జాబితాలను సబ్జెక్టుల వారీగా ప్రకటిస్తారు. జూన్ 1, 2 తేదీల్లో బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 4న బదిలీ ఉత్తర్వులు ఇస్తారు. 5వ తేదీన అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. దీని కోసం ఎస్జీటీలు తాము కోరుకునే స్థానాలకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 6న స్కూలు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి నియమక ఉత్తర్వులు విడుదల అవుతాయి.

తప్పుడు సమాచారం ఇస్తే క్రమశిక్షణా చర్యలు

బదిలీల్లో అక్రమంగా లబ్ధి పొందేందుకు ఎవరైనా తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లు, ఇతర తప్పుడు పత్రాలు సమర్పిస్తే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. వీరిని పనిష్మెంట్ కింద నాలుగో కేటగిరీ ప్రాంతాలకు బదిలీ చేస్తారు. 5/8 సర్వీసు పూర్తయ్యే వరకు వారికి బదిలీ అవకాశం కోల్పోవాల్సిందే. తప్పుడు పత్రాలను ధ్రువీకరించిన అధికారులపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ప్రాసిక్యూట్ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారు ఎవరైనా బదిలీకి దరఖాస్తు చేసుకోకపోతే సంబంధిత కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన నాలుగో కేటగిరీ స్థానాల్లో వారిని నియమించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చట్ట పరిధిలోనే బదిలీలు



ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం-25ను అమలులోకి తెచ్చింది. చట్టంలో పేర్కొన్న అంశాల ప్రకారమే ప్రస్తుతం బదిలీలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అప్లికేషన్ విడుదలైంది. ఉపాధ్యాయులు తమ ట్రెజరీ ఐడీ, పుట్టిన తేదీ ఎంటర్ చేసిన తర్వాత ఓటీపీ వస్తుంది. దానిలో లాగిన్ కావాల్సి ఉంటుంది. బదిలీల్లో ఈ ఓటీపీ కీలకం కానుంది. ఓటీపీ వస్తే బదిలీ ప్రక్రియ నమోదైనట్లే.

సెకండరీ గ్రేడ్ టీచర్లు..

బదిలీల కోసం సెకండరీ గ్రేడ్ టీచర్లు ఈనెల 21 నుంచి 28 వరకు దరఖాస్తులు సమర్పించాలి. ఆయా దరఖాస్తులను 21 నుంచి 8 వరకు పరిశీలిస్తారు. 31న దరఖాస్తు చేసిన వారి ప్రాథమిక సీనియారిటీ జాబితాలు విడుదల చేస్తారు. 28 నుంచి జూన్ 1 వరకు ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరలు ఆధారాలతో ఆన్‌లైన్‌లో డీఈవోకు సమర్పించారు. 28 నుంచి జూన్ 2 వరకు సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. జూన్ 6న దరఖాస్తు చేసిన ఎస్జీటీల తుది సీనియారిటీ జాబితాను విడుదల చేస్తారు. జూన్ 7 నుంచి 10 వరకు ఎస్జీటీలు కోరుకున్న స్థానాలకు వెబ్‌ఆప్షన్లను ప్రాధాన్యతా క్రమంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల అవుతాయి.

ఆంజనేయం మహావీరం

● నేడు హనుమజ్జయంతి ● జిల్లావ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు ● ప్రత్యేక సిందూర అర్చనలు, లక్ష నాగవల్లీ దళార్చనలు

ఆంజనేయం మహావీరం బ్రహ్మ విష్ణు శివాత్మకమ్ బాలార్క సదృశాభాసం రామదూతం నమామ్యహమ్ అంటూ హనుమంతుని బలాన్ని గురించి, ఆయన శాస్త్ర పరిజ్ఞానాన్ని గురించి, రామభక్తి పరాయణత్వం గురించి చెబుతారు. ఆయన బ్రహ్మ, విష్ణు, శివాత్మకమైన త్రిమూర్త్యాత్మ స్వరూపుడని కూడా పురాణాలు చెబుతాయి. ఆంజనేయ స్వామి మహిమలు, శక్తియుక్తుల గురించి తెలియజేసే సుందరాకాండ పారాయణ ఎంతో శ్రేష్టమైనదని, దీనిని పారాయణ చేసిన వారి కష్టాలు తీరి, కోరికలు ఫలిస్తాయని కూడా పురాణాలలో మహర్షులు పేర్కొన్నారు. అంతటి బలశాలి, బుద్ధిశాలి అయిన హనుమంతుని జయంతి నేడు. ఈ హనుమజ్జయంతి పండుగ సందర్భంగా స్వామివారికి ఎంతో ఇష్టమైన సిందూర అలంకరణలు, వడమాల సేవలు, నాగవల్లీ (తమలపాకుల) అర్చనలు నిర్వహించటానికి జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా గ్రామాల మొదలు అనేక పట్టణాలలో ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానాలు, సీతారామచంద్ర స్వామి దేవస్థానాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.



ఒంగోలులోని కేశవస్వామిపేటలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆంజనేయస్వామి ఆలయం

ఒంగోలు కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం వైశాఖ బహుళ దశమి రోజును ఆంజనేయ స్వామి జన్మించిన రోజున హనుమజ్జయంతి పర్వదినంగా జరుపుకోవటం ఆనవాయితీ. హనుమంతుని జన్మవృత్తాంతం శివ మహాపురాణం, రామాయణం మొదలైన గ్రంథాలలో వివరించబడింది. అంజన అనే వానర కాంతగా జన్మించిన పుంజికస్థల అనే అప్సరస కేసరి అనే వానరవీరుని వివాహం చేసుకోగా వారు సంతానం కోసం శివుని ఆరాధిస్తారు. అప్పుడు వాయుదేవుడు శివుని తేజాన్ని పండు రూపంలో అంజనా దేవికి ఇస్తాడు. దానిని భుజించిన అంజనాదేవికి జన్మించిన పుత్రుడే ఆంజనేయుడు. అంజనాదేవి, కేసరి దంపతులకి జన్మించినందున ఆంజనీసుతుడని, కేసరీనందనుడని, వాయుదేవుని అనుగ్రహంతో జన్మించినందున వాయుసుతుడనీ ఇలా వివిధ పేర్లతో హనుమంతుని పూజిస్తారు. ఈ హనుజ్జయంతి రోజున వీలయితే నూట ఎనిమిది సార్లు లేదా 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ ఎంతో ఫలితాన్ని ఇస్తుందని పండితులు చెబుతారు.

● నగరంలో ఏర్పాట్లు

● ఒంగోలు నగరం కేశవస్వామిపేట శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా లక్ష నామాలతో ప్రత్యేక అర్చనా కార్యక్రమం ఏర్పాటుచేయటం జరిగింది.

● రాజాపానగల్ రోడ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం, కొణిజేడు బస్టాండ్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, సుందరనగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, మంగమూరు రోడ్ శ్రీ పొలిమేర ఆంజనేయ స్వామి దేవస్థానం, సంతపేట శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ఇలా పలు ఆంజనేయస్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాలలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఆయా దేవస్థానాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పాకలను ఆక్వా, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

● మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య
● ఆక్వా యూనిట్ల ఏర్పాటుకు రూ.5 కోట్లు...
● ఫిషింగ్ ల్యాండ్ సెంటర్‌కు రూ.3కోట్లు మంజూరైనట్లు వెల్లడి



పాకల తీరాన్ని పరిశీలిస్తున్న దామచర్ల సత్య, సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, అధికారులు

సింగరాయకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : పాకలను ఆక్వా, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పాకల పల్లెపాలెంలో ఆక్వా హబ్ ఏర్పాటుపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత అధికారులతో కలిసి తీరంలో పర్యటించారు. ఆక్వాను టూరిజంతో అనుసంధానం చేస్తూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాకలలో మినీ ఆక్వా హబ్ ఏర్పాటుకు సెర్ప్-డీఆర్‌డీఏ ద్వారా రూ.5 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నిధులతో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్, ట్రైనింగ్ సెంటర్లు, రెస్టారెంట్, తీరంలో దుకాణాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. మినీ ఫిషింగ్ ల్యాండ్ సెంటర్ నిర్మాణానికి కూడా రూ.3 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. టంగుటూరు నుంచి పాకల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5.74 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఇప్పటికే గ్రామంలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేశామని తెలిపారు. పాకల గేటు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభవుతాయన్నారు. సింగరాయకొండ-పాకల రోడ్డును కూడా రాబోయే రోజుల్లో రెండు వరుసలుగా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. సెర్ప్ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ మండలంలోని పొదుపు సంఘాలకు రూ.60పైసల వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు వన్‌స్టాప్ కార్యక్రమం ద్వారా రూ.2.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ, సెర్ప్ అడిషనల్ డైరెక్టర్లు మహిత, రమ, ఎంపీడీవో డి.జయమణి, ఏపీఎం భాగ్యలక్ష్మి, సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొండపిలో డెయిరీ యూనిట్స్ ఏర్పాటుకు రూ.5కోట్లు

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కొండపి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సత్య పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ అనుబంధమైన డెయిరీ యూనిట్స్ ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య, ఎంపీడీవో, ఏపీఎం పాల్గొన్నారు.

కార్మికుల నమోదుకు స్పెషల్ డ్రైవ్

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ప్లాట్‌ఫారం కార్మికుల పేర్లను నమోదు చేసుకొనేందుకు బుధవారం నుంచి ఈనెల 31వరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 16నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న కార్మికులు వారి ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరు, పాన్ కార్డుతో ప్రత్యేక క్యాంపుల వద్ద లేదా కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ నమోదు పూర్తి ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. గతనెలలో నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో 413మంది జిల్లాలో పనిచేస్తున్న జోమటా, స్విగ్గీ, ఓలా, అమెజాన్ తదితర డెలివరీ బాయ్స్ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు.

ఘనంగా సంపూర్ణ నవగ్రహ హోమం

ఒంగోలు కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే తొలిసారిగా సంపూర్ణ నవగ్రహ హోమాన్ని ఒంగోలు నగరంలో బుధవారం నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట తాతా కల్యాణ మండపంలో 50 మంది రుత్విక్కులతో ఈ హోమం జరిగింది. ఒంగోలు నగరానికి చెంది గత రెండు దశాబ్దాలుగా అమెరికాలో పౌరోహిత వృత్తి నిర్వహిస్తున్న వేమూరి పూర్ణానంద శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమ క్రతువులో ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొమ్మిది హోమగుండాలలో మొత్తం మూల మంత్ర పఠనంతో సంపూర్ణ నవగ్రహ హోమం జరిగింది. రుద్ర సహితంగా పురుష సూక్త, శ్రీసూక్త, మన్యుసూక్త, నక్షత్ర హవనం సైతం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణానంద శర్మ మాట్లాడుతూ ఈ సంవత్సరం అష్టగ్రహ కూటమి ఏర్పడినందున అనేక అరిష్టాలకు దారితీసే అవకాశం ఉందని, అందువల్ల సంపూర్ణ నవగ్రహ హోమం ఏర్పాటు చేయటం జరిగిందని అన్నారు. ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్తలు సమసిపోవాలని, రాష్ట్రం సైతం సకాలంలో వర్షాలతో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఈ హోమాన్ని ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వేదపండితులు పిస్నెల్లి చంద్రశేఖర అవధాని, పురోహితులు చివుకుల ప్రసాద శర్మ, సముద్రాల రామ్మోహన్ శర్మలు నిర్వహణా సహకారాన్ని అందించారు.

టెన్త్ పరీక్షలకు 251 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 36 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో బుధవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 251 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు పరీక్షకు 619 మందికి 368 మంది హాజరయ్యారు. ఏపీ ఓపెన్ సొసైటీ ఇంటర్మీడియేట్ కెమిస్ట్రీ పరీక్షకు 1097 మందికి 629 మంది, ఎకనామిక్స్ పరీక్షకు 510 మందికి 429 మంది హాజరయ్యారు. పదవ తరగతి తెలుగు పరీక్షకు 704 మందికి 551 మంది, ఉర్దూ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు హాజరైనట్లు డీఈవో తెలిపారు.

సింగరాయకొండ, కొండపిల్లో కార్డెన్ సెర్చ్

● సరైన పత్రాలులేని ఆటోలు, బైక్‌లు సీజ్



సింగరాయకొండ మల్లెతోటలో గృహాలను తనిఖీచేస్తున్న పోలీసులు

సింగరాయకొండ/కొండపి, మే 21 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని చంద్రబాబునాయుడుకాలనీ, మల్లెతోటలో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ స్థానికంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా, అనుమానితులు సంచరిస్తున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. అనంతరం కందుకూరు రోడ్డు, బస్టాండ్ సెంటర్, పాకల రోడ్డు, రైల్వేస్టేషన్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ఒక ఆటో, 25 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఎస్సై బి.మహేంద్ర, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రమణ, ప్రసాద్, 70 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి మండల పరిధిలోని గొడుగులపాలెం, కొత్తకుమ్మరిపాలెంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం పొదిలి, అనకర్లపూడి రోడ్లలో వాహన తనిఖీలు చేపట్టారు. ఒక ఆటో, 60 బైక్‌లను సీజ్ చేశారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జి.సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్, ఇద్దరు రిజర్వు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపాలెంలో పులి కలకలం

చీమకుర్తి, మే21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పావారిపాలెం గ్రామంలో పులి సంచరిస్తుందని వార్త గుప్పుమనటంతో బుధవారం గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. పనులు నిమిత్తం పొలం వెళ్లడానికి జంకి గృహలకే పరిమితమయ్యారు. గ్రామంలో పులిసంచారంపై చాటింపు వేసి అందరినీ అలర్ట్ చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ నాయకులు కోరారు. పులి సంచారం గురించి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. సీఐ సుబ్బారావు ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలిపి విచారణ జరపాల్సిందిగా కోరారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మోహనరావు, బీట్ కానిస్టేబుల్ శశిభూషణ్ యాదవ్‌లు గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. పులిని చూశాను అని తొలుత గ్రామస్థులకు తెలిపిన వంశీ అనే యువకుడిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద పులి పిల్ల అయి ఉంటుందని వంశీ తెలిపారు. సంచరించినచోట ముద్రల ఆచూకీని పరిశీలించారు. వర్షం పడటంతో ముద్రలు చెరిగిపోయి ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. ఎటువంటి ఆందోళన చెందవద్దని, పులులు, చిరుతపులుల సంచారం ఇక్కడ జరిగే అవకాశం చాలా తక్కువ అని, భయపడాల్సిన పనిలేదని గ్రామస్థులకు అభయమిచ్చిన ఫారెస్ట్ సిబ్బంది తమ ఫోన్ నంబర్ ఇచ్చి మళ్లీ కనపడితే తమకు తెలపాలని చెప్పారు.

యోగా డేలో ప్రజలను భాగస్వాములను చేయాలి

ఒంగోలు(రూరల్), మే21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఉన్న 57మంది యోగా మాస్టర్స్ పర్యవేక్షణలో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు మండల కేంద్రాల్లో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. 28 నుంచి జూన్ 3వ తేదీ వరకు మండలస్థాయిలో, 4 నుంచి 6వ తేదీ వరకు గ్రామస్థాయిలో ప్రజలకు సాధారణ యోగా శిక్షణ ఇవ్వాలన్నారు. 16న ప్రతి ఒక్కరినీ యోగాసనాలలో భాగస్వామ్యం చేయాలని, 17న సీనియర్ సిటిజన్లు పాల్గొనేలా చేయాలని కోరారు. 18, 19వ తేదీల్లో యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, డీఈవో కిరణ్‌కుమార్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి హాజీరా బేగమ్, బాలాజీ యోగాచార్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీ
- కడపలో జరిగే మహానాడుకు భారీగా తరలిరావాలి : ఎమ్మెల్యే దామచర్ల పిలుపు
- మినీ మహానాడుకు తరలివచ్చిన శ్రేణులు




ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ, నేతలు, సభకు భారీగా తరలివచ్చిన నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. ఒంగోలు నియోజకవర్గ మినీ మహానాడు బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధ్యక్షతన స్థానిక ఎంఎస్‌ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలన్న దిశగా సీఎం చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని చెప్పారు. అమరావతి రాజధాని కోసం రూ.49వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు. స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ కూడా సీఎం చంద్రబాబు పాలనను మెచ్చుకోవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత వైసీపీ హయాలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు : దామచర్ల

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు అన్నారు. కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజ సంక్షేమమే దిశగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. ఆర్థిక లోటుపాట్లు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు వెనుకడుగు వేయలేదన్నారు. గడిచిన ఐదేళ్ళు నియోజకవర్గానికి చెందిన నేత మంత్రిగా ఉండి కూడా నగరానికి చేసింది ఏమీ లేదని, అతని నిర్లక్ష్యం వల్ల ఒంగోలు నగరం అస్తవ్యస్తంగా మారిందని దామచర్ల ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన అక్రమాలకు చట్టప్రకారం గుణపాఠం తప్పదన్నారు. టీడీపీకి చెందిన వారిని మహిళలు అని కూడా చూడకుండా దాడిచేసిన వారిని వదిలేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నూతనంగా రూ.25కోట్లతో రోడ్లు, డ్రైయిన్‌లు, పార్కులు, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నగర ప్రజలకు ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని దామచర్ల పేర్కొన్నారు. అంతకముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వినకొండ సుబ్రహ్మణ్యం, పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రవేశపెట్టిన తీర్మానాలు

- పొగాకు, శనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.
- కొత్తపట్నం మండలంలో హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.
- కొత్తపట్నం మండలంలో ప్రతిపాదించిన ఎయిర్ పోర్టు పనులు పూర్తి చేయాలి
- రామతీర్థం నుంచి ఒంగోలు నగరానికి అండర్ గ్రౌండ్ పైపులైను ద్వారా తాగునీటికి ఎస్ఎస్1 2 అందించే ప్రాజెక్టుకు అనుమతించాలి.
- మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా 2200 కి.మీ పూర్తయిన సందర్భంగా త్రోవగుంట దగ్గర మైల్ రాయి వేయగా, ఆ సందర్భంగా ఇచ్చిన హామీ, ఒంగోలు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనులకు అనుమతులు మంజూరు చేయాలి.
- తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ళను 80 శాతం పూర్తి చేయగా మిగిలిన పనులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. తిరిగి ఆ పనులను ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలి.
- ఇల్లు లేని పేదలకు 2 సెంట్లు భూమితో పాటు గృహ నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందించాలి.
- పోతురాజు కాలువ ఆధునికీకరణ త్వరితగతిన అనుమతులను మంజూరు చేసి, పనులను పూర్తి చేయాలి.
- డీకే పట్టా భూమిలో ఇల్లు కట్టుకొని పొజిషన్‌లో ఉన్న అర్హులైన వారి పేరు మీదకు మార్చి ఇవ్వాలి.
- కొత్తపట్నం మండలంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే తీర్మాలని ప్రవేశపెట్టగా వాటిని పోలవరపు వెంకట్రామయ్య, గొల్లపోతు పేరయ్య, ఎద్దు శశికాంత్‌భూషణ్, మేయర్ గంగాడ సుజాత, కామేపల్లి శ్రీనివాసరావు, తిప్పరమల్లి రవితేజ, వైవీసుబ్బారావు, షేక్ కపిల్‌బాషా, కొఠారి నాగేశ్వరరావు, శింగరాజు రాంబాబు మద్దతు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

- ఎమ్మెల్యే దామచర్ల



చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు అయిన సహాయాన్ని ఎమ్మెల్యే దామచర్ల బుధవారం ఒంగోలులోని తన నివాసంలో అందజేశారు. 13 మంది లబ్ధిదారులకు రూ.12.25లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో ఎన్టీఆర్ వైద్య భరోసా కింద కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. దాంతోపాటు ప్రైవేటు ఆసుపత్రులో వైద్యం చేయించుకున్న వారికి ఎన్టీర్ భరోసా కింద అవసరమైన ఆర్థికసహాయం చేసి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న రైతు నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ఆదుకునేందుకు బోర్డు జోక్యం చేసుకొని వెంటనే ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలోకి దించి కొనుగోళ్ళు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని పొగాకు వేలం కేంద్రాలను వారు సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. వేలంలో పాల్గొన్న బయ్యర్లు పొగాకు కొనుగోలు చేయకపోవడం పట్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతిబాబు, పమిడి వెంకట్రావు, పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు ఆక్షేపణ చేశారు. రైతులు తెస్తున్న బేళ్లలో 50శాతం తిరస్కరణకు గురికావడం వల్ల వారు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ప్రభుత్వ రంగ సంస్థలతో అన్ని రకాల పొగాకు గ్రేడ్‌లను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నల్ల బర్లీ రైతుల వివరాలను నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ సాగుచేసిన రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఏవో పి.వెంకట్రావు కోరారు. బుధవారం నాగులుప్పలపాడు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో నల్లబర్లీ నిల్వ చేసిన ప్రదేశానికి వెళ్లి సదరు రైతు వివరాలు నమోదు చేయాలన్నారు. పొగాకు నిల్వల ఫొటోలు ఏపీఏఐఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. వాటి ఆధారంగా నిల్వ ఉన్న నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. నల్లబర్లీ రైతుల వివరాల నమోదులో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారం



సీతారామయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), మే21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు విరివిగా రుణాలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి సహకరిస్తానని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. ఒంగోలులోని వెంకటరమణ నర్సింగ్‌హోమ్‌లో బుధవారం బ్యాంక్ చైర్మన్ సీతారామయ్యను ఎన్జీరంగాభవన్ పాలకవర్గం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో రంగా భవన్ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి చుంచు శేషయ్య, సభ్యులు డాక్టర్ నాదెండ్ల చంద్రశేఖరరావు, నాగినేని ప్రసాద్, మండవ శ్రీనివాసరావు, గుండవరపు కోటేశ్వరరావు, మోపర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం వచ్చిన అర్జీలను సమగ్రంగా పరిశీలించాలి

- సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలనచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లు, జాయింట్‌కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో రీసర్వే పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం తీరంలో పర్యాటక అభివృద్ధి

నిర్వహణ బాధ్యతలు పొదుపు సంఘాలకు ఇచ్చేందుకు చర్యలు ● భూములను పరిశీలించిన సెర్ప్ అధికారులు

కొత్తపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం తీరంలో అభివృద్ధి పనులు చేపట్టి వాటి నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పేదరిక నిర్మూలన అధికారులు బుధవారం కొత్తపట్నం తీరంలో పర్యటించారు. సెర్ప్ అధికారులతో పాటు మత్స్యశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించారు. కాటేజీల నిర్మాణం, హోటల్స్, పర్యాటకులకు స్నానపు గదులు, పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువుల విక్రయాలకు షాపుల నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ స్టేట్ డైరెక్టర్ పద్మావతి, మత్స్యశాఖ అసిస్టెంట్ సంగాని శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పనులు చేపట్టి నిర్వహణ బాధ్యతలు పొదుపు సంఘాల మహిళలకు అప్పగించడంపై స్థానిక అధికారులతో చర్చించారు.

వివరాలు అందించలేకపోయారు..

కొత్తపట్నం తీరంలో టూరిజం అభివృద్ధికి అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన సెర్ప్ రాష్ట్ర అధికారులకు స్థానిక రెవెన్యూ అధికారులు స్థలం వివరాలను అందించలేకపోయారు. స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తమకు వివరాలు తెలియవంటూ అధికారులకు సెలవిచ్చారు. తొలుత కొత్తపట్నం పల్లెపాలెంకు దక్షిణం వైపు ఉన్న తీరంలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ భూములు ఎస్సీల టెనెంట్ సొసైటీకి సంబంధించినవి తెలియటంతో పల్లెపాలెంకు ఉత్తరంవైపు తీరంలో ఉన్న భూములను పరిశీలించారు. అయితే ఈ భూములు రంగాయపాలెం పంచాయతీ పరిధిలోనివి అని, తమకు కె.పల్లెపాలెం భూములు వివరాలు మాత్రమే తెలుసుని గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్ చెప్పటంతో రాష్ట్ర అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన చేయకుండానే వెనుదిగారు. గతంలో ఇబ్బందిపురం గ్రామం ఉన్న ప్రాంతంలోనే టూరిజం పనులు చేపట్టి వాటి నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేసి సెర్ప్‌కు పంపాలని డైరెక్టర్ పద్మావతి కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గొల్లపోతు పేరయ్య, సెర్ప్ అధికారి మహిత, ఎంపీఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో ఇంటి పట్టాల పునఃపరిశీలన

- తనిఖీ చేసిన జేసీ గోపాలకృష్ణ



రామ్‌నగర్‌లో ఇంటి పట్టాను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ఇంటి పట్టాలకు సంబంధించి పునఃపరిశీలన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ స్థానిక రామ్‌నగర్, అన్నవరప్పాడులో గతంలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారుల గృహాలను సందర్శించి ఆయా పట్టాలను పరిశీలించారు. మధ్యాహ్నం ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగర కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి పట్టాలు పొందిన లబ్ధిదారుల నివాసాలను సందర్శించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో నగరంలో 21వేల మందికి పైగా పట్టాలు ఇవ్వగా వాటిలో సగం మందికి పైగా అనర్హులకు పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో గతంలో ఇంటి మీటర్ల ఆధారంగా పట్టాలను పునఃపరిశీలన చేసిన రెవెన్యూ అధికారులు ప్రస్తుతం పట్టాలు పొందిన లబ్ధిదారుల గృహాలను సందర్శించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒంగోలులో మిగిలిన పట్టాలు పొందిన లబ్ధిదారులను కూడా పరిశీలన చేయనున్నట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

- కలెక్టర్ అన్సారియా హెచ్చరిక



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది క్రమశిక్షణ పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని కొప్పోలు సచివాలయాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా స్థానికులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రీ సర్వే డేటాను కంప్యూటర్‌లో కలెక్టర్ పరిశీలించారు. ఆధార్‌కార్డు లేని చిన్నారులు సచివాలయ పరిధిలో ఎంత మంది ఉన్నారు, వారికి ఆధార్‌కార్డులు అందేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారని మహిళా సంరక్షణ కార్యదర్శిని కలెక్టర్ ప్రశ్నించారు. అందుకు సంబంధించిన రికార్డులను కూడా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు వేస్తున్న బయోమెట్రిక్ హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఉద్యోగులు ఉదయం 11 గంటలకు వచ్చినట్లు కలెక్టర్ గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయపరిధిలో శానిటేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఆదేశించారు.

క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు



క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్స్

ఒంగోలు విద్య, మే 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి అవార్డులు అందుకున్నారు. ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీలో ఈనెల 12నుంచి 21వ తేదీ వరకు జరిగిన వార్షిక శిక్షణ క్యాంపులో క్విస్‌ల కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ క్యాంప్‌లో నిర్వహించిన ఆర్మీడ్రిల్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన పూర్ణిమ బెస్ట్ క్యాడెట్‌గా నిలిచారు. టెంట్ ఫిస్సింగ్ పోటీలో ఉపదేశ్, విజయ్, అభిషేక్, హరిశంకర్, జయంత్, కరీంబాష, వెంకటేష్ మొదటి బహుమతిని సాధించారు. వీరు చీరాలలో జరగనున్న తదుపరి క్యాంపునకు కూడా ఎంపికయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్లును క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ డాక్టర్ శ్రీగాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రశాంత్, జి.శ్రీనివాసరావు, బుజ్జిబాబు, వాసుబాబు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల తిరస్కరణ.. ఆందోళనలో రైతులు

ఒంగోలు(రూరల్), మే21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో పొగాకు కొనుగోలుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికశాతం బేళ్ల తిరస్కరణకు గురవుతున్నాయి. బుధవారం జరిగిన వేలానికి 593 బేళ్లు రాగా 436 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 135 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర కిలో రూ.280, కనిష్ఠ ధర రూ.200 పలికింది. అయితే నోబిడ్‌క గురైన బేళ్లను తిరిగి ఇంటికి తీసుకుపోవటం ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ

నాగులుప్పలపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దిరాల గ్రామంలో నిర్మించిన 27 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహం, 27 అంగుళాల శిలామయ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

మార్బుల్ కార్మికుడి ఆత్మహత్య

ఒంగోలుక్రైం, మే21(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి మార్బుల్ పని చేసే కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నగరం నెహ్రూనగర్ ఎక్స్‌టెన్షన్‌లో భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డికి చెందిన అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ మార్బుల్ పని చేసేందుకు పేర్నమిట్టలోని సుందరయ్యనగర్‌కు చెందిన శ్యామిశెట్టి సుధాకర్ (42) వచ్చాడు. అయితే ఆయన రెండో అంతస్తుకు వెళ్లి పైనుంచి కిందకు దూకి చనిపోయాడు. అతను వారం రోజులుగా ఎలాంటి పనులకు వెళ్లడం లేదని, బుధవారం ఇంటి వద్ద నుంచి పనికి వెళుతున్నాని చెప్పి వెళ్ళి మృత్యువాత పడ్డాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతలు

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోలు ఒసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు నగరం కర్నూలురోడ్డులో కళాకారులు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై కళాజాతాను నిర్వహించారు. జై రావు కళాబృందం హెచ్‌ఐవీ సోకే విధానం, టీబీ లక్షణాలు పాటలు, నాటికల ద్వారా తెలిపారు. 2017 యాక్ట్, 1097 టోల్ ఫ్రీ నెంబరు, రక్తదానంపై కళాకారులు ప్రదర్శించిన జాతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రో స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ పీరుబాషా, ఏఎన్‌ఎం పద్మ పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

మద్దిపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): సీతారామపురంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం హనుమజ్జయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. అలాగే మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, నందిపాడు, పెద్దకొత్తపల్లి గ్రామాలలో సైతం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పండ్ల తోటలను సాగు చేసేలా చూడాలి

మద్దిపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలో 200 ఎకరాల పండ్లతోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నామని, అందువల్ల రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఏపీవో ధనుంజయవర్మ తెలిపారు. బుధవారం మద్దిపాడులోని ఉపాధి హామీ కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండ్లతోటలు సాగు చేస్తే రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి ప్రత్యూష, టీఏ శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మద్దిపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలతో పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం మండల నాయకులు కనపర్తి సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధరలేక ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలం కేంద్రాల్లో నోబిడ్ పేరుతో బేళ్లు వెనక్కి పంపుతున్నారని, పొగాకు కొనుగోలు చేయని పక్షంలో ఆందోళన చేపడుతామని తెలిపారు.

వైసీపీ యువజన అధ్యక్షుడిగా అన్వేష్

మద్దిపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ సంతనూతలపాడు నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా పల్లపాటి అన్వేష్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి దక్కుందుకు సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున, ఎంపీపీ వాకా అరుణ, కోటిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులపై సమీక్ష

సంతనూతలపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఉపాధిహామీ పనులపై సమీక్షించారు. వర్షాలు తగ్గిన వెంటనే ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. ప్రతీ పంచాయతీలో కొత్త పనులను గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, సిబ్బంది పాల్గొన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో మాల్యవంశపు మహారాణి, రాజమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్ జిల్లెలమూడి రమాదేవి, కో కన్వీనర్ హేనం ఆషారావుల ఆధ్వర్యంలో అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె జీవితచరిత్రను వివరించారు. కార్యక్రమంలో పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

నాగులుప్పలపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): మోపెడ్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడిన సంఘటన ఉప్పుగుండూరు వద్ద జరిగింది. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం ఆంజనేయులు బుధవారం సాయంత్రం తన మోపెడ్‌పై గ్రామ సమీపంలోని తన పొలానికి వెళ్లేందుకు కోల్డ్‌స్టోరేజ్ జంక్షన్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో కారు ఢీకొంది. దీంతో ఆంజనేయులు రోడ్డుపై పడి గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలులోని ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా సేవాసంకల్ప్ ట్రస్ట్ వార్షికోత్సవం



కేక్‌కట్ చేస్తున్న ట్రస్టు సభ్యులు

సంతనూతలపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గత ఏడాది నుంచి పేదలకు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా అన్నదానం నిర్వహించినట్లు చైర్మన్ శనగల వెంకటరమణ తెలిపారు. ఫౌండర్ పాతూరి సంపత్ ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో దాతల సహకారంతోనే పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. పలువురు ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 25న ట్రస్టు పర్యవేక్షణలో సర్వనేత్రాలయ రెటీనా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సంతనూతలపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం జరుగుతుందని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నాయబ్‌రసూల్

ఒంగోలు(రూరల్), మే21 (ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేయాలని తహసీల్దార్ షేక్ నాయబ్ రసూల్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు మండలం కరవది పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. భూములు గల ప్రతి రైతుతో మాట్లాడాలని చెప్పారు. రైతుల సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ విష్ణువర్ధన్, వీఆర్వోలు చిరంజీవి, కృష్ణారావు రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారానికి 23వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మోకాళ్ళపై కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంటా ప్రసన్న, జీవనజ్యోతి, శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రామాలయాన్ని సందర్శించిన విదుశేఖర భారతీ మహాస్వామి

రాములవారికి విదుశేఖర భారతీస్వామి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు శ్రీ విదుశేఖర భారతీ మహాస్వామి మండలంలోని గొబ్బూరు రామాలయంలో బుధవారం సీతా సమేత రామచంద్రుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విదుశేఖర స్వామి విచ్చేసిన సందర్భంగా అర్చకులు అరుణస్వామి, భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టాభిరామ స్వామి ఆలయాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి పాదాలకు జలాభిషేకం నిర్వహించారు. స్వామి భక్తులను ఆశీర్వచనం అందజేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

భక్తులకు అన్నదానం

గిద్దలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు మాజీ సర్పంచ్ అక్కి పుల్లారెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యోగా గురూజీ నారాయణ, కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, దేవస్థాన కమిటీ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, రెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.



వెలిగొండ తీగలేరు కాలువలో ప్రవహిస్తున్న వరద నీరు



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిలిచిన వాన నీరు

3 గంటలు భారీ వర్షం

- పడమటి గ్రామాల్లో కురవని వాన
- చిన్నదోర్నాల చప్టాపై వరద
- స్తంభించిన రాకపోకలు
- చల్లబడిన వాతావరణం
- పత్తి రైతులకు ఊరట

పెద్దదోర్నాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మూడు గంటల పాటు కురిసిన వర్షానికి తీగలేరు వాగుకు వరదనీరు చేరింది. మండలంలోని పడమటి పల్లెలు ఎగువ చెర్లోపల్లి, నల్లగుంట్ల తదితర గ్రామాల్లో చిరు జల్లులు మాత్రమే కురిసాయి. గంటవానిపల్లె వద్ద మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో ఎర్రవాగు, తీగలేరుకు వరద నీరు భారీగా చేరడంతో ప్రవాహం ఉధృతి పెరిగి చిన్నదోర్నాల చప్టా వద్ద దోర్నాల - మార్కాపురం రోడ్డుపై ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గత కొద్ది రోజులుగా వాతావరణం చల్లబడినా ఉష్ణోగ్రతలు తగ్గలేదు. దాంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. అయితే బుధవారం కురిసిన వానతో వేసవి తాపం నుంచి బయట పడ్డారు. ఇదిలావుండగా వేసవిలో సాగు చేసిన పత్తి రైతులకు ఈ వాన ఊరటనిచ్చింది. చాలా మంది రైతులు బోరుబావుల కింద మే మొదటి వారంలోనే పత్తి సాగు చేపట్టారు. కొన్ని మొలకదశలో ఉన్నాయి. మరి కొంత పైరు పది, పదిహేను రోజుల వ్యవధి సాగులో ఉంది. ఎండల ధాటికి మొక్కలు చాలా వరకు చనిపోతున్నాయి. తెగుళ్ల బెడద, పైగా బోరు బావుల్లో కూడా భూగర్భ జలాలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. ఆందోళనలో ఉన్న రైతన్నలకు వానలు ఉపశమనం కలిగించాయి. ఖరీఫ్ సాగుకు ఈ ఏడాది ముందుగానే కాలం అనుకూలంగా మారిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పొదిలిలో మోస్తరు వాన

పొదిలి : పట్టణంలో బుధవారం ఉదయం మోస్తరు, రాత్రి భారీ వాన కురిసింది. దీంతో రహదారులపై నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉండడంతో చిన్నిపాటి వాన పడినా నీ రు నిలిచి ఇబ్బందికరంగా మారుతోంది. వైసీపీ పాలనలో రహదారులును ధ్వంసమయ్యాయి. జువ్వలేరు, కేజీబీవీ పాఠశాల, పిచ్చిరెడ్డితోట రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఒంగోలు- కర్నూలు, ఉప్పలపాడు ప్రధాన రహదారి, మసీద్ సమీపంలో వాన నీరు నిల్వ ఉం టోంది. పాతపోస్టాఫీస్ సీసీ రోడ్డుపై నీరు నిలిచి ఇ బ్బందికరంగా మారుతుంది. విశ్వనాధపురం, అపో లో ఫార్మసీ, రిలయన్స్ ట్రెండ్స్ షాపుల ముందు ఎత్తుగా మట్టిపోయడంతో వర్షపునీరు నిల్వఉండి రహదారిపై పారుతున్నాయి.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం రావిపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ తిరునాళ్ల సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమత్ జయంతి వేడుకలు



ముత్యాల అలంకరణలో ఆంజనేయస్వామి

మార్కాపురం వన్‌టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : నాగులపుట్ట వీరంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రొంపిచర్ల చైతన్యకుమార్ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, విశేష అలంకారం, అర్చన నిర్వహించారు. అనంతరం ముత్యాలతో, వివిధ పుష్పాలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కాశీరామ్‌సింగ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్, కోశాధికారి రామడుగు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న వేడుకలు

గిద్దలూరు : పట్టణంలోని రేడియోబావి సెంటర్ వద్ద శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లక్ష తమలపాకుల పూజ నిర్వహించగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 108 కలశాలతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం సహస్ర నామ పూజ, మహా మంగళ హారతి నిర్వహించారు. సాయంత్రం దేవస్థాన ప్రధాన అర్చకులు రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి మహా పుష్పాభిషేకం కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

బేస్తవారపేట : బేస్తవారపేట నుంచి దరగ గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో హనుమత్ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు డీ సిద్దయ్య తెలిపారు. ఉదయం నుంచి అభిషేకాలు, ఆకు పూజ, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొమరోలు : కొమరోలులోని శ్రీ విజయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు శ్రీదర్‌శర్మ, శంకర్, సుబ్రమణ్యం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

గిద్దలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన జనసేన పార్టీ కార్యకర్త అలిశెట్టి విజయ్ కుటుంబాన్ని జనసేన నాయకులు పరామర్శించారు. ఆపార్టీ నాయకుడు శంకర్‌నాయుడు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించి, కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, లంకా జనార్దన్, బాలుడు, రవితేజ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఆట వస్తువుల బహూకరణ

గిద్దలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి వచ్చిన విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా విశ్రాంత లైబ్రేరియన్ జయరామిరెడ్డి ఆట వస్తువులను బహూకరించారు. ఖాళీ సమయాలను వృథా చేసుకోకుండా లైబ్రరీలకు వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యువ ప్రగతి పథం సంస్థ అధ్యక్షుడు ఫరూఖ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి సైన్స్‌పై అవగాహన కల్పించారు. క్విజ్ ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానం రాబట్టారు. కథలు వినిపించి, ఇంగ్లీష్ గ్రామర్‌ను చెప్పారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలలో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలతో పాటు వివిధ పోటీ పరీక్షలలో పాల్గొనేందుకు అవసరమైన మెటీరియల్ కూడా ఉన్నట్లు చెప్పారు. వేసవి సెలవులు వృథా చేయకుండా ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు చిత్రలేఖనం, చదరంగం, కథలు చెప్పటం తదితర కార్యక్రమాలతో పాటు ఆటలలో పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల మేర ఆస్తినష్టం

పెద్దారవీడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని దేవరాజుగట్టులో చోటుచేసుకుంది. దుకాణ యజమాని దూదేకుల చాంద్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. షాపులో రెండు ఫ్రిజ్‌లు, జ్యూస్ తయారు చేసే సామగ్రి, పండ్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల మేర నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది మా ర్కాపురం నుం చి వచ్చి మంటలను అదుపు చేసినట్లు తెలిపారు.



దుకాణంలో కాలిపోయిన సామగ్రి, వస్తువులు



యాచవరంలో ఏఎన్‌ఎంలకు సూచనలు ఇస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్లు

విలేజ్ క్లినిక్‌ల తనిఖీ

కంభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : అర్థవీడు మండలంలోని యాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నాగులవరం, కాకర్ల విలేజి హెల్త్ క్లినిక్‌లను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'పల్లె వైద్యం.. పేదలకు దూరం' అనే శీర్షిక వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా అధికారి వెంకటేశ్వర్లు వైద్యశాలలో ఉన్న ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలను కలిసి విచారించారు. ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు ప్రస్తుతం సమ్మెలో ఉన్నందున వారికి బదులు ఏఎన్‌ఎంలు, ఆశాలు క్లినిక్‌లో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. యాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అన్ని జాతీయ, ఆరోగ్య కార్యక్రమాలకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రులలో మందుల స్టోర్, ల్యాబ్, హాజరు పట్టిని పరిశీలించి విధులకు సక్రమంగా హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందుల స్టోరు, ల్యాబ్‌లను పరిశీలించి కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు తీసివేయాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా పై మండలాల్లో విలేజ్ క్లినిక్‌లలో పని చేసే సిబ్బంది సమయపాలన పాటించాల్సిందిగా వెంకటేశ్వర్లు ఆదేశించారు. సిబ్బందికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు అన్ని వేళలా వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. విలేజి క్లినిక్‌లను నిర్వహించుటకు అవసరమైన అన్ని మందులు, పరికరాలు అందుబాటులో ఉంచుకోవలసిందిగా సూచించారు. సిబ్బందికి కేటాయించిన పని చేసే చోట నివాసం ఉండాలని ఆదేశించారు. ప్రజలకు హెల్త్ క్లినిక్‌లపై నమ్మకం కలిగేలా అంకిత భావంతో సేవ చేయాలన్నారు. వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్, సెలైన్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

ప్రధాన రహదారిపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పొదిలి, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి గురువారం సిబ్బందితో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. షాపుల ముందు ఉన్న సైడు కాలువలపై కాంక్రీట్ వేయడంతో మురుగునీరు పారకుండా రోడ్లపైకి వస్తోంది. దీనిపై అందిన ఫిర్యాదులపై స్పందించిన కమిషనర్ తొలగింపు కార్యక్రమం చేపట్టారు. గురువారం ప్రధాన వ్యాపార సముదాయమైన పాతూరు పెద్దబస్టాండ్‌లో ఎక్స్‌కవేటర్‌తో షాపుల ముందు ఏర్పాటు చేసిన ఆక్రణలను తొలగించారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

ఎర్రగొండపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ ఓబులరెడ్డి తిరుమలయ్య పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. బుధవారం వైపాలెంలో జరిగిన మహానాడు సభలో టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు వేములకొండ శ్రీనివాసగౌడ్ సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. టీడీపీ కండువాకప్పి తిరుమలయ్యను సాదరంగా ఆహ్వానించారు.



తిరుమలయ్యకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- దుష్ట పాలనకు చరమగీతం పాడిన ప్రజలు
- మినీ మహానాడులో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, అందుకోసమే ఆనాడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని టీడీపీ వైపాపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు సందర్భంగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభకు టీడీపీ యువనాయకుడు వేగినాటి శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం మండల వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ,బీసీ సామాజిక వర్గాలవారికి స్థానిక సంస్థల్లో పదవులు కేటాయించిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు పునాది వేస్తే, అనంతరం వచ్చిన జగన్‌రెడ్డి దుష్ట పాలన సాగించి రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. ఆయన అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో మళ్లీ టీడీపీకి పట్టంగట్టారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయం సత్తా చాటేలా శ్రేణులు శ్రమించాలని గూడూరి పిలుపునిచ్చారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సభలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్ గౌడ్, టీడీపీ పుల్లలచెరువు, దోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం మండలాల అధ్యక్షులు వయ్యావుల ప్రసాద్, యేర్వ మల్లికార్జునరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, మేకల వళరాజు, టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు శనగా నారాయణరెడ్డి, గోట్టం శ్రీనివాసరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, మేడికొండ లక్ష్మినారాయణ, తోట మహేష్, పొట్ల గోవింద్, వెంకటనారాయణ, గుమ్మా గంగరాజు, మోటకట్ల శ్రీనివాసరెడ్డి, జడ్డా రవి, జడి లక్ష్మయ్య, సత్యనారాయణగౌడ్, ఆళ్ల నాసరరెడ్డి, నలగాటి చి న్న మల్లికార్జుననాయుడు, షేక్ మస్తాన్ వలి, అబ్రహం, ప్రసాద్, జీవయ్య పాల్గొన్నారు.



మినీ మహానాడు సభలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

నియోజకవర్గ అభివృద్ధికి తీర్మానాలు

ఎర్రగొండపాలెం నియోజకవర్గం ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలంటే వెలిగొండప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి నీరు విడుదల చేయాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మహానాడులో బుధవారం తీర్మానం చేయించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలకు అందరూ ఆమోదించారు. పుల్లలచెరువు మండలంలో 11 వేల ఎకరాలకు సాగు నీరు, 4వేల మందికి తాగునీరు అందించాలంటే టీ5 కాలువకు నిధులు మంజూరు చేయాలి. త్రిపురాంతకం నుంచి ఎర్రగొండపాలెం స్టేట్ హైవేను డబుల్ రోడ్డుగా నిర్మాణం, వైపాలెం నుంచి పుల్లలచెరువు వరకు 21 కి.మీ బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా, త్రిపురాంతకం మండలం పాతముడివేముల వద్ద గుండ్లకమ్మనదిపై లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ, పుల్లలచెరువు మండలం చౌటపాశర్ల వద్ద వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్, దోర్నాల మం డలం గంటవానిపల్లె వద్ద తీగలేరు కాల్వపై బ్రిడ్జి నిర్మాణం, ఎర్రగొండపాలెం మండలం గంజివారిపల్లె వద్ద కోటకట్ల రిజర్వాయర్ నిర్మాణం, పెద్దారవీడు మండలం బీ చెర్లోపల్లి నుంచి చట్లమిట్ల నుంచి కర్నూ లు గుంటూరు జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు, ఐటీడీఏ ఆఫీసు శ్రీశైలం నుంచి దోర్నాలకు మార్చడం, మార్కాపురంను జిల్లా కేం ద్రంగా చేయడం, దోర్నాల నుంచి మార్కాపురం వెళ్లే రోడ్‌లో చిన్న దోర్నాల వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం, పుల్లలచెరువు మండలం ఐటి వరం నుంచి మాచర్ల నియోజకవర్గం దుర్గి వరకు డబుల్ రోడ్డుగా నిర్మాణం తదితర అంశాలపై తీర్మానం చేయగా, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

ఎంపీడీవో తీరుపై కార్యదర్శుల నిరసన

- ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారని ఆరోపణ

తర్లుపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చక్రపాణి ప్రసాద్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించినప్పటికీ వివిధ షాపులతో కార్యదర్శులతో నోటీసులు ఇవ్వడం ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వైఖరిపై మూకుమ్మడిగా సెలవుపై వెళ్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. గత నెల 29న మార్కాపురం డీఎల్‌డీవో శ్రీనివాసులరెడ్డి సమావేశానికి రాని ఏడుగురు కార్యదర్శులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. మీటింగ్ రాని వారికి ఒక రోజు వేతనం వెనక్కి కట్టాలంటూ మెమోలో పేర్కొన్నారు. మన మిత్ర సర్వే సక్రమంగా చేసినా పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అం దరూ మూకుమ్మడిగా సెలవు సీట్లు రాసి ఎంపీడీవోకు ఇవ్వగా వాటిని ఉన్నతాధికారులకు ఇచ్చుకోండంటూ విసిరివేశారు. ఎంపీడీవో వైఖరిపై జిల్లా అధికారుల వద్దకు వెళ్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శుల యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. కార్యదర్శులు విధుల పట్ల నిబద్ధతో సర్వేలన్నీ పూర్తి చేసినప్పటికీ అకారణంగా మెమోలు జారీ చేశారని, జీతాలు కూడా నిలుపుదల చేస్తానంటూ బెదిరించారని అసహనం వ్యక్తం చేశారు. తమపై చిన్న చూపు చూస్తున్నారని, ఈనెల జీతాలు కూడా పెట్టనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సుధాకర్ బాబు, పద్మ, గోపీకృష్ణ, కాళంగి శ్రీనివాసులు, బ్రహ్మాచారి, పద్మావతి, చైతన్య, రామాంజనేయరెడ్డి తదితరులు నిరసన తెలిపినవారిలో పాల్గొన్నారు.



ఎంపీడీవో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే మెమోలు

గత నెల 9న జరిగిన డీఎల్‌డీవో శ్రీనివాసులరెడ్డి సమావేశానికి రాలేదని ఆయన చెప్పడంతో ఏడుగురు పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశాను. ఒక రోజు వేతనం కూడా వెనక్కి కట్టాలంటూ ఆదేశించా. విధుల పట్ల నిబద్ధతతో పనిచేయమని చెప్తే ఇలా తన ఎదుట నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.

- చక్రపాణి ప్రసాద్, ఎంపీడీవో

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

దొనకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక అడ్డరోడ్డులోని శ్రీ విజయాంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిరహించనున్నట్లు ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, పంచామృత అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి కంభంకు చెందిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కోలాట బృందంచే కోలాటం ప్రదర్శన, మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే కలివెలపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి 33వ వార్షికోత్సవం ఈ నెల 25వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

26న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

దొనకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలివెలపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి వార్షికోత్సవం సందర్భంగా 26వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 25వ తేదీ సాయంత్రంలోపు రూ.500 డిపాజిట్ చెల్లించి వారిపేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9346061351, 9492813044, 8185817474 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఆరోజు భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించుకోవాలి

తాళ్లూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత మే నెల, రోహిణీ కార్తెలో అధికంగా ఎండలు ఉండాల్సిన సమయంలో వర్షాలు కురుస్తున్నందున వర్షపు నీటితో భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని వ్యవసాయాధికారి బిప్రసాదరావు బుధవారం తెలిపారు. వర్షపు నీరు వృథాగా పోకుండా పొలాల్లో చిన్నపాటి కుంటలు తీసుకుంటే ఆకుంటల్లో వర్షపు నీరు చేరి భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్నారు. పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లి పశువుల మేతగా ఉపయోగించుకోవాలని చెప్పారు. 40 రోజుల వరకు ఏపుగా పెరిగిన తర్వాత ఆపచ్చి రొట్ట మేత ను బాగా భూమిలో కలియదున్నాలన్నారు.

విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం

తాళ్లూరు, మే21 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరులో విద్యుత్తు టవర్స్‌కు తీగల ఏర్పాటు చేస్తూ విద్యుత్తు అధికారులు ఇష్టానుసారం అంతరాయం కల్గిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ 6 గంటల తరువాత ఎలాంటి ఎల్‌సీలు ఇవ్వకూడదన్న నిబంధనలకు విరుద్ధంగా గంటల కొద్దీ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగలేదు.దీంతో రాత్రి 8 గంటల వరకు ప్రజలు అంధకారంలో మగ్గిపోయారు. పొలాల నుంచి ఇంటికి వచ్చిన గేదెలకు నీరు తాగించేందుకు మోటార్లు పని చేయకపోవటంతో ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తు శాఖ అధికారులు కూడా రాత్రి 8 గంటల వరకు ఎల్‌సీలు ఇస్తూ అందర్నీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

దొనకొండ పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా బహూకరణ

దొనకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): దొనకొండ పోలీస్‌స్టేషన్‌కు మండల టీడీపీ అధ్యక్షుడు మోడి అంజనేయులు సమకూర్చిన డ్రోన్ కెమెరాను ఎస్పీ దామోదర్‌కు బుధవారం అందజేశారు. కనిగిరిలో జరిగిన పోలీస్‌శాఖ క్రైమ్ సమావేశం అనంతరం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా దొనకొండ పోలీస్‌శాఖకు డ్రోన్ కెమెరాను అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులును ఎస్పీ అభినందించారు. ఎస్ఐ త్యాగరాజు సూచన మేరకు అత్యాధునిక సాంకేతికతో కూడిన డ్రోన్ కెమెరాను అందజేసినట్లు ఆంజనేయులు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ హసన్, దొనకొండ ఎస్ఐ త్యాగరాజు, నాగులపాటి శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూబెల్లా వ్యాక్సిన్‌కు ప్రత్యేక ప్రణాళిక

తాళ్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మజిల్స్ రూబెల్లా నివారణకు తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వైద్యాధికారి మౌనిక, శ్రీకాంత్‌లు బుధవారం తెలిపారు. మజిల్స్ రూబెల్లా వ్యాధి సోకిన పిల్లలకు జ్వరంతోపాటు దద్దుర్లు వస్తాయన్నారు. పిల్లల శారీక పెరుగుదల తగ్గుతుందని చెప్పారు. పదినెలల చిన్నారుల నుంచి 18 నెలల వరకు వ్యాక్సిన్ ఇస్తామన్నారు. మొదటి విడతగా 26 నుంచి 31వ తేదీ వరకు, రెండవ విడత జూన్ 23 నుండి 26వ తేదీ వరకు, మూడవ విడత జూలై21 నుంచి 26వ తేదీ వరకు మూడు విడతలుగా వ్యాక్సిన్ ఇస్తామని చెప్పారు.

అక్కడ విధులంటే.. వివాదాలు, కొర్రీలే!

తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం పనితీరుపై సర్వత్రా విమర్శలు

సమస్యలు పరిష్కారం కాక ప్రజలకు ఇబ్బందులు

గత వైసీపీ ప్రభుత్వహయాంలో భూరీసర్వే తప్పులు ఒక్కటీ పరిష్కారం కాలేదు

తాళ్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మండల రెవెన్యూ కార్యాలయం వివాదాలకేగాక, ప్రజా సమస్యల పరిష్కారంలో నాన్చుడు ధోరణికీ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఏ సమస్య వచ్చినా నెలల తరబడి తిప్పుకోవడం రెవెన్యూ అధికారులకు పరిపాటి అయ్యింది. ప్రతి సమస్యలకు ఏదో ఒక కొర్రీ వేస్తూ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతుండడం సర్వసాధారణమైంది. కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయంలో కీలకస్థాయి అధికారి నుంచి గ్రామస్థాయి అధికారి వరకు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది సమయంలో ముగ్గురు తహసీల్దార్లు మారటం, ప్రస్తుతం ఉన్న అధికారులు రెవెన్యూ సమస్యలను పరిష్కరించకపోవటంతో ప్రజలకు రెవెన్యూ కష్టాలు తప్పట్లేదు. అధికారుల మధ్య సఖ్యత లేక అవసరార్థులు నలిగిపోతున్నారు.

● కొర్రీలే అధికం...

తహసీల్దార్ కార్యాలయంలో కీలక అధికారి పనిగట్టుకుని ఏదో ఒకసాకు చూపుతూ పనులు చేయకుండా వాయిదాలు వేస్తున్నారు. సిబ్బంది తప్పుడు రికార్డులు సృష్టించారని, కార్యాలయ రికార్డును, సిబ్బందిని నమ్మటానికి వీల్లేదన్న రీతిలో ఆయన వ్యవహరిస్తున్నారు. దరఖాస్తులు పెట్టుకున్న ప్రజల సమస్యలు పరిష్కారం కాక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సిబ్బంది పెండింగ్ ఫైళ్లను తీసుకెళ్లినా ఏదో ఒక సాకు చూపుతూ వాటిని వెనక్కి పంపుతుండడంతో పనులు ముందుకు సాగటం లేదు. ప్రజలు అధికారులను కలవాలన్నా అనుమతి లేకపోవటంతో కార్యాలయ ఆవరణలో పడిగాపులు కాస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.



తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం, అధికారుల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

● గత ఐదేళ్లు ఇబ్బంది పడ్డాం.. మళ్లీ ఇప్పుడు కూడా...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూసర్వే వల్ల పలుగ్రామాల్లో తప్పులు దొర్లాయి. ఆ తప్పులను సరిద్దలేదని, దీనివల్ల భూముల రిజిస్ట్రేషన్లు, బ్యాంక్‌లో రుణాలు నిలిచాయని పలుగ్రామాల రైతులు వాపోతున్నారు. గత ఐదేళ్లలో ప్రతిపక్షంలో ఉండి రెవెన్యూ అధికారులు సహకరించక ఇబ్బందులు పడగా, ప్రస్తుతం కూడా తమ పనులు కావటంలేదని అధికార పక్ష నాయకులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అధికారులు, సిబ్బంది సమక్షంలోనే తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ పరస్పర దూషణలతో వాదులాడుకోవటం సర్వత్రా చర్చనీయాంశమైంది.

● రీసర్వే తప్పులు సరిదిద్దలేదు

వద్దినేని శ్రీనివాసరావు, శివరాంపురం



నా భూమి గత ప్రభుత్వం జరిపిన రీసర్వేలో తప్పుగా నమోదు చేశారు. ఇటీవల గ్రామసభలో దరఖాస్తు ఇచ్చి మూడు నెలలు దాటినా తప్పు సరిదిద్ద లేదు. వారసత్వంగా సంక్రమించిన భూముల సర్వేనంబర్ 172లో 90 సెంట్ల భూమిలో 0.056 సెంట్ల భూమి మాత్రమే రికార్డుల్లో ఉంది. 171/1లో 1.70సెంట్లు, 164/12లో 54 సెంట్లు, 141/3లో 1.18 సెంట్లు కలిసి 3ఎకరాల 42 సెంట్లు భూమిరికార్డుల్లో కన్పించడం లేదు. బ్యాంక్‌లో రుణాలు రీషెడ్యూలు జరగక ఇబ్బందిగా ఉంది. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పరిష్కరించటం లేదు.

● పూర్తి సమాచారంతో ఫైళ్లు పంపడం లేదు

కే సంజీవరావు, తహసీల్దార్

కింది స్థాయి నుంచి పూర్తి సమాచారంతో ఫైళ్లు పంపటం లేదు. కార్యాలయంలో ఉన్న రికార్డులు కొన్ని టాంపరింగ్ జరిగాయి. సమస్యలపై వచ్చిన దరఖాస్తులను కార్యాలయ రికార్డులను పరిశీలించి సరిగా ఉన్న వాటిని పరిష్కరిస్తున్నాం. ఇటీవల కార్యాలయంలో జరిగిన వాగ్యుద్ధం విషయమై మాట్లాడుతూ సిబ్బందిని విధులు సక్రమంగా నిర్వహించమని చెబితే ఆవేశంగా మాట్లాడమే తప్ప మరేమి లేదు.

నేరాల నియంత్రణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

కనిగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ దామోదర్ చెప్పారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం జిల్లా స్థాయిలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి సర్కిల్, పీఎస్‌ల పరిధిలో విధిగా ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న వివరాలను గోప్యంగా విచారించి వాటికి అడ్డుకట్టు వేయాలని సూచించారు. రాత్రి సమయాల్లో నిఘా మరింత పెంచాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు అల్లర్లు జరిగే సమయంలో తప్పనిసరిగా డ్రోన్ కెమారాలను వినియోగించాలని చెప్పారు. పట్టణ కేంద్రాల్లో ప్రధాన రోడ్డు వెంబడి ఉండే వ్యాపారసంస్థలు, షాపులు యజమానులకు అవగాహన కల్పించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. దొంగతనాలు రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, శివారు ప్రాంతాలు, జనసంచారం లేని ప్రాంతాలు, తోటలు, కొండ దిగువ ప్రాంతాల్లో గస్తీ చేపట్టాలన్నారు. అదే విధంగా సుదూర ప్రాంతాల నుంచి వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



సమీక్షకు హాజరైన పోలీస్ అధికారులు

సమావేశంలో ఏఎస్‌పీ కే నాగేశ్వరరావు, కనిగిరి, మార్కాపురం, దర్శి డీఎస్పీలు సాయిఈశ్వర్‌యశ్వంత్, యూ నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని పలు సీఐలు, ఎస్ఐలు కనిగిరి నగర నలుమూలల నాకాబందీ నిర్వహించారు. గార్లపేటరోడ్డులో ఒంగోలు దిశ సీఐ సుధాకర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. అదే విధంగా ఒంగోలు సీసీఎస్ బాబురావు ఒంగోలు బస్టాండు సెంటరులో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

పామూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరగలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన దక్షిణామూర్తి, విష్ణుమూర్తి, భక్తాంజనేయస్వామి, మహిగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల నూతన జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. నూతన ఆలయం నిర్మాణం పూర్తయిన సందర్భంగా వేద పండితులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో యాజ్ఞయాగాల క్రతువులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. యాగశాలలో వేద పండితులు ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వద కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, బొట్ల నాగార్జున, సయ్యద్‌అమీర్‌బాబు, ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, మాజీ సర్పంచ్ గురుబ్రహ్మం, ఎం బాలబ్రహ్మయ్య, ఎం గోవిందు, ఏ రమణమ్మ, ఎం నరసింహారావు, డీ సుబ్బారావు, పచ్చవ బాబు, కౌలూరి ఖాజా రహంతుల్లా పాల్గొన్నారు.



నూతన ఆలయ పూజ కార్యక్రమంలో ఉగ్ర

రసవత్తరంగా సాగిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు

పీసీపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదఅలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం సమీపంలో పాలేటిగంగ దగ్గర అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్లపోటీలలో భాగంగా రెండవరోజైన బుధవారం జూనియర్ విభాగ ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శివక్రిష్ణ శిరీష సోదరి ఆర్కె బుల్స్ 4230.1మీటర్లు లాగి మొదటి బహుమతి 60,116రూపాయలు సాధించగా, కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెర్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్ బాబు ఎడ్లు 3750మీటర్లు లాగి రెండవ బహుమతి 50,116రూపాయలు, గుంటూరు జిల్లాకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు 3600మీటర్లు లాగి మూడవ బహుమతి 40,116రూపాయలు, బాపట్ల జిల్లా పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన ఆళ్ల మోహన్‌రావు ఎడ్లు 3500మీటర్లు లాగి నాల్గో బహుమతి 30,11రూపాయలు సాధించాయి. గురువారం సీనియర్ ఎడ్ల విభాగ పద్రర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. విజేతలైన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాలకొండయ్య, వెల్లి కొండయ్య, గుదే నాగేశ్వరరావు, కొంపల్లి మధు, పరిమి ఈశ్వరరావు, వేమూరి సుబ్బారావు, వడ్డెంపూడి చిన్నా, చెరుకూరి సతీష్, రావి రాజా పాల్గొన్నారు



ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నేడు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే రాక

గురువారం జరగనున్న సీనియర్ ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభించేందుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా గంగాభవాని తిరునాళ్లు

పామూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడు జలాశయం వద్ద గంగాభవాని అమ్మవారి దేవస్థాన తిరునాళ్లలో భాగంగా బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రికి అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం బండ్ల పొంగళ్లు, నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చప్పిడి బ్రదర్స్ తెలిపారు. కాగా సీఎస్‌పురంలో 23 నుంచి 25 తేదీ వరకు శ్రీ గంగమ్మతల్లి తిరుణాళ్ల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

ముగిసిన విదుశేఖర భారతీ మహాస్వామి విజయయాత్ర

దర్శి, మే 21 (ఆంధ్రజ్యోతి) : శృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురువు విదుశేఖర భారతీ మహాస్వామి విజయయాత్ర వైభవంగా ముగిసింది. స్వామీజీ యాత్రలో భాగంగా మంగళవారంరాత్రి దర్శికి చేరుకున్న విషయం తెలిసిందే. దర్శిలో బుధవారం ఆయన పలు ఆలయాల్లో పూజలు చేశారు. తొలుత రామాలయం అర్చకులు కలవకొలను చంద్రశేఖర్ ఇంటి నుంచి బయలుదేరిన స్వామిజీ రామాలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో, వాసవీమాత ఆలయంలో పూజలు చేశారు. ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో భక్తులకు ఆశీర్వాదాలు అందించారు. అనంతరం రాయలసీమకు బయలుదేరి వెళ్లారు. ఈ యాత్రలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాలను అందుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అవీఇవీ

ప్రతి పంచాయతీలో కూలీలకు పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వాణి

సీఎస్‌పురం/పామూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు చేపట్టి అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పనులు చూపించాలని ఎంపీడీవో కే వాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనులు చేయాలని, కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు అలసత్వం వహిస్తే, కూలీల దగ్గర కమిషన్ తీసుకొంటే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

పామూరులో పలుచోట్ల కార్డెన్ సెర్చ్



అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పామూరులో సీఐ భీమానాయక్ తన పోలీస్ బలగాలతో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జీలను, పలు అనుమానిత ప్రాంతాలను, అనుమానిత వ్యక్తులను, పాత నేరస్థులను, వాహనాలను తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యపానం, మత్తు పదార్థాలు కలిగిఉన్నా, అక్రమంగా విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలతోపాటు 215 మంది ఏఆర్ పోలీసులు, స్పెషల్ బెటాలియన్‌లు పాల్గొన్నారు.

'ముండ్లమూరు'లో భారీ వర్షం



పెద ఉల్లగల్లులో కురుస్తున్న భారీ వర్షం

ముండ్లమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా సాయంత్రానికి ఉరుములు మెరుపులతో పాటు భారీ వర్షం కురిసింది. పెదఉల్లగల్లు, కెల్లంపల్లి, బసవాపురం, పులిపాడు, వేముల, కమ్మవారిపాలెం, ఈదర, జమ్మలమడక, మక్కెనవారిపాలెంలలో భారీ వర్షం కురవగా మిగతా గ్రామాల్లో స్వల్ప వర్షం కురిసింది. ఈ వర్షం కొంత మంది రైతులకు పంటలు సాగు చేసేందుకు మేలు చేయగా కల్లాల్లో ఆర బెట్టిన మిర్చి రైతులకు మాత్రం నష్టం వాటిల్లింది.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ముండ్లమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామ సచివాలయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించి వారికి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో సునీత చెప్పారు. ఆమె బుధవారం మండలంలోని పసుపుగల్లు, పెదఉల్లగల్లు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ముందుగా ప్రజలకు వివరించి లబ్ధిదారులకు అందే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం 12ఏళ్లలోపు ఉన్న పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయటంలో వెనుకబడి ఉందని, వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రేషన్‌కార్డుల్లో పేర్లు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మౌలాలి, రాజరాజేశ్వరి, జేస్సి ప్రతాప్, విజయమ్మ, ఆంజనేయులు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధికి గ్రామ కమిటీలే కీలకం

పామూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అభివృద్ధికి గ్రామ కమిటీలే కీలకమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు చెప్పారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా మండలంలోని పడమటకట్టకిందపల్లి, మార్కొండాపురం టీడీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. పడమటకట్టకిందపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా గట్ల కొండారెడ్డి, ఉపాధ్యక్షుడుగా తిరుమలశెట్టి చందు, ప్రధాన కార్యదర్శిగా మద్దిబోయిన కొండయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అదే విధంగా మార్కొండాపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా తుపాకుల శ్రీనుయాదవ్, ఉపాధ్యక్షుడుగా పాములపాటి తిరుపాలు, ప్రధాన కార్యదర్శిగా పుట్లూరి రమణారెడ్డిలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, అమీర్‌బాబు, జీ శ్రీను, కంచర్ల శ్రీనువాసులు పాల్గొన్నారు.

కొత్త డీప్‌బోర్ ఏర్పాటు

పామూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో గ్రామ టీడీపీ నాయకులు కొత్త డీప్‌బోర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. కాలనీలో చేతి పంపులు మరమ్మతులకు గురికావడంతో 10 రోజుల నుంచి నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామ టీడీపీ నాయకుడు పాలపర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన బోరును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాసులు, వార్డు మెంబర్ యేసురత్నం, ఆకుల నరసింహారావు, ఎగటీల మోహన్‌రావు, నాగిశెట్టి రత్తయ్య, జకరయ్య, యోబు లు ఉన్నారు.

ఉపాధి పనులు కొలతల మేరకు కూలి

సీఎస్‌పురం(పామూరు) మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో కొలతల మేరకు కూలి వస్తుందని ఏపీవో శ్రీనివాస్‌నాయక్ చెప్పారు. మండలంలోని గోగులపల్లి, మిట్టపాలెం, శీలంవారిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో నాయక్ బుధవారం పరిశీలించారు. కూలీల హాజరును తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో నాయక్

ఉష్ణోగ్రత (అంచనా) 22-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	38	26
తెనాలి	37	29
నరసరావుపేట	38	28
బాపట్ల	36	29
రెంటచింతల	37	28
చీరాల	36	29

నరసరావుపేటే మిగిలింది..!



చిలకలూరిపేట ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

- నేషనల్ హైవే భూ సేకరణ జఠిలం..!
- హైకోర్టులో రైతుల పిటిషన్‌లు
- పరిహారంపై ఒప్పందం చేయాలని పట్టు
- అంగీకరించని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వాడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారి భూ సేకరణ జఠిలమవుతోంది. నరసరావుపేటలో నష్టపరిహారం విషయంలో అధి కార యంత్రాంగం, రైతుల మధ్య వివాదం కొనసా గుతోంది. భూ సేకరణపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ.. రైతులు హైకోర్టును ఆశ్ర యించారు. పిటి షన్లను ఉపసంహరించుకోవాలని రైతులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చలు విఫల మ య్యాయి.

వేగంగా ఫేజ్ 1 పనులు

బాపట్ల జిల్లా వాడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలో మీటర్లు పొడవునా రూ.1,064 కోట్ల వ్యయంతో ఈసీపీ విధానంలో రహదారి నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌) పనులు నిర్వహిస్తోంది. రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్ల ప్యాకేజీని ఆర్‌ఆర్‌ఎస్‌ఎం సంస్థ చేపట్టింది.

● వివాదంగా 279.16 ఎకరాల భూసేకరణ

నరసరావుపేటలో రహదారి నిర్మాణానికి 279.16 ఎకరాల భూమి అవసరం. ఈ మేరకు సర్వే పూర్తి చేసి సంబంధిత రైతులకు భూసేకరణ నోటీసులు జారీ చేశారు. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పో తున్న బాధితులతో ఆర్డీవో కా ర్యాలయంలో ఇటీవల సమా వేశం నిర్వహించారు. నరస రావుపేట పట్టణం పరిధి లో ఉన్న వ్యవ సాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంట గార్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ విలువపై రెండున్నర రేట్లు పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో బాధితులకు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్ల స్థలాలకు గజానికి రూ.19 వేలు, రహదారికి లోపల ఉన్న ఇళ్ల స్థలాల కు రూ.16 వేలు చెల్లిస్తామని ఆర్డీవో వివరించారు. ఎకరాకు సుమారు రూ.1.75 కోట్లు పరిహారం చెల్లిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత పత్రాలను అధికారులు స్వీకరించారు. ఆర్డీవో ప్రకటించిన విధంగా లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇస్తే భూములు.. స్థలాలు ఇస్తా మని బాధితులు చెబుతున్నారు. లిఖితపూర్వకంగా ఇవ్వలేమని.. సదరు ధరలను నేషనల్ హైవే అథార్టీ అధికారులకు ప్రతిపాదిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కోర్టులో కేసులు ఉపసంహరించుకోవాలని సూచించారు. పరిహారం లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇవ్వాలని బాధితులు కోరడంతో.. ప్రతిష్టంభన కొనసాగుతోంది. నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలో 85.39 ఎకరాలు, జొన్నలగడ్డలో 37.15, నరసరావుపేటలో 33.55, గుంటగార్లపాడులో 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

167ఏ జాతీయ రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగంగా జరుగుతున్నాయి. పల్నాడు జిల్లాలో నరసరావుపేటలో మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. కొన్ని చోట్ల రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్టప రిహారాన్ని కూడా జమ చేశారు. ఎటొచ్చి నరసరా వుపేటలో బైపాస్ భూసేకరణ మొదటి నుంచి వివాదంగానే ఉంది. సర్వే రాళ్లను తొలగించడం, భూముల్లో మార్కింగ్ చేయకుండా రైతులు అడ్డుకుంటూ వస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం అలైన్‌మెంట్ మార్చడం కుదరని పని అని రైతులకు తేల్చిచెప్పారు.

● చిలకలూరి పేటలో..

చిలకలూరిపేట కొత్త బైపాస్ నుంచి అడ్డరోడ్డు వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తయింది. కావూరు నుంచి కన పర్రు వరకు భూసేకరణకు రైతులు అంగీకరించారు. కొందరు రైతు లకు నష్టపరిహారం వివరాల నోటీసులు కూడా అందజేశారు. కావూరులో 49.15, నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76 ఎకరాలు, గణపవరంలో 5.80, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91, రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రైతులు కూడా సానుకూలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. తర్వలోనే భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫేజ్-2లో ఇలా..

రెండవ ప్యాకేజీలో రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. చిలకలూరిపేట కొత్త బైపాస్ దగ్గర నుంచి ఈ పనులు ప్రారంభమవుతాయి. ఇందులో పాత రహదారిని విస్తరిస్తారు. ఈశ్వర కళాశాల దగ్గర కుడి వైపునకు నరసరావుపేట బైపాస్ ప్రారంభమవుతుంది. 14.4 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు. కుప్పగంజి వాగు మీదుగా టిడ్కో ఇళ్ల సమీపంలో రైల్వే లైన్ వద్ద ఆర్‌వోబీని, నరసరావుపేట -గుంటూరు రోడ్డు వద్ద ఫ్లైఓవర్, ఇస్సపాలెం దగ్గర సత్తెనపల్లి రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తారు. రావిపాడు తర్వాత ఉన్న రహదారిలో కలుస్తుంది. అక్కడ నుంచి ఉన్న రహదారిని విస్తరిస్తారు. అడ్డరోడ్డు దగ్గర బైపాస్ నిర్మిస్తారు. ఇదే గ్రామం వద్ద ఇంటర్ చేజ్ నిర్మించి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో కలుపుతారు.

బర్లీ రైతులను ఆదుకుంటాం

- పొగాకు రైతుల వెతలపైనే డీఆర్సీలో కీలక చర్చ
- ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నదాతలకు భరోసా
- ముందస్తు ఖరీఫ్ వల్ల రైతులకు మేలు
- సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులకు త్వరలోనే టెండర్లు
- లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను తిరిగి గాడిన పెడతాం
- ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకుకు సరైన ధర లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఈ అంశమే కీలకంగా బుధవారం కలెక్టరేట్ వేదికగా డీఆర్సీ సమావేశం జరిగింది. బర్లీ పొగాకు సాగు చేసిన రైతులను ఏ విధంగా ఆదుకోవాలనే దానిపైన సుదీర్ఘ సమీక్ష జరిపారు. బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందనే దానిపైనే డీఆర్సీ సమావేశంలో తొలి తీర్మానం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మంత్రులు అనగాని, గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, నక్కా ఆనంద్‌బాబు, ఏలూరి సాంబశివరావు, కొండయ్యతో పాటు గుంటూరు జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టినా పాల్గొన్నారు.



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, వేదికపై మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని, ఎమ్మెల్యేలు, ఎంపీ, కలెక్టర్

డీఆర్సీలో మంత్రులు, ఎమ్మెల్యేలు..

గుండ్లకమ్మ నదిపై మల్లవరం ప్రాజెక్టు గేట్ల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి రవికుమార్ ఆదేశించారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్రాజెక్టుల పునరుద్ధరణకు అయ్యే అంచనా వ్యయాలతో నివేదిక తయారు చేయాలని యంత్రాంగాన్ని మంత్రి కోరారు. జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపే విధంగా అందరం కలిసి అడుగులు వేయాలని, అందుకు ఈ డీఆర్సీయే సరైన వేదిక అని రెవెన్యూ మంత్రి అనగాని అన్నారు. జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంపై అధికారులను ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ నిలదీశారు. పొగాకును రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. చీరాల నియోజకవర్గంలో ఉపాధి పనులు అధికంగా కేటాయించి పేదలకు ఉపాధి చూపాలని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. సూర్యలంకను పర్యాటకంగా అభివృద్ధి చేసే చర్యలను ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే వేగేశన డీఆర్సీ దృష్టికి తీసుకొచ్చారు. కరకట్టలను పటిష్టం చేసే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు కోరారు. వాడరేవు-పిడుగురాళ్ల, గుంటూరు- నిజాంపట్నం ఓడరేవు వరకు జాతీయరహదారి 216 నిర్మాణ పనులను వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ వెంకటమురళి డీఆర్సీ దృష్టికి తీసుకువచ్చారు

గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో మీటింగ్

బర్లీ పొగాకు రైతులకు న్యాయం చేయడానికి జూన్ మొదటివారంలో పొగాకు కంపెనీలు, పొగాకు సాగు చేసిన రైతులతో పంటల గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం ఉంటుందని ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం డీఆర్సీలో తీసుకున్న నిర్ణయాలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం గ్రూప్ ఆఫ్ మినిష్టర్స్‌ను ఏర్పాటు చేసిందని పొగాకు రైతుల సమస్యలపై అవగాహన ఉన్న మంత్రి రవికుమార్‌ను కూడా అందులోకి తీసుకోవడం జరిగిందని ఇన్‌చార్జి మంత్రి వివరించారు. రైతులను పెద్ద ఎత్తున పొగాకు సాగు చేసే విధంగా కంపెనీలు ప్రోత్సహించి ఇప్పుడు వంచించినట్లు డీఆర్సీ అభిప్రాయపడ్డట్లు మంత్రి తెలిపారు. వర్షాలు ముందుగా కురవడం వల్ల అడ్వాన్స్ ఖరీఫ్‌పై రైతులు దృష్టి పెట్టాలని అధికారులను కోరినట్లు తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ఇప్పటికే రూ.97 కోట్ల నిధుల విడుదలకు అనుమతులు వచ్చిన సంగతి తెలిసిందేనని వారం రోజుల్లోపే తొలి విడత పనులకు టెండర్లు పిలుస్తామన్నారు.



యోగాసనాలు వేస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

యోగా జీవితంలో భాగం కావాలి

మంత్రి కొలుసు పార్థసారథి

బాపట్ల, మే21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి జీవితాలలో యోగా భాగం కావాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం బాపట్లజిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టన్ రైజర్ కార్యక్రమంలో మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు, ఎం.ఎం.కొండయ్య, నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 69వ సమావేశంలో 2014 సెప్టెంబరులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్21వ తేదిన జరపాలని ప్రతిపాదించారన్నారు. ఆ ప్రతిపాదనకు 177 దేశాలు ఆమోదం తెలిపాయన్నారు. 2015వ సంవత్సరం నుంచి ప్రతి ఏట జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై ఈరోజు నుంచి నెలరోజులపాటు విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. జూన్ 21న వైజాగ్‌లో 5లక్షలమందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ యోగ వల్ల శారీరక, మానసిక ధైర్యం వస్తుందన్నారు. బాపట్లజిల్లాలో సూర్యలంక, రామాపురంబీచ్‌లలో యోగా కార్యక్రమం జూన్ 21న నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగాశిక్షకులచే యోగాసనాలు అభ్యాసం చేయించారు.

తెలుగువారి ఆత్మగౌరవం టీడీపీ

- మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసమే పుట్టిన పార్టీనే టీడీపీ అని, 43 ఏళ్ల పార్టీ ప్రస్థానంలో తెలుగువాడు శాసించే స్థాయికి ఎదిగారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఉప్పూడి రోడ్డులోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో రేపల్లె నియోజకవర్గ టీడీపీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పహల్గాం దాడిలో మృతి చెందిన కుటుంబాలకు ఐదు నిమిషాల పాటు మౌనం పాటించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగువారి కీర్తిప్రతిష్టలు ఇనుమడింప చేయడంలో టీడీపీ కీలకపాత్ర పోషించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాక్షసపాలన నుంచి విముక్తి కోసం 93 శాతం విజయంతో అఖండ మెజార్టీ ఇచ్చిన ఘనత తెలుగు ప్రజలదేనన్నారు. 11 నెలల్లో రేపల్లె నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు.నిజాంపట్నం డబుల్ లైన్ రహదారి, నాలు లేన్లుగా 216 జాతీయ రహదారి విస్తరణ, తెనాలి-రేపల్లె రైల్వే ట్రాక్ డబుల్ లైన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. రేపల్లె నియోజకవర్గంలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ అభివృద్ధికి నిధుల కోసం కృషిచేస్తున్నామని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ముమ్మనేని వెంకటసుబ్బయ్య, తుడా చైర్మన్ కలగల రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు రామస్వామి, డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహానాడు సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందుకు

జిల్లా మహానాడులో మంత్రి పార్థసారథి

బాపట్ల,మే21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని సంక్షేమంతోపాటు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ జిల్లా మహానాడు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పిల్లలకు అమ్మఒడి, విద్యాదీవెన వంటివి ఇచ్చామని పెద్దపెద్ద సభలు పెట్టి చెప్పుకోవటం జరిగిందికాని విద్యార్థికి చదువు తర్వాత మంచిభవిష్యత్తును అందించలేకపోయారని విమర్శించారు. ప్రధాని సైతం విదేశీ పెట్టుబడిదారులను ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళండి, అక్కడ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ఎంతగానో పురోగతి సాధిస్తుంది, అని చెబుతున్నారంటే, చంద్రబాబు దక్షతను అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగు ప్రజల ఆదాయం పెరగాలి దేశ,విదేశాలలో కూడా మంచి గుర్తింపు రావాలని ఆకాంక్షించే వ్యక్తిఅని అన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడుతుంటే దాన్ని కాపాడటానికి ఉద్భవించిందే తెలుగుదేశం పార్టీ అన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో దళితులపై దాడులు యథేచ్చగా జరిగాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దళితులకు అన్ని విధాల న్యాయం జరుగుతోందని అన్నారు. చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ, ఎలాంటి పదువులు ఆశించకుండా దశాబ్దాలుగా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలకు రుణపడి ఉంటామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ దళితుల పక్షానే ఉందని ఆయన గుర్తుచేశారు. పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగే సత్తా ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని అన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమిశ్రేణులంతా కలిసి ఘనవిజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, బాపట్లపార్లమెంట్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా మహానాడులో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు అంచులోని వ్యక్తులను ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు
- కారు వేగం అదుపుతప్పడంతో ఘటన

పంగులూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కారు అతి వేగం ఇరువురి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. మరో వ్యక్తి కాలు, చేతికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటన 16వ నంబరు జాతీయ రహదారిపై ముప్పవరం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురు బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో పంగులూరు మండలంలోని కొండమూ రు గ్రామానికి చెందిన సంపంగుల వెంకట్రావు (47), నెల్లూరు జిల్లా నందిపాడుకు చెందిన రాచమల్లు దిలీప్ (27) మృతి చెందారు. వివరాలలోకి వెళితే... కొండమూరు గ్రామానికి చెందిన సంపంగుల వెంకటరావు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన తాటిముంజలు అమ్ముకొం టున్నాడు. ఒంగోలు వైపు వెళ్లే రోడ్డు అంచులో చెట్టు నీడన ఆయన దుకా ణం ఉంది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా నందిపాడు గ్రామానికి చెందిన రాచమల్లు వెంకటేశ్వర్లు, భార్య, కుమారుడు దిలీప్ విశాఖపట్నం నుంచి కారులో ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో తాటి ముంజలు తిని సేదదీరేందుకు వెంక్రటావు దుకాణం వద్ద ఆగారు. ఈ క్రమంలో అమరావతి నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న మరో కారు అతి వేగంగా తాటి ముంజలు తీస్తున్న వెంక్రటావును, కొనుగోలు చేస్తున్న దిలీప్, వెంకటేశ్వర్లును ఢీకొట్టింది. దీంతో వీరికి తీవ్రగాయాలయ్యాయి. వెంక్రటావు, దిలీప్‌లను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. దిలీప్ తండ్రి వెంకటేశ్వర్లు కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్.ఐ. వినోద్‌బాబు ఆయన్ను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిం చారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు సంపంగుల వెంకటరావు



మృతిచెందిన నెల్లూరుకు చెందిన దిలీప్

కొండమూరులో విషాదం

వెంకటరావు మృతితో కొండమూరు గ్రామంలో విషాదం నెలకొంది. వెంకటరావుకు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెలకు వివాహం చేశాడు. భార్య రూతమ్మ కుమార్తె డెలివరీ కావడంతో కొద్ది రోజులుగా ఒంగోలులో ఉంటోంది. ఏటా వేసవిలో ఇలా తాటి ముంజలు అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. సీపీఎం సభ్యుడిగా పలు ఉద్యమాలలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. వెంక్రటావు మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు.

విరామంలో వివాదం

- అనధికార వేటపై మత్స్యశాఖ అధికారులు దాడులు
- పట్టుబడిన మత్స్య సంపద వేలం
- ఇకపై అందరికీ వేట విరామమే
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

చీరాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సముద్రతీరంలో వేట విరామ సమయంలో వివాదం రోజు రోజుకు తారాస్థాయికి చేరుతోంది. అందుకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో అటు 'మద్రాసోళ్ల - ఇటు లైసెన్స్ లేనోళ్ల' అంటూ బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ వెంకటమురళీ ఫిషరీస్ జేడీ శ్రీనివాస్‌నాయక్‌ను విచారించాల్సిందిగా ఆదేశించారు. దీంతో జేడీతోపాటు ఏడీ కృష్ణకిశోర్‌లు తమ సిబ్బంది తో కలిసి బుధవారం వాడరేవు తీరంలో దాడులు నిర్వహించారు. నిషేధాజ్ఞలు ధిక్కరిస్తూ, వేటసాగించి ఒడ్డుకు చేరిన మత్స్యకారుల నుంచి మత్స్యసంపదను స్వాధీనం చేసుకున్నారు. వాటికి అక్కడే వేలం నిర్వహించారు. వారి వెంట ఎఫ్‌డీవో రవీంద్ర, విలేజ్ అసిస్టెంట్ డార్విన్ తదితరులు ఉన్నారు.

అధికారుల సమక్షంలోనే రెండు వర్గాల వాగ్వాదం

వాడరేవులో ప్రస్తుతం ఓ వర్గం వేట నిలిపివేయగా, మరోవర్గం వేట కొనసాగిస్తోంది. దీంతో వేట కొనసాగించే వర్గంతో అధికారులు చర్చించారు. అయితే లైసెన్స్ కలిగిన నాటుపడవ ఉన్న మత్స్యకారులు విరామ సమయంలో వేట సాగించేందుకు అనుమతి ఉంది. దీంతో వారు వేట సాగిస్తామని అధి కారులను కోరారు. అయితే వారిని అడ్డుగా ఉంచుకుని మిగిలిన వారు కూడా మోటారు బోటులతో అనధికారంగా వేట సాగిస్తున్నారని మరో వర్గం అధికారుల దృష్టికి తెచ్చింది. దీంతో మత్స్యకారుల్లోని ఇరువర్గాలు అధికారుల ఎదుటే వాగ్వాదానికి దిగాయి. అధికారులు ఇకపై ఎవరూ వేటకు వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారు.



దాడుల్లో పట్టుబడిన మత్స్యసంపదకు వేలం వేస్తున్న అధికారులు

అవీ..ఇవీ..

మొబైల్ వాహనాల రద్దుపై రేషన్ డీలర్ల హర్షం



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రేషన్‌డీలర్లు

పంగులూరు, మే 21(ఆంధ్రజ్యోతి):మొబైల్ రేషన్ వాహనాలను ప్రభుత్వం నిలిపి వేయడంపై మండల రేషన్ డీలర్లు హర్షంవ్యక్తం చేశారు. ప్రభుత్వం వినియోగదారులకు నేరుగా రేషన్ అందించే అవకాశాన్ని తమకు కల్పించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంచంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. బుధవారం పంగులూరులో జరిగిన కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు గుడిపాటి సుబ్బారెడ్డి, కుర్రా వెంకటరావు, పొద రామాంజనేయులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదభరితంగా ఇనుప చువ్వలు



రోడ్డుపై లేచిన ఇనుప చువ్వలు

అద్దంకి, మే21 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పోతురాజు గండి వద్ద నామ్ రహదారి అంచులో ఇనుప చువ్వలు పైకిలేచి ప్రమాదభరితంగా ఉన్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వివరా లలోకి వెళితే నామ్ రోడ్డు నుంచి పోతురాజుగండి రోడ్డులోకి వెళ్లే చోట రోడ్డు అంచులో ఇనుప చువ్వలు బయట పడి పైకి లేచి ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులతో పాటు కార్లలో పోతురాజుగండి వైపు వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పోతురాజుగండి నుంచి నామ్‌రోడ్డుకు వచ్చే సమయంలో ఇనుప చువ్వలు గమనించకుండా ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కారు టైర్లు పంక్చర్ కూడా అయినట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

గుత్తి నుంచి మహానాడుకు సైకిల్‌యాత్ర

- టీడీపీ కార్యకర్తకు అభినందనలు



బాజీని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కంభం, మే 21 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో ఈనెల 27 నుంచి జరిగే టీడీపీ మహానాడుకు సైకిల్ యాత్ర చేస్తూ వెళ్తున్న పార్టీ కార్యకర్త షేక్ బాజీని బుధవారం కంభం మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తి గ్రామానికి చెందిన బాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీరాభిమాని. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడం, మహానాడును కడప జిల్లాలో నిర్వహిస్తున్న సందర్భంగా గుత్తి నుంచి కడపకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు బాజీ తెలిపారు. కంభం మీదుగా వెళ్తున్న సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నాయకులు గోన చెన్నకేశవులు, కటికల భాస్కర్, టీడీపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందించారు.

ఘనంగా శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నాగులుప్పలపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ల గ్రా మ పంచాయతీ పరిధిలోని మద్దిరాల గ్రామంలో నిర్మించిన 27 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహం, 27 అం గుళాల శిలామయ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో స్వా మి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పొగాకు రైతుల గుర్తింపునకు కసరత్తు

- కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
- ప్రభుత్వ యాప్ ద్వారా రైతుసేవా కేంద్రాల్లోనూ వివరాలు సేకరణ



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల గుర్తింపుకోసం ప్రభుత్వ యంత్రాంగం ఎట్టకేలకు కదిలింది. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటచేతిలో ఉన్నా, అమ్ముకోలేక రైతాంగం ఇబ్బంది పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలుమార్లు పొగాకు కంపెనీల ప్రతినిధులతో చర్చించింది. రైతులకు ఇబ్బంది లేకుండా గిట్టుబాటు ధరకు కొని నిల్వ చేయాలని సూచించింది. పొగాకు రైతుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవటంతోపాటు, ఆయా కంపెనీల ప్రతినిధులతోపాటు, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌తో సైతం చర్చించారు. ఎక్కువ శాతం నిల్వలు కొనుగోలు చేశామని కంపెనీలు చెబుతుండగా, ఎలాంటి కొనుగోలు జరగలేదని నిల్వలు అలానే ఉన్నాయని రైతులు, రైతుసంఘం నాయకుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బర్లీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాల నేపథ్యం, ఎమ్మెల్యే ఏలూరి రైతుల సమస్యపై తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. యుద్ధ ప్రాతిపతికన రైతుల వద్ద నుండి నిల్వల పూర్తి వివరాలు సేకరించాలని వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. రైతుసేవా కేంద్రాల ద్వారా నిల్వల వివరాల సేకరణకు ఒక యాప్‌ను కూడా అందుబాటులోని తీసుకొచ్చింది. ఇప్పటికే వ్యవసాయాధికారులు పొగాకు రైతుల వద్ద నుండి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా వివరాలు సేకరించాలి : ఎమ్మెల్యే

రాజకీయాలకు అతీతంగా ప్రతి పొగాకు రైతు వివరాలను ప్రభుత్వం సూచించిన యాప్‌లో సేకరించాలని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. రైతుసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దీనికి సంబంధించి పార్టీ శ్రేణులు, నాయకులు ప్రత్యేక చొరవ చూపి సాగుచేసుకున్న ప్రతి రైతు వద్ద ఉన్న పొగాకు నిల్వలను నమోదు చేయించుకునే విధంగా చొరవ చూపాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏ రైతు వద్ద ఎంత నిల్వలు ఉన్నాయి, స్టాక్ వివరాలతో నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అన్నదాతలు అధైర్య పడాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఏలూరి అన్నారు.

కొత్తపట్నం తీరంలో పర్యాటక అభివృద్ధి

- నిర్వహణ బాధ్యతలు పొదుపు సంఘాలకు ఇచ్చేందుకు చర్యలు
- భూములను పరిశీలించిన సెర్ప్ అధికారులు

కొత్తపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం తీరంలో అభివృద్ధి పనులు చేపట్టి వాటి నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పేదరిక నిర్మూలన అధికారులు బుధవారం కొత్తపట్నం తీరంలో పర్యటించారు. సెర్ప్ అధికారులతో పాటు మత్స్యశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించారు. కాటేజీల నిర్మాణం, హోటల్స్, పర్యాటకులకు స్నానపు గదులు, పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువుల విక్రయాలకు షాపుల నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ స్టేట్ డైరెక్టర్ పద్మావతి, మత్స్యశాఖ అసిస్టెంట్ సంగాని శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పనులు చేపట్టి నిర్వహణ బాధ్యతలు పొదుపు సంఘాల మహిళలకు అప్పగించడంపై స్థానిక అధికారులతో చర్చించారు.

వివరాలు అందించలేకపోయారు..

కొత్తపట్నం తీరంలో టూరిజం అభివృద్ధికి అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన సెర్ప్ రాష్ట్ర అధికారులకు స్థానిక రెవెన్యూ అధికారులు స్థలం వివరాలను అందించలేకపోయారు. స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తమకు వివరాలు తెలియవంటూ అధికారులకు సెలవిచ్చారు. తొలుత కొత్తపట్నం పల్లెపాలెంకు దక్షిణం వైపు ఉన్న తీరంలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ భూములు ఎస్సీల టెనెంట్ సొసైటీకి సంబంధించినవి తెలియటంతో పల్లెపాలెంకు ఉత్తరంవైపు తీరంలో ఉన్న భూములను పరిశీలించారు. అయితే ఈ భూములు రంగాయపాలెం పంచాయతీ పరిధిలోనివి అని, తమకు కె.పల్లెపాలెం భూములు వివరాలు మాత్రమే తెలుసుని గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్ చెప్పటంతో రాష్ట్ర అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన చేయకుండానే వెనుదిగారు. గతంలో ఇబ్బందిపురం గ్రామం ఉన్న ప్రాంతంలోనే టూరిజం పనులు చేపట్టి వాటి నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేసి సెర్ప్‌కు పంపాలని డైరెక్టర్ పద్మావతి కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గొల్లపోతు పేరయ్య, సెర్ప్ అధికారి మహిత, ఎంపీఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు



క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్స్

ఒంగోలు విద్య, మే 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి అవార్డులు అందుకున్నారు. ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీలో ఈనెల 12నుంచి 21వ తేదీ వరకు జరిగిన వార్షిక శిక్షణ క్యాంపులో క్విస్‌ల కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ క్యాంప్‌లో నిర్వహించిన ఆర్మీడ్రిల్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన పూర్ణిమ బెస్ట్ క్యాడెట్‌గా నిలిచారు. టెంట్ పిన్సింగ్ పోటీలో ఉపదేశ్, విజయ్, అభిషేక్, హరిశంకర్, జయంత్, కరీంబాష, వెంకటేష్ మొదటి బహుమతిని సాధించారు. వీరు చీరాలలో జరగనున్న తదుపరి క్యాంపునకు కూడా ఎంపికయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్లును క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ డాక్టర్ శ్రీగాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రశాంత్, జి.శ్రీనివాసరావు, బుజ్జిబాబు, వాసుబాబు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల తిరస్కరణ.. ఆందోళనలో రైతులు

ఒంగోలు(రూరల్), మే21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో పొగాకు కొనుగోలుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికశాతం బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. బుధవారం జరిగిన వేలానికి 593 బేళ్లు రాగా 436 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 135 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర కిలో రూ.280, కనిష్ఠ ధర రూ.200 పలికింది. అయితే నోబిడ్‌క గురైన బేళ్లను తి రిగి ఇంటికి తీసుకుపోవటం ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

నాగులుప్పలపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): మోపెడ్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడిన సంఘటన ఉప్పుగుండూరు వద్ద జరిగింది. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం ఆంజనేయులు బుధవారం సాయంత్రం తన మోపెడ్‌పై గ్రామ సమీపంలోని తన పొలానికి వెళ్లేందుకు కోల్డ్‌స్టోరేజ్ జంక్షన్‌వద్ద జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో కారు ఢీకొంది. దీంతో అం జ నేయులు రోడ్డుపై పడి గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం 108వాహనం లో ఒంగోలులోని ఆసుపత్రికి తరలించారు.

సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

- కలెక్టర్ అన్సారియా హెచ్చరిక



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది క్రమశిక్షణ పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని కొప్పోలు సచివాలయాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా స్థానికులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రీ సర్వే డేటాను కంప్యూటర్‌లో కలెక్టర్ పరిశీలించారు. ఆధార్‌కార్డు లేని చిన్నారులు సచివాలయ పరిధిలో ఎంత మంది ఉన్నారు, వారికి ఆధార్‌కార్డులు అందేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారని మహిళా సంరక్షణ కార్యదర్శిని కలెక్టర్ ప్రశ్నించారు. అందుకు సంబంధించిన రికార్డులను కూడా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు వేస్తున్న బయోమెట్రిక్ హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఉద్యోగులు ఉదయం 11 గంటలకు వచ్చినట్లు కలెక్టర్ గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయపరిధిలో శానిటేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఆదేశించారు.

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీ
- కడపలో జరిగే మహానాడుకు భారీగా తరలిరావాలి : ఎమ్మెల్యే దామచర్ల పిలుపు
- మినీ మహానాడుకు తరలివచ్చిన శ్రేణులు





ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ, నేతలు, సభకు భారీగా తరలివచ్చిన నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. ఒంగోలు నియోజకవర్గ మినీ మహానాడు బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జ నా ర్దన్ అధ్యక్షతన స్థానిక ఎంఎస్‌ఫంక్షన్ హాలులో ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలన్న దిశగా సీఎం చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని చెప్పారు. అమరావతి రాజధాని కోసం రూ.49వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు. స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ కూడా సీఎం చంద్రబాబు పాలనను మెచ్చుకోవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత వైసీపీ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు : దామచర్ల

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు అన్నారు. కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజ సంక్షేమమే దిశగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. ఆర్థిక లోటుపాట్లు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు వెనుకడుగు వేయలేదన్నారు. గడిచిన ఐదేళ్ళ నియోజకవర్గానికి చెందిన నేత మంత్రిగా ఉండి కూడా నగరానికి చేసింది ఏమీ లేదని, అతని నిర్లక్ష్యం వల్ల ఒంగోలు నగరం అస్తవ్యస్తంగా మారిందని దామచర్ల ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన అక్రమాలకు చట్టప్రకారం గుణపాఠం తప్పదన్నారు. టీడీపీకి చెందిన వారిని మహిళలు అని కూడా చూడకుండా దాడిచేసిన వారిని వదిలేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నూతనంగా రూ.25కోట్లతో రోడ్లు, డ్రైయిన్‌లు, పార్కులు, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నగర ప్రజలకు ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని దామచర్ల పేర్కొన్నారు. అంతకముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పహల్గాం లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వినకొండ సుబ్రహ్మణ్యం, పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రవేశపెట్టిన తీర్మానాలు

- పొగాకు, శనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.
- కొత్తపట్నం మండలంలో హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.
- కొత్తపట్నం మండలంలో ప్రతిపాదించిన ఎయిర్ పోర్టు పనులు పూర్తి చేయాలి
- రామతీర్థం నుంచి ఒంగోలు నగరానికి అండర్ గ్రౌండ్ పైపులైను ద్వారా తాగునీటికి ఎస్ఎస్1 2 అందించే ప్రాజెక్టుకు అనుమతించాలి.
- మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా 2200 కి.మీ పూర్తయిన సందర్భంగా త్రోవగుంట దగ్గర మైల్ రాయి వేయగా, ఆ సందర్భంగా ఇచ్చిన హామీ, ఒంగోలు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనులకు అనుమతులు మంజూరు చేయాలి.
- తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ళను 80 శాతం పూర్తి చేయగా మిగిలిన పనులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. తిరిగి ఆ పనులను ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు త్వ రితగతిన అందించాలి.
- ఇల్లు లేని పేదలకు 2 సెంట్లు భూమితో పాటు గృహ నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందించాలి.
- పోతురాజు కాలువ ఆధునికీకరణ త్వరితగతిన అనుమతులను మంజూరు చేసి, పనులను పూర్తి చేయాలి.
- డీకే పట్టా భూమిలో ఇల్లు కట్టుకొని పొజిషన్‌లో ఉన్న అర్హులైన వారి పేరు మీదకు మార్చి ఇవ్వాలి.
- కొత్తపట్నం మండలంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే తీర్మాలని ప్రవేశపెట్టగా వాటిని పోలవరపు వెంకట్రామయ్య, గొల్లపోతు పేరయ్య, ఎద్దు శశికాంత్‌భూషణ్, మేయర్ గంగాడ సుజాత, కామేపల్లి శ్రీనివాసరావు, తిప్పరమల్లి రవితేజ, వైవీ.సుబ్బారావు, షేక్ కపిల్‌బాషా, కొఠారి నాగేశ్వరరావు, శింగరాజు రాంబాబు మద్దతు తెలిపారు.

ప్రారంభమైన సాగర్ పైప్‌లైన్ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మార్కాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : సుమారుగా ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న సాగర్ పైప్‌లైన్ పనులు ఎట్టకేలను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రారంభించారు. పట్టణానికి ప్రధాన తాగునీటి వనరైన సాగర్ నీటిని 28 కిలోమీటర్ల మేర దూపాడు నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా మార్కాపురం చేరాలి. త్రిపురాంతకం దూపాడు నుంచి పెద్దారవీడు మండలం బోడిరెడ్డిపల్లి జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేర అప్పట్లో ప్రయోగాత్మకంగా జీవ పైప్‌లైన్ వేశారు. గత దశాబ్ద కాలంగా ఈ ప్రాంతంలోనే తరచూ పైప్‌లైన్ పగులుతోంది. దీంతో 2022లో రూ.4.5 కోట్లతో నూతనంగా డీఐ పైప్‌లైన్ వేసేందుకు టెండర్లు పిలిచారు. పనులు 2022లో ప్రారంభమైనా వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. కాంట్రాక్టర్ 2 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసి బిల్లులు కూడా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచింది. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నెల 10వ తేదీన 'నీళ్లన్నా నిర్లక్ష్యమే!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. పట్టణంలోని లక్షమంది జనాభాకు ఎంతో అవసరమైన ఈ పని నిలిచిపోవడం ఏంటని మున్సిపల్ ఉన్నతాధికారులు పనులు పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులపై మండిపడ్డారు. అంతేకాక ఈ నెల 13వ తేదీన మున్సిపల్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ ఓబులేసు పైపల్‌లైన్ పనులను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈ టి.మోహన్‌తో కలిసి పరిశీలించారు. వారి ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ సంస్థ ఏవీఆర్ ఇన్‌ఫ్రా పనులను ప్రారంభించింది. జూన్ మొదటి వారానికల్లా పనులు పూర్తి చేయనున్నట్లు పబ్లిక్ హెల్త్ ఒంగోలు ఈఈ శ్రీనివాససంజయ్ తెలిపారు.

సొరకాయ్.. రూపాయ్!

- కోత కూలి కూడా రాని దైన్యం
- 30 రోజుల్లో దారుణంగా తగ్గిన ధర



బల్లికురవ. మే 21 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం అయినప్పటికీ, సొరకాయల ధరలు అమాంతం తగ్గిపోయాయి. బోరుబావుల కింద సాగు సొరకాయలకు గిట్టుబాటు ధర ఉండడం లేదు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం, రామాంజనేయపరం, కొమ్మినేనివారిపాలెం, వల్లాప్లి, గుడిపాడు, చెన్నుపల్లి, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొణిదెన, నక్కబొక్కలపాడు తదితర గ్రామాలలో రైతులు బోరు బావుల కింద సొరకాయలు సాగుచేశారు. ఎకరాకు రూ. 15వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మొదట్లో సొరకాయ ఒకటి రూ.7 చొప్పున కొనుగోలు చేయగా నాలుగు రోజుల నుంచి మార్కెట్ ధరలు అమాంతం తగ్గాయి. ప్రస్తుతం ఒక్కో సొరకాయ కేవలం ఒక్క రుపాయికి మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు కోత కూలీ బాడుగ కూడా చేతికి రావడం లేదు. దీంతో కోత కోయకుండానే పంట పోలాల్లోనే కాయలను వదిలేస్తున్నారు. కొంత మంది రైతులు ముదిరిన కాయలను కోయించి రోడ్డుపక్కన పడేస్తున్నారు. వేసవి కాలం కావడం విద్యార్థుల వసతి గృహాలు మూత పడడంతో సొరకాయల ధరలు బాగా తగ్గాయని రైతులు అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా సొర కాయలు పెద్ద ఎత్తున మార్కెట్‌లోనికి వస్తున్నాయని దీంతో కొనుగోళ్లు మందగించాయని రైతులు తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారులు రైతుకు గిట్టుబాటయ్యేలా కాయలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కొందరు రైతులు హైదరాబాద్ మార్కెట్‌కు వాహనాలను పెట్టుకొని సొరకాయలను తరలిస్తున్నారు. అక్కడ కూడా బాడుగ పోను చేతికి ఏమీ రావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అవీ..ఇవీ..

వానరాల దాడిలో ఇరువురికి గాయాలు



ఇళ్లపై పొంచి ఉన్న కోతులు

పర్చూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : వానరాల దాడిలో ఇద్దరువ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన నియోజకవర్గ కేంద్రం పర్చూరులో చోటు చేసుకొంది. బుధవారం పర్చూరులో బ్యాంకు వీధిలో ఇద్దరిపై కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. శరీరంపై ఉన్న దుస్తులను సైతం చించివేసి మరీ దాడిచేశాయని బాధితులు వాపోతున్నారు. వీటి దాడిలో ఓ మహిళకు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. తీవ్రగాయాలతో కొట్టుకుంటున్నా అవి బాధితులను వదలక పోవడంతో స్థానికులు గమనించి వారిని కాపాడారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన క్షతగాత్రులు చికిత్సకోసం అసుపత్రికి తరలించారు. పర్చూరులో కోతుల దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దారిన వెళుతున్న వారిపై కోతులు విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరుస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిత్యం కోతుల బెడదతో ప్రజలు నివాసాల నుండి బయటకు రావాలంతే ఎంటునుండి కోతులు తమపై దాడిచేస్తాయో అర్థంకాక హడలిపోతున్నారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు



ప్రయోజనాలను వివరిస్తున్న తహసీల్దార్

పంగులూరు, మే 21 (ఆంధ్ర జ్యోతి): కౌలు రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు సీసీఆర్ కార్డులు కలిగి ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెర పాడు, నూజెళ్లపల్లె గ్రామాలలో బుధవారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలబీమా, పంటరుణంతో పాటు యంత్ర పరికరాలు, రాయితీపై విత్తనాలు, అన్నదాత సుఖీభవ ప్రయోజనం వంటివి కార్డు ఉన్నవారికే అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, ఎనికపాటి శ్రీనివాసరావు, వీఆర్వో సుధాకర్, పరుశురామిరెడ్డి, వీవోఏలు సునీత, ప్రియ, పలువురు రైతులు పాల్గొన్నారు

రేపు అద్దంకిలో జాబ్‌మేళ

అద్దంకి, మే21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శింగరకొండ సమీపంలోని కళాశాలలో జాబ్ మేళ నిర్వహించనున్నారు. ఆ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ లాజారేష్‌బాబులు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు ఎల్‌అండ్‌టీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెటిరోల్యాబ్స్, అమరరాజా బ్యాటరీస్, కల్లాం టెక్స్‌టైల్స్, కృష్ణపట్నం పోర్టు, యాక్సిస్ బ్యాంక్, స్కిల్‌క్రాఫ్ట్ అపోలో టైర్స్ డైకిన్, ముత్తూట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆయా కంపెనీలలో వెయ్యికి పైగా ఉద్యోగాలు ఉంటాయని విద్యార్హత ప్రాతిపదికన రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో తదితర కోర్సులు చదివిన 18నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సుఉన్న యువతీ యువకులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు గోపినాథ్ 9440635677, రమేష్ 9949914337 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి

అద్దంకి,మే21(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన బుధవారం అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు పొదిలి మండలం జువ్వలేరుకు చెందిన చాపరాజుపల్లి వెంకట్రావు(25) అద్దంకి మండలం ఉప్పలపాడులో బంధువుల ఇంటి వద్ద ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో భవానిసెంటర్ సమీపంలో ఆటోకు మరమ్మతులు చేయిస్తూ నిలబడి ఉన్నాడు. అ సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు తో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని సీఐ సుబ్బరాజు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

వేటపాలెం(చీరాల), మే 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో కాశావిశ్వనాథ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ కార్యాలయంలో పంటధ్రువీకరణ పత్రం, అన్నదాతసుఖీభవ, పీఎం కిసాన్, భూమి మట్టి నమూనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మార్టూరులో విద్యుత్ అదాలత్

మార్టూరు,మే21(ఆంధ్రజ్యోతి): మార్టూరు సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల కోసం గురువారం ఉదయం మార్టూరులోని ఇంటూరి ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ వినియోగదారుల అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు అద్దంకి విద్యుత్ ఈఈ ఎస్.మస్తాన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు ఎదొర్కొంటున్న సమస్యలు లోవోల్టేజ్ సమస్య, బిల్లులో తేడాలు, ఇతర దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి వేదికగా అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఈఈ తెలిపారు. కార్యక్రమానికి జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.ఆంజనేయులు పలువురు అధికారులు హాజరు అవుతారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇసుకాసురుల చెర నుంచి
పాఠశాల భూములకు విముక్తి

- పూర్వ విద్యార్థుల చొరవతో హద్దులు గుర్తించిన అధికారులు
- కంచె ఏర్పాటుకు శ్రీకారం



పాఠశాల స్థలానికి సర్వే చేస్తున్న అధికారులు

పందిళ్లపల్లి(చీరాల), మే 21 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రహణం వీడింది. ఇసుకాసురులు, ఆక్రమణ దారుల చెర నుండి రొండా పట్టాభి రామిరెడ్డి జిల్లా జెడ్పీహెచ్ఎస్ ఓల్డ్ స్టూడెంట్స్ సొసైటీ కృషితో స్థలానికి రక్షణ ఏర్పడుతోంది. అందుకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే కూడా చేశారు. ఈ నేపథ్యంలో దాతల సహాయంతో పాఠశాల స్థలానికి కంచె ఏర్పాటుకు ప్రణాళిక రచిస్తున్నారు.

పాఠశాలకు రెండు చోట్ల భూములు

1970లో దాతలు పందిళ్లపల్లి - తిమ్మసముద్రం మార్గంలోని రాజుబంగారుపాలెం కాలువ సమీపంలో సర్వే నెం 204/3లో 3.69 ఎకరాల భూమి, అలాగే సర్వే నెంబర్ 13/7లో 3.82 ఎకరాలు భూమిని పాఠశాల అభివృద్ధి కోసం ఇచ్చారు. ఈ భూములను గతంలో కౌలుకు ఇచ్చి వచ్చిన నగదును పాఠశాల అభివృద్ధికి ఉపయోగించే వారు. అయితే కొన్ని సంవత్సరాలుగా భూములపై పర్యవేక్షణ లోపించింది. ఈ నేపధ్యంలో దీనిని అవకాశంగా మలుచుకన్న ఇసుకాసురులు ఈ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. నిత్యం అక్రమ రవాణా చేయడంతో దాదాపు రూ.కోటి విలువైన ఇసుక తరలిందని అంచనా. దీంతో పాటు మరోవైపు ఆక్రమణదారులు కొంత భూమిని వారి ఆదీనంలోకి తీసుకున్నారు.

ఫలించిన సొసైటీ కృషి

ఈ క్రమంలో రొండా పట్టాభి రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సొసైటీ ప్రతినిధులు భూముల రక్షణకు చొరవ చూపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆ స్థలాన్ని సర్వేచేయాలని ఆదేశించారు. దీంతో ఆ భూములకు హద్దులు కూడా ఏర్పాటు చేశారు. అలాగే మరి కొందరు దాతలు ముందుకు రావడంతో కంచె ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నారు. అయితే పాఠశాల స్థలంలో కూడా ఇసుక తవ్వకొని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

భారీ వర్షాలకు చల్లబడిన వాతావరణం

- దెబ్బతిన్న అర్‌అండ్‌బీ రోడ్లలో నిలిచిన వర్షపు నీరు
- అవస్థలు పడుతున్న వాహనదారులు



బల్లికురవ మార్టూరు అర్‌అండ్‌బీ రోడ్డులోని గోతులు



బురదగా మారిన మల్లాపల్లి-చెన్నుపల్లి రహదారి

బల్లికురవ. మే 21 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుండి రోజులో ఏదో ఒక సమయంలో కురుస్తున్న వర్షంతో వాతావరణం చల్లబడింది. గత వారం ఉక్కపోత ఎండలతో విలవిలలాడిన ప్రజలకు రెండు రోజుల నుంచి సూర్యుడు కనిపించకుండా మబ్బులతో చల్లగా ఉండడంతో ప్రజలు వేసవి వేడి నుంచి ఉపశమనం పొందారు. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు చిరుజల్లులు పడుతుండడంతో రైతులు ఇక వేసి ఎండల ప్రభావం ఉండదని భావిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు కూడా ముందే వస్తున్నాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు కూడా పంట భూములను దున్నేందుకు సిద్ధం అవుతున్నారు. భారీ వర్షాల ప్రభావంతో బల్లికురవ, మార్టురు రోడ్డులో ఉన్న గోతులలో పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలానే మల్లాయపాలెం చెన్నుపల్లి గ్రామాల మధ్య ఉన్న అర్‌అండ్‌బీ రోడ్డులో కూడా గ్రానైట్ క్వారీల వద్ద బురదమయమైంది. ఈ రోడ్డులో ద్విచక్ర వాహన రాకపోకలు నిలిచి పోయాయి. 90 శాతం పైబడి పంటలు రైతుల ఇళ్లకు చేరడంతో ఇప్పుడు వర్షాలు పడిన పెద్దగా నష్టం ఏమి లేదని రైతులు పేర్కొంటున్నారు.

విద్యాకుసుమాలకు షైనింగ్ స్టార్ అవార్డులు



మంత్రి లోకేష్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న దివ్యశ్రీ, సంతోష్, వెంకటసాయి శ్రీహర్షిణి

అభినందించి బహుమతులు అందజేస్తున్న మంత్రి లోకేష్

చీరాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా వేటపాలెం మండలం పందిళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ, చీరాల మండలం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన నాగసాయి సంతోష్ షైనింగ్ స్టార్ అవార్డులను అందుకున్నారు. మంగళవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 47 మంది విద్యార్థులను లోకేష్ సత్కరించారు.. వారిలో దివ్యశ్రీ 596 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడవ స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన నాగసాయి సంతోష్ 591 మార్కులు సాధించాడు. ఈక్రమంలో వారిని సత్కరించి షైనింగ్ స్టార్ అవార్డులను ప్రదానం చేశారు. స్ఫూర్తి ప్రదాతలు రచించిన తొమ్మిది రకాల పుస్తకాలను విద్యార్థులకు మంత్రి అందించారు. జూన్ 9న నగదు ప్రోత్సాహంతో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

అద్దంకి : అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మేడిశెట్టి వెంకటసాయిశ్రీహర్షిణి 10వ తరగతి పరీక్షలలో 593 మార్కులు సాధించి అద్దంకి మండలస్థాయిలో ప్రథమ స్థానం, బాపట్ల జిల్లాస్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. తండ్రి హనుమంతరావు బల్లికురవ మండలం కూకట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి ప్రత్యూష గృహిణి. మంగళవారం రాష్ట్రస్థాయిలో జరిగిన కార్యక్రమంలో వెంకటసాయిశ్రీహర్షిణి షైనింగ్ స్టార్ అవార్డును విద్యాశాఖ మంత్రి లోకేష్ నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా సన్మానించి, ప్రముఖులు రచించిన పుస్తకాలు, మెడల్ అందజేశారు. విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు హనుమంతరావు, ప్రత్యూష పాల్గొన్నారు.

నేడు మినీ మహానాడు

- హాజరుకానున్న మంత్రి రవికుమార్
- 150 మందికి తోపుడు బండ్ల పంపిణీకి ఏర్పాట్లు



పంపిణీ కి సిద్ధంగా ఉన్న తోపుడు బండ్లు

అద్దంకి, మే21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అద్దంకి నియోజకవర్గ మినీమహానాడు గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కదిలి రావలని పిలుపునిచ్చారు. మినీమహానాడు పూర్తయిన తరువాత నియోజకవర్గంలోని 100 మందికి మంజూరైన రూ.60.55 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి రవికుమార్ పంపిణీ చేయనున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో 150 మందికి తోపుడు బండ్లు అందజేయనున్నారు.

సెయింట్ ఆన్స్‌లో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

చీరాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. అందుకు సంబంధించి రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు నిర్వహించగా, ఉదయం 17 మంది గైర్హాజరయినట్లు వివరించారు. పరీక్షలను ప్రిన్సిపల్ డా.జగదీష్ పర్యవేక్షించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఐటీసీలో కెవైసీ సమస్యతో నిలిపిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, బదిలీ కార్మికులను క్లాస్ బీగా పరిగణించాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మీ కోరారు. బుధవారం ఐటీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గుంటూరు కార్మికశాఖ జేసీఎల్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఐఎల్‌టీడీ కంపెనీ కార్మికుల సమస్యలకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావిస్తూ, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోసాల సుధాకర్, ముత్యాలరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఉష్ట్రవాహనసేవ

- నేడు హనుమజ్జయంతికి ప్రత్యేక పూజలు



ఉష్ట్రవాహనంపై స్వామివారి ఊరేగింపు

అద్దంకి, మే21(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. మంగళవారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. బుధవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు మల్లెపూలతో అర్చన నిర్వహించినట్లు తెలిపారు. రాత్రి స్వామి వారికి ఉష్ట్రవాహన సేవ నిర్వహించారు. ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఉదయం లక్ష తమలపాకుల పూజ, మామిడిపండ్లతో పూజలు, రాత్రి రథోత్సవం జరుగుతాయన్నారు. పలువురు దీక్షా భక్తులు స్వామి వారికి ఇరుముడి సమర్పించనున్నారు.

6న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- ఎమ్మెల్యే ఏలూరిని ఆహ్వానించిన గ్రామస్థులు



ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆహ్వానిస్తున్న గ్రామస్థులు

మార్టూరు, మే21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామ పొలిమేర వద్ద వచ్చే నెల 6న శుక్రవారం అభయాంజనేయస్వామి విగ్రహ వాయు ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి బుధవారం ఇసుకదర్శిలో ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆహ్వానించారు. గ్రామ పొలిమేర వద్ద 21 అడుగుల ఎత్తైన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా జూన్ 4న గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున శుక్రవారం మధ్యాహ్నం భారీగా అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గంజి శ్రీనివాసరావు, జంజనం సుబ్బారావు, గుంటి వెంకటేశ్వర్లు, కొమ్మి మహేష్, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడక నిషేధం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే

పర్చూరు : విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే, పర్యావరణానికి ముప్పువాటిల్లడమే కాకుండా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు మండలం నాగులపాలెంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో కుటీర పరిశ్రమలో భాగంగా తలపెట్టిన తులసి ఎకో ప్రొడక్ట్స్‌ను ఎమ్మెల్యే ఏలూరి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చిన్నతరహా పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధిని సాధించాలన్నారు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన పేపర్‌ప్లేట్లు, గ్లాసులతో ప్రమాదకరమైన కేన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటి వాడకాన్ని తగ్గించి వాటి స్థానంలో ప్రకృతి సిద్ధమైన వస్తువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఏలూరి అభిమానులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రామలింగేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల

- విద్యుత్ ప్రభతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ
- పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం




కల్యాణమూర్తులుగా గంగా భవాని సమేత రామలింగేశ్వర స్వామి వారు

బల్లికురవ. మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న కొణిదెన గ్రామంలో బుధవారం గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి 16 వార్షిక తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా గ్రామస్థులు సమిష్టి కృషితో రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని విద్యుత్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరించి పెద్ద ఎత్తున అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ పూజారి మోహన్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాంతి కళ్యాణాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కొణిదెన, గంగపాలెం గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధి కమిటీ తరపున విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నాగరాజు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.





తిరునాళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ, విద్యుత్ లైట్లతో అలంకరించిన ఆలయం



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	35.8	27.3
కావలి	33	27
ఆత్మకూరు	34	24
ఉదయగిరి	33	26
కందుకూరు	32	27

అక్షరం అండగా..

భవిష్యత్తులో మరిన్ని..

"'ఆంధ్రజ్యోతి' సమస్యలను ఎత్తిచూపడమే కాదు.. ఆ సమస్యలను పరిష్కారించాలన్న పట్టుదలతో కృషి చేస్తున్నాం. ఆ క్రమంలో పుట్టిందే 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరించాం. సౌత్‌మోపూరు లో జరిగిన అభివృద్ధి పనులు చూస్తుంటే ఆనందంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతాం.' అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం విజయోత్సవ సభ బుధవారం నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో జరిగింది. ముందుగా సౌత్‌మోపూరుకు చేరుకున్న వేమూరి ఆదిత్యకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఆ పనుల వివరాలను ఆదిత్యకు కోటంరెడ్డి సోదరులు వివరించారు. అలానే గ్రామంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి వివరాలను కూడా తెలియజేశారు. అనంతరం వీరంతా కలిసి నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొని సౌత్‌మోపూరు గ్రామస్థుల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ద్వారా గ్రామ సమస్యలను పరిష్కరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండా' కార్యక్రమం విజయోత్సవ సభకు సౌత్‌మోపూరు గ్రామస్థులను ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు.

● సౌత్‌మోపూరు ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వేమూరి ఆదిత్య, కోటంరెడ్డి సోదరులు నగదు బహుమతులను అందజేశారు. ఈ విజయోత్సవ సభలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వర రావు, బ్రాంచి మేనేజరు కే హరికృష్ణ, సీపీఐ సీనియర్ నాయకుడు పముజుల దశరథరామయ్య, టీడీపీ నాయకులు రాపూరు చంద్రశేఖర్, పముజుల ప్రదీప్, ఉపసర్పంచ్ చల్లా నరసయ్య, ఎంపీటీసీ రాపూరు చంచమ్మ, సీపీఎం నాయకుడు బాలు ఆదిశేషయ్య, బీజేపీ నాయకుడు పముజుల సురేష్, సౌత్‌మోపూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఈడీ వేమూరి ఆదిత్య, పక్కన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు తదితరులు

అభివృద్ధి పనులకు మరో రూ.కోటి

'జనవరిలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో రూ.కోటితో సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం 40 రోజుల్లోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తున్నాం. హైస్కూల్ ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ శుభ తరుణంలో మరో హామీ ఇస్తున్నాం. రాబోవు సంవత్సరంలో మరో రూ.కోటితో సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులు చేపడతాం. వచ్చే ఏడాది ఇదే రోజులోపు ఆ పనులను పూర్తి చేస్తాం.' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎవరూ బయటకొచ్చే పరిస్థితులు లేని రోజుల్లో 'ఆంధ్రజ్యోతి' తెగించి పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు.



- సమస్యల పరిష్కారానికి పట్టుదలతో కృషి
- 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం లక్ష్యం ఇదే
- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య
- సౌత్‌మోపూరు గ్రామంలో విజయోత్సవ సభ
- మరో రూ.కోటితో పనులు చేపడతామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హామీ

గ్రామస్థుల ఆనందోత్సాహం

మొన్నటిదాకా అంతర్గత రహదారుల్లేవు. వర్షం కురిస్తే చాలు ఆ గ్రామస్థుల్లో వణుకు. ఏ వైపు నుంచి నీరు వచ్చి మీద పడుతుందోనని. ఇక కాలువల్లేక డ్రైనేజీ నీరంతా ఇళ్ల ముందు చేరిపోయేది. ఆ దుర్వాసన భరిస్తూనే కాలం వెళ్లదీశారు. ఇలా అనేక సమస్యల నడుమ తల్లడిల్లిన సౌత్‌మోపూరు వాసుల్లో 'ఆంధ్రజ్యోతి' ఆనందం నింపింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో నిర్వహించిన చేపట్టిన కార్యక్రమం మంచి ఫలితాన్ని ఇచ్చింది. దాదాపు రూ.1.22 కోట్లతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొన్ని పూర్తవగా, ఇంకొన్ని పురోగతి స్థాయిలో ఉన్నాయి. ముఖ్యంగా రోడ్ల పనులు పూర్తయ్యాయి. బుధవారం జరిగిన విజయోత్సవ సభలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి'పై ప్రశంసలజల్లు కురిపించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి
అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



విజయోత్సవ సభలో పాల్గొన్న సౌత్‌మోపూరు వాసులు



హైస్కూలులో ప్రహరీ గోడ పనులు గురించి ఆదిత్యకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి



సింహ వాహనంపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కామాక్షితాయి సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. ఉదయం తిరుచా ఉత్సవంలో గంగా, కామాక్షితాయి సమేతంగా మల్లికార్జునస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తలకు నిత్యాన్నదాన సదనంలో ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులు రెడ్డి, సభ్యులు, సర్పంచు పెంచలయ్య పాల్గొన్నారు.

రేపు నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమం ఈ నెల 23వ తేదీన జరగనుంది. నగర శివార్లలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆ పార్టీ ముఖ్య నేతలు బుధవారం పరిశీలించారు. కార్యక్రమం అజెండా ఎలా ఉండాలి? వచ్చే నాయకులు, కార్యకర్తలకు వసతుల కల్పన వంటి అంశాలపై చర్చించారు. అలానే జిల్లాస్థాయిలో చేయాల్సిన తీర్మానాలపై కూడా మాట్లాడుకున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. టీడీపీ ఆనవాయితీ ప్రకారం రాష్ట్ర మహానాడుకు ముందు నియోజకవర్గ, పార్లమెంటు స్థాయి మినీ మహానాడు కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. నియోజకవర్గ స్థాయి తీర్మానాలను పార్లమెంటు స్థాయిలోనూ, పార్లమెంటు స్థాయి తీర్మానాలను రాష్ట్రస్థాయి మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడప వేదికగా మహానాడు జరగనుంది. ఆ క్రమంలో ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి మినీ మహానాడు కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఇక మిగిలిన నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమం శుక్రవారం జరగనుంది.

● ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆనం, ఎంపీ, ఎమ్మెల్యేలు




నెల్లూరు పార్లమెంటు స్థాయి మహానాడు కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న టీడీపీ ముఖ్యనేతలు

డబుల్ హార్టీ

ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించే శుభవార్తను వినిపించింది. ఇప్పటికే వివిధ పంటలకు అందిస్తున్న రాయితీలను రెట్టింపు చేసింది. గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టి రాయితీల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఉద్యాన రైతులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న చేయూత వారిలో ఆర్థిక భరోసాను నింపుతోంది.



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి (ఫైల్)



- ఉద్యాన రైతులకు రాయితీ రెట్టింపు
- డ్రాగన్ ఫ్రూట్ సాగుకు భారీగా పెరుగుదల
- ఒకేసారి రూ.50వేల నుంచి రూ.1,82లక్షలకు పెంపు
- పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వ పథకాలు

నెల్లూరు (వ్యవసాయం), మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 75వేల ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు (హార్టీ కల్చర్) సాగవుతున్నాయి. ముఖ్యంగా మామిడి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బొప్పాయి, అరటి, నేరేడు, జామ, ఉసిరి వంటి పంటలను రైతులు పండిస్తున్నారు. ప్రతి ఏటా దాదాపుగా 4,51,516 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే 40 నుంచి 90శాతం వరకు రాయితీలను అందిస్తోంది. అయితే తాజాగా ఆయా రాయితీలను రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. 2025-26 సంవత్సరానికిగాను లక్ష్యాలను కూడా నిర్దేశించింది. దాదాపుగా 5375 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగు చేసేలా జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అంతేకాకుండా జిల్లాలో దాదాపు గా 82వేల ఎక రాలు ఎలాంటి పంటలు సాగు చేయకుండా భూమి ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఆయా పొలాల రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి సాగుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. నీటి వసతి ఉన్న ప్రతి పొలంలో పంటలు సాగయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నర్సరీల నుంచి నాణ్యమైన మొక్కలు సేకరించడంతో పాటు సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించనున్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన రైతులకు అందుతున్న పంటల రాయితీలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. 2025-26 సంవత్సరానికి 5375 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంచేలా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఎలాంటి పంటలు సాగు చేయని 82 వేల ఎకరాలు ఉన్నాయి. సాగునీరు అందుబాటులో ఉన్న భూముల్లో ఉద్యాన పంటలు సాగుచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే పూర్తి సమాచారం అందిస్తారు.

- సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

● ఎంఐడీహెచ్ పథకంతో రాయితీ

సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా ఉద్యాన రైతులకు, కొత్త ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60శాతం వాటాగా రాయితీలు అమలు చేయనున్నాయి. ముఖ్యంగా కొత్త తోటల విస్తరణ పథకం, పాత తోటల పునరుద్ధరణ పథకం, నీటి కుంటలు, పాలీహౌస్, షేడ్ నెట్, మల్చింగ్ రక్షణాత్మక సాగుతోపాటు కోత అనంతరం యాజమాన్య పథకం, ఉద్యాన యాంత్రీకరణ పథకాల్లో భాగంగా చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు వంటివి ఇవ్వనుంది.

యాంత్రీకరణ పథకం

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో భాగంగా ఉద్యాన రైతులకు భారీ రాయితీలు అందిస్తోంది. మినీ ట్రాక్టర్‌కు గతంలో రూ.75వేలు రాయితీ ఉండగా ప్రస్తుతం రూ.1.96లక్షలకు పెరిగింది. అదేవిధంగా పవర్ టిల్లర్‌కు రూ.40వేల నుంచి రూ.60వేలు ఇస్తుండగా తాజాగా రూ.80వేల నుంచి రూ.లక్షలకు పెంచింది. ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లకు గతంలో ఎలాంటి రాయితీ లేదు. నూతన మార్గదర్శకాల ప్రకారం రూ.33వేల నుంచి రూ.1.10లక్షల వరకు రాయితీ ఇచ్చింది.

- నూతన తోటల విస్తరణ పథకంలో భాగంగా హెక్టారు మామిడి తోటకు మూడేళ్లకు గాను గతంలో రూ.13,300 నుంచి రూ.16,400 వరకు రాయితీ అందేది. నూతన మార్గదర్శకాల ప్రకారం ఆ మొత్తం రూ.35,320 నుంచి రూ.54,560 వరకు పెరిగింది.
- నిమ్మ పంటకు మూడేళ్లకుగాను రూ.16,004 నుంచి రూ.36,402కు పెరిగింది.
- డ్రాగన్ ఫ్రూట్‌కు భారీగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. గతంలో హెక్టారుకు రూ.50వేలు రాయితీ ఇస్తుండగా తాజాగా దాన్ని రూ.1,82లక్షలకు పెంచేసింది. దీంతో ఈ పంటను సాగు చేస్తున్న రైతులకు ఎంతో లాభం చేకూరనుంది.
- సంకర జాతి కూరగాయలకు రూ.20వేల నుంచి రూ.24వేలు...
- విడిపూల సాగుకు రూ.16వేల నుంచి రూ.20 వేలకు పెంచింది.

● రాయితీ ఇలా..

- నేరేడు, బొప్పాయి, అరటి పంటలకు మాత్రం రాయితీ పెంచలేదు.
- పాత తోటల పునరుద్ధరణ పథకం కింద హెక్టారుకు రాయితీని రూ.17500 నుంచి రూ.24వేలకు పెంచింది.
- రక్షణాత్మక సాగు కింద పాలీ హౌస్‌కు రూ.42.20 లక్షల నుంచి రూ.52.50లక్షల వరకు పెంపు చేసింది.
- మల్చింగ్‌కు రూ.16వేల నుంచి రూ.20వేల వరకు పెరిగింది.
- కోత అనంతరం యాజమాన్య పథకం కింద ఫార్మ్ గేట్ ప్యాక్ హౌస్‌కు గతంలో రాయితీ ఇవ్వలేదు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రూ.12.50లక్షలు రాయితీ ప్రకటించింది.
- ప్రైమరీ మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.10లక్షల నుంచి రూ.12.25లక్షలకు, సోలార్ పవర్ కోల్డ్ రూంకు రూ.5.25లక్షల నుంచి రూ.18.20లక్షలకు పెంచింది.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 550



చిన్నారులకు వ్యాసరచన పోటీ

ఉలవపాడు, మే 21(ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉలవపాడులోని శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శాఖ గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. తెలుగు విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి తరువాత వారికి నచ్చిన జాతీయ నాయకుడు గురించి వ్యాసం రాయించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాస్కర్‌రాజా ప్యాకల్టీగా వ్యవహరించారు. దాతలు బాపనపల్లి చెంచయ్య, కామక్షమ్మ దంపతులు చిన్నారులకు స్నాక్స్, కూల్ డ్రింక్స్ అందచేశారు.

పెరగని పొగాకు ధర!

● రైతుల ఆందోళన


కలిగిరి వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

కలిగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి గత మూడేళ్లుగా పొగాకు రైతులకు మార్కెట్ అనుకూలించడంతో రికార్డు ధరలు దక్కాయి. దీనికితోడు బోర్డు కూడా గతేడాది కంటే ఈ ఏడాది అధిక పొగాకు ఉత్పత్తికి అనుమతులివ్వడంతో ఎక్కువ మంది పొగాకు సాగుకు మొగ్గు చూపారు. అయితే కొనుగోళ్లు ప్రారంభం అయి రెండునెలలు దాటుతున్నా ధరలు పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది రికార్డుస్థాయిలో పొగాకు ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఈ ఏడాది సాగుపై పడింది. భూమి, బ్యారన్ కౌలు, కట్టె ఖర్చు, పచ్చాకు ముఠా కూలీలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో గతేడాదికన్నా ఒక్కొక్క బ్యారెన్‌కు 30శాతం మేర అదనపు ఖర్చులు పెరిగాయి. 2023-24 సీజన్‌లో ప్రారంభ ధర కిలో రూ.280 పలకగా కొనుగోళ్ల చివరి దశకు వచ్చేసరికి నాణ్యత కలిగిన ఏగ్రేడ్ రకం కిలో ధర రూ.330గా నమోదైంది.

అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు గరిష్ఠ ధరలో మార్పు లేకుండా కొనుగోళ్లు జరుగుతుండటంతో రైతులు ఇటీవల ఆందోళనలకు దిగారు. దీనికితోడు లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయకుండా నోబిడ్ ప్రకటిస్తూ వెనక్కి తిప్పి పంపుతున్నారు. ఇళ్లవద్ద మండెలు పేర్చి, బేళ్లుగా తయారు చేసి వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకును తిరిగి ఇంటికి తీసుకెళ్లాలంటే రైతుకు శ్రమతోపాటు రవాణాఖర్చు కూడా పెరిగిపోతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిపెట్టుబడులు గణనీయంగా పెరగడంతో మార్కెట్ ధరలు పెరగకపోతే తీవ్రంగా నష్టపోతామని పేర్కొంటున్నారు. బోర్డు అధికారులు ప్రభుత్వానికి రైతుల పరిస్థితిని తెలియజేసి మద్దతు ధరలు పెంచాలని కోరుతున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగానే..

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకును కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకుకు డిమాండ్ లేకపోవడంతో కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు. మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానికి అనుగుణంగా పొగాకుబేళ్లను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి. ఈ విషయం రైతులకు సూచిస్తున్నాం.

- ఇసాక్ స్వరన్‌దత్,
వేలం నిర్వహణాధికారి, కలిగిరి

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

● మాధవరావు, లింగసముద్రం పంచాయతీ కార్యదర్శి



లింగసముద్రం, మే 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి. ఇప్పటికే పంచాయతీ సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో లింగసముద్రం పంచాయతీ పరిధిలోని లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, అంబేడ్కర్‌నగర్‌లో సీసీ రోడ్లు, సైడు కాలువలు నిర్మించాం. వీధి లైట్లు వేయడంతోపాటు కాలువల్లో పూడికతీత, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించామని పంచాయతీ కార్యదర్శి ఎం మాదవరావు తెలిపారు.

ముఖాముఖి

? లింగసముద్రం పంచాయతీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్‌లో రూ.7లక్షలతో మూడు సీసీ రోడ్లు, వాకమళ్లవారిపాలెం అయ్యప్పగుడి వద్ద రూ.11 లక్షలతో సీసీ రోడ్డు, సైడు కాలువ నిర్మాణం, రెండు లక్షలతో చిప్స్ రోడ్డు నిర్మాణం, లింగసముద్రం నాయకుల బజారులో రూ.లక్షతో సైడు కాలువ నిర్మించాం.

? దోమల నివారణకు ఏమైనా చర్యలు తీసుకున్నారా. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయిస్తున్నారా.

! అన్ని గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించాం. త్వరలో బ్లీచింగ్ వేయించి, ఎబేట్ మందు స్ప్రే చేయిస్తాం. వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, జంగంరెడ్డిపాలెం గ్రామాలలోల్లోని మంచినీటి ట్యాంకులను ఇటీవల శుభ్రంగా కడిగించి, క్లోరినేషన్ చేయించాం.

? అన్ని గ్రామాల్లో వీధిలైట్లు వేయించారా.

! పంచాయతీలోని అన్ని గ్రామాల్లో మూడు వారాల క్రితం వీధి లైట్లు వేయించాం.

? లింగసముద్రంలో ఇళ్ల నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వస్తున్న మురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! రోడ్లపైకి మురుగు నీరు వదిలే వారికి త్వరలో నోటీసులు ఇస్తాం. అప్పటికీ వినకపోతే ఈఓపీఆర్డీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

నేడు అల్లూరులో ఎమ్మెల్యే పర్యటన

అల్లూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గురువారం అల్లూరులో పర్యటించనున్నారని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే పర్యటనపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మరుగున పడిన తాగునీటి ప్రాజెక్టుకు దాదాపు రూ.55 లక్షల పైచిలుకు నిధులతో మరమ్మతులు చేపట్టామన్నారు. అల్లూరుతోపాటు ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించే విధంగా వినియోగంలోకి తీసుకొచ్చిన ఈ ప్రాజెక్టును పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాలలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే చర్చించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ అటవీ స్క్వాడ్ అధికారుల తనిఖీ

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): పర్మిట్లు లేకుండా టేకు కలప తెచ్చి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణల మేరకు బుధవారం కావలిలో గుంటూరు రేంజ్ అటవీశాఖ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేట్టారు. పట్టణ ఉత్తర శివారులో ఉన్న ఒక టింబర్ డిపోను తనిఖీ చేయగా అక్కడ పర్మిట్లు లేని టేకు కలపను గుర్తించినట్లు తెలిసింది. దీంతో కావలిలోని టింబర్ డిపో వ్యాపారులు అందరూ అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే తనిఖీ చేసిన డిపోలో ఎంత సరుకు పర్మిట్‌లు లేకుండా దొరికిందో, వారికి ఏ మేరకు పెనాల్టీలు విధించారో, లేక సర్దుబాటు చేసుకుని వెళ్లారో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై కావలి రేంజర్ మోహన్‌ను వివరాలు అడగగా తాను విధినిర్వహణలో భాగంగా బయటకు వెళ్లానని, గుంటూరు స్క్వాడ్ అధికారులు వచ్చి వెళ్లారని తెలిసిందని, అందుకు సంబంధించి వారు తమకు సమాచారం ఇవ్వాల్సిన అవసరంలేదని చెప్పారు.

124 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 531 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 407 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-107, ఆర్‌ఆర్-4, సీఆర్-7, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 124బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.244.93గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ.ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

రోడ్డు పక్కన పడిన హోర్డింగ్ ఫ్రేమ్


ట్రంకురోడ్డు పక్కన విరిగి పడి ఉన్న హోర్డింగ్ ఐరన్ ఫ్రేమ్

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం బృందావనం హౌసింగ్‌కాలనీ పక్కన ట్రంకురోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన హోర్డింగ్ ఇటీవల గాలికి విరిగి రోడ్డు పక్కన పడింది. ఆ హోర్డింగ్‌కు సంబంధించిన ఫ్లెక్సీని తీసివేయగా దాని ఐరన్ ఫ్రేమ్ అక్కడే పడి ఉంది. దీంతో ట్రంకు రోడ్డుపై రాకపోకలు సాగించే వారు రాత్రి సమయంలో కొంచెం రోడ్డు మార్జిన్‌లోకి వచ్చారంటే ప్రమాదాలకు గురికాక తప్పదు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో హోర్డింగ్ పడి ఐదారు రోజులు అవుతున్నా హోర్డింగ్ ఏర్పాటు చేసిన వారు కానీ, మున్సిపల్, పోలీస్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. దీంతో దాని వలన ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే కొన్ని వాహనాలు రోడ్డు మార్జిన్‌కు షడన్‌గా వచ్చి కిందపడిన ఇనుప కమ్ముల ఫ్రేమ్‌ను గుర్తించి త్రుటిలో తప్పించుకున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన పడి ఉన్న ఆ హోర్డింగ్ ఫ్రేమ్‌ను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు


ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఇంటర్ విద్యార్థి మనోజ్

ఉలవపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిపై గతంలో జరిగిన దాడిపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కే రాజుపాలెం పంచాయతీ కుమ్మరిపాలెంకు చెందిన కలికివాయి మనోజ్ ఉలవపాడులో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షల సమయంలో కళాశాలలోకి వెళుతుండగా కాలుజారి ముందుకు పడ్డాడు. అది చూసి ఉలవపాడు హైస్కూల్ సంఘంకు చెందిన దాసరి నందకిశోర్ నవ్వాడు. దీంతో ఎందుకు నవ్వుతున్నావని ప్రశ్నించగా నాయిష్టం అంటూ వాదనకు దిగాడు. ఈ క్రమంలో పరీక్ష హాల్లోకి వెళుతున్న మనోజ్‌ను అటకాయించి డొక్కలో పిడిగుద్దులు గుద్దాడు. ఆ విషయం ఆ విద్యార్థి ఇంట్లో పెద్దలకు చెప్పలేదు. కానీ కడుపు నొప్పి ఉందని చెప్పడంతో అప్పటి నుంచి ఉలవపాడు, కావలి, నెల్లూరు ఆసుపత్రిలల్లో చికిత్స చియించారు. తగ్గకపోవడంతో చివరకు ఒంగోలు రిమ్స్‌కు చేరారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో అసలు ఏమి జరిగిందని వైద్యులు ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు, బాధితుడు నిందుతుడు నందకిశోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల అందజేత

కందుకూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్కృతి ప్రైవేటు పాఠశాలలో ఈనెల 11న నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం పాఠశాల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 27 మందికి కోర్సు ఫీజు పూర్తిగా ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక వెలికి తీసేందుకు ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. తరగతుల వారీగా మొదటి బహుమతిగా ట్యాబు, రెండో బహుమతి సెల్‌ఫోన్, మూడవ బహుమతి స్మార్ట్ వాచ్ ప్రదానం చేసి ప్రశంసాపత్రం అందజేశారు.

నేడు హనుమాన్ జయంత్యుత్సవాలు

● విద్యుద్దీపాలతో ముస్తాబైన వలేటివారిపాలెం ప్రసన్నాంజనేయస్వామి ఆలయం


వలేటివారిపాలెం : విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం


విద్యుత్ దీపాలతో ఆంజనేయుడి ప్రతిమ

వలేటివారిపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంత్యుత్సవాలకు వలేటివారిపాలెంలోని దక్షణముఖ ప్రసన్నాజనేయస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని రకరకాల విద్యుత్ దీపాలతో భక్తులకు కనువిందుచేసేలా అలంకరించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి సిందూరం దిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. పలువురు భక్తులు అన్నదానం, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు, మినరల్ వాటర్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు తిలకించేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను నిర్వాహకులు పరిశుభ్రం చేయించారు.

● ఏర్పాట్లు పూర్తి

కలిగిరి : మండలంలోని కమ్మవారిపాలెం, జిర్రావారిపాలెం తిప్ప, కలిగిరి పట్టణాలలో గురువారం జరగనున్న హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం చలువపందిళ్లు వేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● చౌదరిపాలెంలో...

కావలి రూరల్ : కావలి మండలం చౌదరిపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంత్యుత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం అభిషేకాలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రాత్రి 8 గంటలకు స్వామివారికి ఆకు పూజ, ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రాత్రి స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యార్థులకు షింగింగ్ స్టార్స్ అవార్డులు


మంత్రి లోకేష్ నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థిని వీరమోసు జయసంహిత

వలేటివారిపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో చదివి పదవ తరగతిలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు మంగళవారం విజయవాడలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు షింగింగ్ స్టార్స్ ప్రోత్సాహక అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో వీరమోసు జయసంహిత, బోడా నవ్యశ్రీ, ప్రగడ రాజేష్, మీసాల మనోజ్ఞ, చెరువుపల్లి హతివకసాయికోటి ఉన్నారు. జిల్లాలో ఈ అవార్డులకు 9 మంది విద్యార్థులు ఎంపిక అవ్వగా వారిలో ఐదుగురు చుండి మోడల్ స్కూల్ విద్యార్థులు ఉండడం విశేషం. అవార్డులు అందుకున్న విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

వైసీపీకి అమరా వేదగిరి గుడ్‌బై

● క్రియాశీలక సభ్యత్వానికి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా


మాట్లాడుతున్న అమరా వేదగిరి

కావలి, మే 21(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో వైసీపీకి ఒకరి వెంట ఒకరు దూరమవుతున్నారు. వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్, 33వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా తన పదవికి రాజీనామ చేసి పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు కావలి పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వలన తాను వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వార్డులోని నాయకులు, తన శ్రేయోభిలాషులతో చర్చించిన అనంతరం ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని చెప్పారు. అయితే ఆయనకు టీడీపీలో లైన్‌క్లియర్ కావడంతో త్వరలో టీడీపీలో చేరతారనే ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆయన వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం అందుకు బలం చేకూరుస్తోంది.

రాళ్లపాడు కుడి, ఎడమ కాలువ కట్టల

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

లింగసముద్రం, మే 21(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ కట్టల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.75 లక్షలు మంజూరు చేసింది. రెండు నెలల క్రితం ప్రాజెక్టులో ఉన్న సమస్యలను పరిష్కరించేందకు నిధులు మంజూరు చేయాలని ప్రాజెక్టు ఈఈ మునిరత్నం ఆదేశించారు. మంజూరైన రూ.75 లక్షలలో ప్రాజెక్టులోని సబ్ డివిజన్-1కి రూ.52.50 లక్షలు. సబ్ డివిజన్-2కు రూ.22.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలను పంపడంతో నిధులు మంజూరయ్యాయని డీఈ ఎం వెంకటేశ్వర్లు బుధవారం చెప్పారు. ఈ నిధులతో ప్రాజెక్టు వంతెన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లు తొలగింపు, ఎడమ కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు ఉన్న కాలువ కట్ట రోడ్డును అవసరమైన చోట గ్రావెల్‌తో నిర్మిస్తామన్నారు. అలాగే కుడి కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు ఉన్న 20 కిమీల కాలువ కట్ట రోడ్డును కూడా అవసరమైన చోట గ్రావెల్‌తో మరమ్మతులు చేస్తామన్నారు. అలాగే కుడి కాలువ పరిధిలోని జంగాలపల్లి బ్రాంచ్ కెనాల్ కాలువ రోడ్డును కూడా బాగు చేస్తామని చెప్పారు. నామినేషన్ పద్ధతిలో జరిగే ఈ పనులు వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం


వలేటివారిపాలెం : ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరించిన నిర్వాహకులు, గ్రామస్థులు


చిత్రగుంట : సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు


కావలిటౌన్ : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

కావలిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి) : ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసివున్న హరిహర సమేత హనుమత్ క్షేత్రంలో జరుగుతున్న హనుమత్ జయంత్యుత్సవంలో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. హనుమత్ క్షేత్రం వ్యవస్థాపక ప్రధాన అర్చకుడు వేదగిరి సూర్యనారాయణ చార్యులు పర్యవేక్షణలో ఉదయం శ్రీరాముడికి అభిషేకం శ్రీరామ హోమం పూజలు, మహా నివేదన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీరామ కోటి పుస్తకాల ఉత్సవం జరగగా రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తజనం పెద్దఎత్తున పాల్గొని కల్యాణ మహోత్సవం తిలకించారు. అనంతరం శ్రీరామ లేఖిన పుస్తకాలను శ్రీరామ క్రతుస్తంభంలో వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు..

జమీన్‌ఉప్పలపాడులో...

వలేటివారిపాలెం : మండలంలోని జమీన్‌ఉప్పల పాడులో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల నడుమ అర్చకులు ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణానికి తిలకించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమినేని రవీంద్ర, సోమినేని నరసింహం, సోమినేని మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 16 రోజుల పండుగ

చిత్రగుంట : బోగోలు మేజర్ పంచాయతీ పాత దళితవాడలోని కోదండ రామస్వామి ఆలయంలో వెలసి ఉన్న సీతారాముల కల్యాణం అనంతరం బుధవారం పదహారు రోజుల పండుగ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజాభిషేకాలు, మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డీఆర్‌యూసీసీ సమావేశంలో కావలి స్టేషన్ సమస్యలు


వేణుమాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్‌ఎం నరేందర్‌పటేల్

కావలిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేందర్‌పటేల్ పర్యవేక్షణలో బుధవారం విజయవాడలో జరిగిన డీఆర్‌యుసీసీ సమావేశంలో కావలి సమస్యలపై డీఆర్‌యుసీసీ సభ్యుడు వేణుమాధవ్ ప్రస్తావించారు. కావలి రైల్వే స్టేషన్ పడమర వైపు బుకింగ్ కౌంటర్ ఏర్పాటు, బ్రిడ్జి పొడిగింపు, 3, 4ప్లాట్‌ఫామ్‌లలో మొబైల్ టికెట్ కౌంటర్‌ల ఏర్పాటు, శబరి, పద్మావతి, జోదాపూర్ తదితర రైళ్ల నిలుపుదల సమస్యలపై ప్రస్తావించారు. పై సమస్యల పట్ల డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారని త్వరలో సమస్యల పరిష్కారం జరుగుతాయని వేణుమాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫారం పాండ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టండి : ఏపీడీ

లింగసముద్రం, మే 21(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్ల నిర్మాణాలకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం కందుకూరు ఏపీడీ జే బాబూరావు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాలులో మండల ఇన్‌చార్జి ఏపీవో దయాసాగర్ అధ్యక్షతన జరిగిన లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల టీఏలు, ఎఫ్ఏల సమావేశంలో ఏపీడీ పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ప్రారంభమైన ఫారం పాండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, కొత్త వాటిని నిర్మించేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. రైతులు ఉద్యానవన పంటల సాగుకు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. నిమ్మ, మామిడి, జామ మొక్కల సాగుకు ముందుకొచ్చే రైతులు ఏపీవో, ఎంపీడీవోలను సంప్రదించాలన్నారు. ఆ రైతులకు 100 శాతం సబ్సిడీతో మొక్కలు అందజేస్తామన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా, కట్టలపైన పల్లెవనం కింద మొక్కలు నాటించాలన్నారు. అలాగే కూలీల సంఖ్యను పెంచాలని, చెప్పారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెరుగు రామకృష్ణకు స్వర్ణ కంకణం

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు బుధవారం స్వర్ణ కంకణం తొడిగారు. ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. వీసీ చాంబర్‌లో అరసం కవితా స్రవంతి పుస్తకాలు, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య సంపాదకీయంలో వెలువడిన అద్దేపల్లి రామమోహన్‌రావు కవిత, పెరుగు రామకృష్ణ సంపాదకత్వంలో ముద్రిం చిన పట్టాభి కవితల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ఈతరం కోసం 20 పూర్వ అభ్యుదయ కవుల కవితలను చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రించి పరిచయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో చిత్రకారుడు అరవ రవిబాబు, అభ్యు దయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ పెరుగు రామకృష్ణను సత్కరిస్తున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు

టెన్త్ సప్లిమెంటరీకి 380 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మే 21 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో బుధవారం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు 966 మంది విద్యార్థులు దర ఖాస్తు చేసుకోగా 586 మంది హాజరయ్యారు. 380 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలకు 355 మంది హాజరు కావాల్సి ఉండగా 291 మంది హాజ రుకాగా 64 మంది గైర్హాజరయ్యారు. డీఈవో బాలాజీ రావు రెండు, ఫ్లయింగ్ స్క్వాడ్ 24 కలిపి మొత్తం 26 కేంద్రాలను పరిశీలించారు.



వహాబ్‌పేటలో..





సండేమార్కెట్‌లో..







రామలింగాపురం వంతెన వద్ద నగరవాసుల అవస్థలు

ముంచెత్తిన వాన

● నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు

బుధవారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రామలింగాపురం బ్రిడ్జి, పొగతోట, సండే మార్కెట్, గాంధీపార్కు రోడ్డు, ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలలో నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



బిందు సేద్యంతో సాగయిన కరపుచ్చ (ఫైల్)



స్ప్రింక్లర్లతో సాగు చేసిన వేరుశనగ

మార్గదర్శకాల కోసం

ఎదురుచూపులు

● సూక్ష్మ సేద్యంపై కొత్త ఆశలు

● పరికరాల రాయితీ పెంచాలని రైతుల డిమాండ్

సంగం, మే 21 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు సంబంధించి కొత్త మార్గదర్శకాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈసారైనా సబ్సిడీ పెంచుతారని ఆశలు పెట్టుకున్నారు. మార్గదర్శకాల జారీలో జాప్యమవుతుంది. దీంతో అన్నదాతలకు నిరీక్షణ తప్పట్లేదు. 2025 -26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటినా ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

● గతంలో రాయితీ తగ్గింపు

గత వైసీపీ ప్రభుత్వంలో డ్రిప్, స్ప్రింక్లర్లపై రాయితీ తగ్గించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవంత్సరంలో దాన్నే కొనసాగించారు. టీడీపీ హయాంలో అమలు చేసిన పాత రాయితీ విధానాన్ని పునరుద్ధరించి న్యాయం చేస్తామని చంద్రబాబునాయుడు హామీఇచ్చారు. గతేడాది రాయితీ పెంచలేదు. ఈ నేపథ్యంలో 10 నెలలుగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేశారు. జిల్లాలోని పలు నియోజక వర్గల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీ పెంచాలని కోరారు. కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా సబ్సిడీ పెంచి, న్యాయం చేస్తారని ఆశగా ఉన్నారు.

● సబ్సిడీ పెంచాలని వేడుకోలు

గత టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ సేద్యం పరికరాలకు పదెకరాల వరకు 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇచ్చారు. వైసీపీ పాలనలో సూక్ష్మ సేద్యం పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్‌లైన్స్ మార్చారు. ఐదెకరాలదాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీని పూర్తిగా ఎత్తేశారు. ఇతర కేటగిరీల రైతుల తరహాలోనే సబ్సిడీపోను మిగతా డబ్బులు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు షరతు పెట్టారు. దీంతో అప్పట్లో భరించలేక ఎస్సీ, ఎస్టీ రైతులు ఎవరూ దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రాలేదు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పదెకరాల దాకా 90 వాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరు చేస్తామని చెప్పడంతోపాటు టీడీపీ హయాంలో అమలైన విధంగా మిగతా కేటగిరీల రైతులకు డ్రిప్, మంజూరు చేస్తామని చంద్రబాబునాయుడు ప్రతిపక్ష హోదాలో హామీ ఇచ్చారు. ఆయన సీఎం అయి పదకొండు నెలలే పూర్తయింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలోనైనా ఆ హామినీ అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రాసం లేక విలవిల

● గడ్డి దొరక్క మూగజీవాల ఇక్కట్లు

● ఆకాశాన్నంటుతున్న ధరలు

● బెంబేలెత్తుతున్న పశుపోషకులు

ఉదయగిరి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే అత్యధికులు ఆధారపడి జీవిస్తున్నారు. మెట్టలో పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం రైతులకు జీవనాధారంగా మారింది. ఈ తరుణంలో రోజురోజుకు పశుగ్రాసం ధరలు ఆకాశాన్నంటు తుండడంతో పాటు కొరత ఏర్పడింది. దీంతో పాడి రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. అధిక ధర చెల్లించి పశుగ్రాసం కొనుగోలు చేసి మూగజీవాలను పోషించడం తలకు మించిన భారంగా మారింది.

● పచ్చగడ్డి కనుమరుగు

జిల్లా వ్యాప్తంగా 6,46,106 గేదెలు, 57,774 ఆవులు, 10.95 లక్షల గొర్రెలు, 3.86 లక్షల మేకలు ఉన్నాయి. వాటిని పోషించే యజమానులకు గ్రాసం కొరత ఏర్పడింది. ఈ ఏడాది మండిపోతున్న ఎండల పుణ్యమాని పచ్చిక బయళ్లు ఎండు ముఖం పట్టాయి. కనుచూపు మేర పచ్చి గడ్డి స్థానంలో ఎండుగడ్డి దర్శనమిస్తున్నది. దీంతో ఎలాగోలా ఆ ఎండు గడ్డినే తింటూ మూగజీవాలు కడుపునింపు కుంటున్నాయి. ఈ నేపథ్యంలో మైదానాలు, కొండల్లో సంచరించే ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో ఎండుగడ్డి సైతం గగనం అవుతుంది. అంతేకాక ఆశించిన మేర వర్షాలు కూడా కురవక పోవడంతో చెరువులు, వాగులు, వంకల్లో నీటి నిల్వ లేకపోవడం పశువులకు శాపంగా మారింది. దీంతో చేసేదేమిలేక కొంతమంది రైతులు తమ జీవాలను తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారు.



ట్రాక్టర్లలో వరిగడ్డిని తీసుకెళ్తున్న రైతులు

● ఆకాశాన్నంటిన గ్రాసం ధరలు

గతంలో ఎన్నడూలేని విధంగా పశుగ్రాసం ధరలు నేడు ఆకాన్నంటుతున్నాయి. ట్రాక్టరు వరిగడ్డి గతంలో రూ. 12వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ. 15వేల వరకు పలుకుతోంది. ఒక్కో గేదెకు సుమారు ఏడాదికి రెండు ఎకరాల పశుగ్రాసం అవసరం. ఆ వంతున రూ. 30వేల వరకు వెచ్చించాల్సి వస్తున్నది. వీటికితోడు రవాణా చార్జీలు అదనంగా మారడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరమైంది. పాల దిగుబడి సైతం తగ్గుముఖం పడుతుండడంతో పోషణకు అయ్యే పెట్టుబడులు కూడా రావడంలేదని వారు బెంబేలెత్తుతున్నారు.

పశుగ్రాసం అందించాలి



ఎండుగడ్డి ధరలు అమాంతం పెరగడంతో పశువుల పెంపకం భారంగా మారింది. అప్పులు చేసి వాటిని పోషించలేక పోతున్నాం. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి.

- యలమందల మీరయ్య, పాడిరైతు, తూర్పుబోయమడగల

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం ద్వారా చేపడు తున్న గడ్డి పెంపకం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ. 33వేల వరకు రాయితీ కల్పిస్తోంది. పశువుల దాణా కోసం ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం.

- ఎస్‌వీ రాఘవేంద్రశర్మ, పశువైద్యాధికారి

రాజుపాలెం రీచ్‌కు సింగిల్ టెండర్..!

కలెక్టర్ నిర్ణయం ఏమిటో...!

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలం రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలకు అధికారులు పిలిచిన టెండర్లో కీలక పరిణామం కనిపిస్తోంది. సాధారణంగా ఇసుక టెండర్లకు పోటీ పడే కాంట్రాక్టర్లు ఎవరూ ఇక్కడ పోటీకి రాలేదు. కేవలం ఒకే ఒక టెండర్ దాఖలైంది. రాజుపాలెం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారానికి ఈ సింగిల్ టెండర్ బలం చేకూరుస్తోంది. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆ టెండర్ వెనుక ఆంతర్యమేమిటో..?' కథనం కలకలాన్ని రేపింది. సంబంధిత జిల్లా అధికారుల వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై కలెక్టర్ ఓ ఆనంద్ కూడా సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ నిబంధనలకు విరుద్ధంగా రాజుపాలెం వద్ద పెన్నాలో ఇసుక తవ్వకాలు జరుపుతుండగా అది వివాదాస్పదమైంది. అయితే ఏదో ఒక రకమైన పర్మిషన్ తెచ్చుకొని దర్జాగా తవ్వుకోవచ్చునని కొందరు అక్రమా ర్కులు స్కెచ్ వేసినట్లు ఆరోపణలున్నాయి. ఆ క్రమంలోనే మానవశక్తి డీసిల్టేషన్ పేరుతో టెండర్ పిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే గతంలో జరిగిన పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం డీసిల్టేషన్ ఇసుక టెండర్లకు పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు. కొందరైతే కాంట్రాక్ట్ కోసం ఏకంగా హైకోర్టుకు వెళ్లి తెచ్చుకున్నారు. అలానే గత నెలలో జరిగిన మినగల్లు, విరువూరు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు కూడా నలుగురు చొప్పున టెండర్లు వేశారు. కానీ ఇప్పుడు రాజుపాలెం రీచ్‌కు మాత్రం ఒక్కటే టెండరే దాఖలు కావడం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తోంది. అయితే పోటీగా ఎవరూ టెండర్లు వేయకుండా కొన్ని శక్తులు తెరవెనుక మంత్రాంగం నడిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ టెండర్లను బుధవారం ఓపెన్ చేయాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదు. గురువారం ఓపెన్ చేస్తామని ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు తెలిపారు. మరి ఇన్ని ఆరోపణలు ఎదుర్కొంటూ సింగిల్ టెండర్ దాఖలైన రీచ్‌పై కలెక్టర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 45.375 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

● రాపూరు : కండలేరు డ్యాం లో 42.714 టీఎంసీలుగా ఉందని కండలేరు ఏఈ తిరుమలయ్య తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్ ఫ్లో 2480 క్యూసెక్కులు ఉందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 2360, లోలెవల్ స్లూయూస్ ద్వారా 60, హైలెవల్ కెనాల్ ద్వారా 60 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఆయన వివరించారు.



నేడు హనుమజ్జయంతి

● ఆలయాల్లో భారీ ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), మే 21 (ఆంధ్రజ్యోతి) : స్వామి భక్తికి, పరాక్రమానికి, కార్యసిద్ధికి, అమేయ ధైర్యసాహసాలకు పెట్టింది పేరు హనుమంతుడు. రామబంటుగా సీతాన్వేషణలో, లంకా దహనం, శత్రు సంహారంలో కీలక పాత్రధారి. ఆ స్వామి అవతరించిన రోజును హనుమజ్జయంతిగా భక్తులు ఏటా జరుపుకుంటారు. గురువారం జరిగే ఈ పండుగకు జిల్లాలోని వైష్ణవాలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రామాలయాలు, మందిరాలు, ఆంజనేయ స్వామి ఆలయాలను విద్యుద్దీ పాలు, చలువ పందిళ్లు, మంగళతోరణాలతో అలంకరించారు. పంచామృతా భిషేకాలు, హోమాలు, సహస్ర నామార్చనలు, ఆకు పూజ, మల్లెపూలతో అర్చన, వాహన సేవలు, సీతారామ కల్యాణోత్సవాలు జరపనున్నారు. నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం, సంతపేట ఆంజనేయ స్వామి ఆలయం, బాలాజీనగర్ సీతారామ మందిరం, సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో ఉన్న కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయం, రాయాజీ వీధి హనుమాన్ మందిరం, పప్పులవీధి ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు జరగనున్నాయి.



మూలకు చేరిన ఎండీయూ వాహనం

డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

● వచ్చే నెల నుంచి అమలులోకి..

● 438 ఎండీయూ వాహనాలకు ఇక చెల్లు

ఉదయగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి నిత్యావసర వస్తువుల పంపిణీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. అయితే ఆచరణలో మాత్రం పలుచోట్ల వీధుల్లో కూడా సరుకులు పంపిణీ చేయలేకపోయింది. ఎండీయూ ఆపరేటర్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఉండటంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా.. ప్రజా పంపిణీ వ్యవస్థ తయారైంది. డీలర్లకు పని లేకుండా చేయడంతోపాటు నిత్యం సర్వర్ సమస్యతో కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందేవి కావు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 438 వాహనాలకు ఇక కాలం చెల్లింది. జూన్ 1 నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న 1,513 చౌకదుకాణాల ద్వారా 7,22,257 లక్షల మంది కార్డుదారులకు సరుకులు అందించేలా ప్రణాళిక రూపొందిస్తోంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నెలంతా రేషన్ దుకాణాలు పనిచేసేలా చర్యలు చేపట్టడంతోపాటు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే సరుకులు అందించేలా చర్యలు చేపడుతోంది. అవినీతి, అక్రమాలకు తావులేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ చేయనుంది

భూగర్భ గ్యాస్ పైపులైన్ల ఏర్పాటులో జాగ్రత్త

నెల్లూరు(సిటీ), మే 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పొదలకూరు రోడ్డు వెంబడి నూతనంగా ఏర్పాటు చేస్తున్న భూగర్భ గ్యాస్ పైపులైన్ల నిర్మా ణంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ సూచించారు. బుధవారం ఆయన చాంబరులో ఏజీపీ సిటీ గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పనులు మొదలుపెట్టిన, ఆపిన వెంటనే కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి తెలియ చేయాలన్నారు. అనుమతించిన మేరకు మాత్రమే తవ్వకాలు జరపాల ని ఆదేశించారు. యూజీడీ, తాగునీటి పైపులకు ఏ మాత్రం ఆటకం కలగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం బుధవారం కురిసిన వర్షంతో నిండిన ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు.

● షోకాజు నోటీసులు

వడారుపల్లి ప్రాంతంలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. స్థానికంగా ఉన్న భవనాలకు కొలతలు వేశారు.

డబ్బిస్తేనే సర్టిఫికెట్!

● పారామెడికల్ కాలేజ నిర్వాహకుల దోపిడీ

● పూర్తయినా డీఎంఎల్‌టీ కోర్సులకు రూ. 5వేలు లంచం

● యూజీసీకి ఫిర్యాదు చేసిన విద్యార్థులు

నెల్లూరు (వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ కోర్సులు చేస్తే ఎంతో కొంత ఉపాధి దొరకుతుందని చాలా మంది యువతీ యువకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ) వంటి పారామెడికల్ కోర్సులలో చేరుతున్నారు. కోర్సు పూర్తయితే ప్రభుత్వ రంగంలోనూ సొంతంగానో ల్యాబ్ పెట్టుకుని ఉపాధి పొందాలని భావిస్తున్నారు. ఆ మేరకు ఫీజులు చెల్లించి, కష్టపడి చదివి కోర్సు పూర్తి చేస్తారు. తీరా సర్టిఫికెట్ల కోసం వెళితే ఆయా కళాశాలల యాజమాన్యం నగదు డిమాండ్ చేస్తోంది. కావలిలోని ఓ పారామెడికల్ కళాశాల యాజమాన్యం డబ్బులు వసూలు చేస్తుండటంతో కొంత మంది విద్యార్థులు నిరాకరించారు. దీంతో ఈ అక్రమాల విషయం వెలుగు చూసింది.

● అసలేం జరిగిందంటే!

2021-22లో పలువురు విద్యార్థులు రెండేళ్ల డీఎంఎల్‌టీ కోర్సులో చేరేందుకు నెల్లూరులోని ఓ నర్సింగ్ కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించారు. అయితే, కళాశాలకు అనుమతులు రాకపోవడంతో ఆ కళాశాల అధినేత సూచనల మేరకు కావలిలోని మరో కాలేజీలో చేరారు. ఈ క్రమంలో రెండేళ్లపాటు అన్ని రకాల ఫీజులను చెల్లించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాసయిన విద్యార్థులు సర్టిఫికెట్లు కావాలని కావలిలోని పారామెడికల్ కళాశాల యాజమాన్యాన్ని కోరారు. రూ.5 వేలు లంచం ఇస్తే సర్టిఫికెట్లు ఇస్తామని వారు చెప్పడంతో విద్యార్థులు ఖంగు తిన్నారు. ఇలా సదరు కళాశాల యాజమాన్యంతో మధ్య జరిగిన ఫోన్ సంభాషణను విద్యా ర్థులు రికార్డు చేశారు. బుధవారం నెల్లూరులోని నర్సింగ్ కాలేజీకి వెళ్లగా అక్కడ కాలేజీ అధినేత లేకపోవటంతో ఫోన్‌లో విషయం చెప్పారు. తాము అన్ని రకాల ఫీజులు కట్టేశామని అదనంగా డబ్బులు అడగటమేమని నిలదీశారు. అయితే కావలిలోని కాలేజీ నిర్వాహకులను అడగాలంటూ ఆయన తప్పించుకునే ప్రయత్నం చేశారు.



Gmail

Srinivasulu Devarakonda <srinulic.cab@gmail.com>

PLEASE HELP ME TO GET MY DMLT PASS CERTIFICATES.

Srinivasulu Devarakonda <srinulic.cab@gmail.com> Mon, May 19, 2025 at 8:05 PM

Draft

I AM CHANDALURI PRAMILA, I WAS STUDIED AT S.V.COLLEGE OF PARA MEDICAL EDUCATION [DMLT], KAVALI, SPSR NELLORE Dist.,ANDHRA PRADESH.

I HAVE COMPLETED, DIPLOMA MEDICAL LAB TECHNOLOGY [DMLT] COURSE, AND I HAVE PASSED THIS COURSE. AFTER I WAS ASKED THE COLLEGE CORRESPONDENT TO GIVE MY DMLT PASSED CERTIFICATES, BUT HE WAS DEMANDING RS.5000/- FOR GIVING THOSE CERTIFICATES. I DONT HAVE ANY PENDING FEES TO COLLEGE.BUT THEY ARE DEMANDING MONEY FOR GIVING CERTIFICATES. NOT ONLY ME ALL THE STUDENTS ARE SUFFERING FROM THIS PROBLEM. SOME STUDENTS HAS ALREADY GAVE MONEY AND TOOK THEIR CERTIFICATES.

SO, I KINDLY REQUEST YOU TO TAKE ACTION.

COLLEGE CORRESPONDENT- SRI. DASARADHA RAMIREDDY GARU, CELL-9492336939

ADDRESS OF THE COLLEGE:
S.V.COLLEGE OF PARA MEDICAL EDUCATION,
KAVALI
SPSR NELLORE DIST,
ANDHRA PRADESH.
PIN- 524201

యూజీసీకి విద్యార్థిని పంపిన ఫిర్యాదు పత్రం

● యూజీసీకి ఫిర్యాదు

జిల్లాలో 23 నర్సింగ్ కళాశాలలు ఉండగా వాటిలో 9 కళాశాలల్లో పారామెడికల్ కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఒక బ్యాచ్ డీఎంఎల్‌టీ కోర్సును పూర్తి చేసుకుని బయటకు వెళుతుంది. కోర్సు పూర్తయిన తర్వాత దాదాపు అన్ని కళాశాలల్లో ఇలాగే సర్టిఫికెట్ల కోసం అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా నగరానికి చెందిన ఓ విద్యార్థిని సర్టిఫికెట్ల కోసం తమను లంచం అడుగుతున్నారని కావలిలోని పారామెడికల్ కళాశాలపై ఫిర్యాదు చేస్తూ యూజీసీకి మెయిల్ పంపింది. దీంతో యూజీసీ అధికారులు 20 రోజుల్లో విచారణ చేస్తామని రిప్లై కూడా ఇచ్చారు.

పూర్తిస్థాయిలో విచారిస్తాం

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తా. ఆయా కళాశాల యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాను. డీఎంఎల్‌టీ విద్యార్థులకు అండగా ఉంటాను.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి